UNIVERSAL
LIBRARY

OU_204573

UNIVERSAL
LIBRARY

OUP—556—13-7-71—4,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T82
L19Ka

Accession No. T348

Author లక్ష్మీనరసింహారావు, పానుగంటి.

Title కల్యాణరాఘవము. 1915.

This book should be returned on or before the date last marked below.

శ్రీ

# కళ్యాణరాఘవము

ఆఱంకముల నాటకము.

ఇది

ప్రచండచాణక్యము; నర్మదా పురుకుత్సీయము మొదలగు

నాటకముల రచించిన,


పానుగంటి లక్ష్మీనరసింహారావుగారిచే


రచియింపఁబడి,


తణుకు

శ్రీ సౌదామినీముద్రాక్షరశాలయందు ముద్రింపఁబడి

ప్రకటింపఁబడియె.

1915.



కాపీరైట్]


మొదటికూర్పు 1000 ప్రతులు.


[రిజస్టర్డు.



వెల 0—౮—0.

# పీఠిక.

శ్రీకల్యాణరాఘవమను నీనాటకమును 1910సంవత్సరములో నే నానెగొండిసంస్థానమున నున్నప్పుడే యారంభించితిని. కాని మొదటి యంకముమాత్రమే యప్పుడు వ్రాసితిని. 1915సంవత్సరములోని జనవరినెలలో శ్రీపిఠాపురసంస్థానప్రభువులగు శ్రీరాజా వేంకటాద్రి అప్పారావుబహద్దరుగారి ప్రోత్సాహమున మిగిలిన యంకములవ్రాసి పూర్తిచేసితిని. ఇదివఱకుఁబట్టభంగ, వనవాసవిజయరాఘవముల వ్రాసియుంటిని కాన దీనితో శ్రీమద్రామాయణమునంగల పట్కాండములలోని కథను రూపకరూపముగ నొనరించినవాఁడ నైతిని. ఉత్తరరాఘవమును వ్రాయఁదలఁచుకొనలేదు.

సన్నుతిఁగాంచిన వారును శ్రీరాజా వేంకటకుమార మహీపతి సూర్యారావుబహద్దరు వారీగ్రంథమును దమసాముఖ్యముచే నచ్చు యించిరి. ఆంధ్రభాషాభిమానులు, ననేకకవిపండిత పరిపోషకులు నత్యంతవితరణశీలురు, శ్రీపీఠికాపురసంస్థాన ప్రభువులునగువీరికి, వీరి కుటుంబమునకు, శ్రీపరమేశ్వరుఁడు దీర్ఘాయురారోగ్యసకలసంపత్సౌఖ్య సమృద్ధులనిచ్చి రక్షించుగాక.

శ్రీరామకృష్ణపరమహంసచరిత్ర శ్రీగౌరాంగచరిత్రాద్యుత్తమగ్రంథరచయితలును, నాకుఁజిరకాలమిత్రులునగు బ్రహ్మశ్రీ కూచి నరసింహముగారు దీనికి నాందీప్రస్తావనలను వ్రాసియిచ్చిరి. వారికనేక వందనము లాచరింతును.

12—3—15 }
పిఠాపురము. }

పానుగంటి లక్ష్మీనరసింహరావు.

## ఈనాటకమునందువచ్చు పాత్రములు.

### పురుషులు.

దశరథుఁడు—కోసలదేశాధిపతి.

| | | |
|---|---|---|
| రాముఁడు— | } | దశరథపుత్త్రులు. |
| లక్ష్మణుఁడు— | } | |
| విశ్వామిత్త్రుఁడు— | } | ఋషులు |
| వశిష్ఠుఁడు— | } | |

నారాయణుఁడు—విశ్వామిత్త్రశిష్యుఁడు.

శతానందుఁడు—జనకుని పురోహితుఁడు.

శంకరుఁడు—వశిష్ఠశిష్యుఁడు.

జనకుఁడు—మిథిలానగరాధినాథుఁడు.

శతానందుఁడు—జనకునిపురోహితుఁడు.

### స్త్రీలు.

| | | |
|---|---|---|
| కౌసల్య— | } | దదరథునిభార్యలు. |
| సుమిత్త్ర— | } | |
| కైక— | } | |

కావేరి—కౌసల్యదాసి.

రుచిర—కైకదాసి

తాటక—రాక్షసాంగన.

సీత—రామునిసతి.

మృదుల—సీత చెలిమికత్తె.

శ్రీ

# కల్యాణరాఘవము.

## ప్రస్తావన.

### నాంది.

మ. నవనీతోపమకాయుఁ డాంబుజసుతుం డక్షై ♦ న, న్మూర్ఖశౌర్యంబుతో
సవనంబున్నెఱవేర్చి, గాధిసుతుని ♦ స్సంతుష్టుఁ గావించి, శం
భుచాపంబవలీలఁ ద్రుంచి, సిరియగా ♦ భూపుత్త్రిఁ గైకొన్నట్టి, రా
ఘవరాముండు, దయాప్తిమీకొసఁగుత ♦ న్కల్యాణము న్నిత్యముం.

(నాంద్యంతమున సూత్రధారుఁడు తెరవంకఁ జూచి)

సూత్ర — నటీ! ఇటొకసారి రమ్ము.

(ప్రవేశించిన నటిఁ జూచి)

ప్రేయసీ! పానుగంటి లక్ష్మీనరసింహరావుగారు పండ్రెండవ నాటక మొకటి క్రొత్తగా వ్రాసినారు. తత్ప్రదర్శనకార్యమందు నీవు నాకు సహాయురాలవగుదువను నాశతో నిన్నిప్పుడు పిలిచితిని.

నటి — అసహాయశూరులకు సాహాయ్యము నిమిత్తమాత్రమైనను నాయందలిదయచే, గౌరవము చేసినట్లుఁ దోఁపుచునుంటిరి. కాని యీనాటకమేదో సెలవిచ్చెదరా?

సూత్ర—

గీ. పరిభూతరామాయణగ్రంథ ♦ బాలకాండ
మందలికథను దెల్పక ♦ ల్యాణరాఘ
వంబునా నొప్పు నొకనాట ♦ కంబు కంబు
కం! యిది, సర్వశుభదాయి ♦ కంబుమనకు.

నటి—(నవ్వుచు) ఇచటనా? అచటనా?

సూత్రి—అట్లనెదవేమి?

నటి—ఇచటనేయయినయెడల, నెన్ని నాటక ప్రదర్శనములు గావించినను గనుబొమలమీఁది వానివలె నొక్కరీతిగ నుంటిమి కదా?

సూ—ధనవంతులము గాలేదనియా నన్నుఁ బరిహాసించుచున్నావు?

అ॥ ధనమెసుఖదమంచుఁ ♦ దలఁతువే, ధనులలోఁ
నతిదరిద్రులుండు ♦ నధికదుఃఖు
లైనవారుగలరు; ♦ కానసుఖంబునొ
సంగఁగ్రుక్కిలను ♦ సాటిలేదు.

న—ప్రశ్నోత్తరసందర్భము బాగుగనున్నది! అటులే నిమా "సర్వశుభదాయకము" త్రిగావలయునుఁగాని నాటకమెట్లగును?

సూ—నీ ప్రశ్నకుంటచిక్కులు పెట్టుకొంటివుసుమా!

గీ. చేసిచేసర్వసుఖములు ♦ మానవునకుఁ
జేయరునొయట్టిత్రోత్రీఁదె ♦ చ్చియిడునీవ
విశ్రీనాటక, మంగుచే ♦ వివిధసౌఖ్య
దాయకంబిదియనవచ్చుఁ ♦ దోయజాక్షి!!

న—సరే! తెలిసినది, లేనివియున్నట్లు తలఁచుకొనిసంతసిం

చూటకదా తృప్తి ! అట్టిభావనాజన్య మహానందప్రవాహంబున నోలలాడ్చు నాటకముగాన "సర్వశుభప్రద" మంటిరి కాఁబోలు.

సూ—ఓ ! గడుసుదానా ! నన్నెక్కడనుండి యెక్కడకీడ్చుకొనిపోవుచుంటివి ! పావనగ్రంథసంభాషణము భావజానందములో విరమింపఁజేసితివే ! నీవే నన్ను జయించితివి. పోనిమ్ము. ఈప్రపంచమందాఁడువారి క్రోడనివా రెవరు?

గీ. క్రూరనారాచవితతికి, ♦ ఘోరకదన
రవములకు, జంకనట్టివీ ♦ రపురుషుఁడును,
గలికిక్రొవ్వాఁడిచూపుఁదూ ♦ పులకు, జిలుక
పలుకులకుఁ బాలిదాసుఁడై ♦ పడునుగాదె !

నటి—మీరుమాత్ర మాఁడువారుకారా? కల్లమీసములతోఁ గట్టికత్తులతో నాఁడువారాఁడువారికోడిరి. దానికేమిగాని, యీశృంగారప్రసంగమింతటితోఁ గట్టిపెట్టి, కథానాయకుఁడును బతితపావనుండు నగు శ్రీరామచంద్రమూర్తింగూర్చి యొకింత చెప్పఁ; దదివిని నాటక ప్రదర్శనమునకుఁ బోయెదను.

సూత్ర—ప్రియురాలా ! మంచిత్రోవకు వచ్చితివి. శ్రీరామమహిమ యడుగుటకుం జెప్పుటకుఁగూడఁ దగినది. కాని పూర్ణముగఁ దృప్తికరముగ వర్ణింప నా కశక్యము.

గీ. అవనిరక్షింపదయతోడ ♦ నవతరించి
నట్టియా సచ్చిదానంద ♦ మైనతండ్రి,
రామచంద్రుఁడుమనయంత ♦ రంగములకు
లొంగని యమేయుఁడెట్లు ప ♦ ల్కులకులొంగు !

గీ. కానిపూర్వపుణ్య ♦ కర్మ ఫలంబున
నమభవింపఁ గలిగి ♦ రామహాత్మ
పైనిగల్గు భక్తి ♦ వలన జనించిన
యమృతమంజనా సు ♦ తాదు, లింతి!

మఱియు, నాబహిఃప్రాణమా! ఒక రహస్యముఁ జెప్పెద వినుము.

సీ. జనకాది బంధు నా ♦ శనవిపన్నగున్నలై
దిక్కులేకేడ్చెడు ♦ దీనులకును,
బట్టినదెల్లను ♦ భస్మమైపోయెడు
భగ్నసంకల్ప ని ♦ ర్భాగ్యులకును,
వచియింపరాని దు ♦ ష్పాతకంబులుసల్పి
కుళ్ళికుళ్ళి తపించు ♦ కుజనులకును
జదివినకొలఁదిని ♦ సందేహచిత్తులై
యూఁగులాడువిపశ్చి ♦ దుద్ఘములకు.

ఆవె, నట్టియిట్టివారి ♦ కననేల? నానా, భ
వార్తులైనవారి, ♦ కిమ్మతసౌఖ్య
కాములెల్లరకును ♦ గనకాంగి! గిట్టిగా
నమ్ము! దిక్కురామ ♦ నామమొకటె ॥

న—ఔను, నాథా! ఈయన రామాయణ నాటకములోను
చోనాకుఁ గాయకష్టములుగూడ నగపడుటలేదు.

సూత్ర—ప్రియురాలా! అదియొక వింతగాదు.

గీ. మనసునకు దేహంబునకు స ♦ బంధమున్న
యంతదాఁక నెతను బాధ ♦ లంటు నరుల;
భక్తిభరితాత్మ తనువును ♦ బాసియెపుడు
వేఱగునో, తనుబాధలు ♦ నీడునపుడె.

నటి—ఆహా! ప్రాణేశా? ఈ రామాయణనాటకము లుభయ తారకములుగదా!

సూత్ర—నిన్నును నన్నే కాదు. లేఖకపాఠకద్రష్ట పరిదర్శకాదులనందఱఁ దరింపఁజేయ సమర్థములు.

నటి—నిజముగా నేనెంతో ధన్యురాలను.

గీ. దశరథతనూజాతలేంద్రుండు ♦ తనసతులకుఁ
దెచ్చిపాయస మర్మిలి ♦ నిచ్చినట్లు
నాకుఁ గరుణించి యిడితిరి ♦ నాథ! యిపుడు
పరమపావనమా రామ ♦ భక్తిసుధను.

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

---

శ్రీ

# కల్యాణరాఘవము.

## ప్రథమాంకము.

(ప్రవేశము— దశరథుఁడు, కౌసల్య, సుమిత్ర, కైక.)

దశ—సఖులారా! ఋశ్యశృంగునార్త్విజ్యమునఁ జేసినజన్నము దైవ కటాక్షమునఁ బూర్తియయినది. ఇదిగో పాయసము. యజ్ఞదేవదత్త ప్రసాదము. దీనిని మీరు భుజియించి గర్భముల ధరింపుఁడు.

కౌ—మహానందము. మడుఁగుబట్టలధరించి శుచిగ నున్నారము. తామె మాకొసఁగుఁడు. భుజింతుము.

దశ—కౌసల్యా! ఈపాయసమున నీకెంత కావలయును?

కైక—ఏమైన మధురపదార్థ మితరులకుఁ బంచియిచ్చుచో ముందుగాఁ జిన్నవారిముచ్చటఁ దీర్చుట మంచిపని కావున నాథా! మీరు మాయక్కగారి నొనర్చిన ప్రశ్నమును నన్నెయొనర్చిన యెడల సంతసంబె బాగుగ నుండునేమో?

దశ—కైకా! కేవల రుచిప్రధానమై కడుపు నింపించుకొనుటకుమాత్రమే పనికివచ్చు నైహిక పదార్థమును బంచిపెట్టునప్పుడు నీవనినట్లు చేయవచ్చునేమోకాని దైవప్రసాదితమగునీపవిత్రవస్తువును గూర్చి నీవు చెప్పినయేర్పాటు పనికిరాదేమో!

కై — దైవ ప్రసాదమునకందఱును సమానార్హులే కదా! అట్టిచో విభేద మేల చేయవలయును? కావున ముగ్గురకు సమానముగాఁ బంచిపెట్టుము.

సు — చెల్లెలా! వారి యిష్టానుసారము వారే యాచరింతురు. నీబోధన మేల?

కై — నేను నీకేమియు బోధింప లేదు. నీవు నన్ను మందలింప వలసినపని లేదు.

కౌ — (అపవారించి సుమిత్రతో) చెల్లెలా! ... రకుండుము. మనకు భర్తతోఁగాని చెల్లెలితోఁగాని వాదమేంనుకు? ఏదైన కటాక్షమునఁ బాయసపాత్రము నాథునకులభించినదో యాదైవకటాక్షము చేతనే యది మనముగ్గురకు దైవమువిధించిన యేర్పాటు ననుసరించియే సిద్ధించును.

సు — (అపవారించి, కౌసల్యతో) అందరకంటె భర్తకధికానురాగాస్పదము ననికాఁబోలు నీతివాక్యబోధనమారంభించినది.

కౌ — (అపవారించి సుమిత్రతో) భర్తయందుఁగల చనవున నామె యేమయినఁ బల్కినచో మన మన్యథా మెంచఁదగదు.

కై — నాథా! ఊరకుంటిరేల? ముగ్గురకు మూఁడుసమభాగములుచేసి యిచ్చుటయే న్యాయముకాదని తోఁచినదా యేమి?

దశ — కైకా! అట్లు తోఁచినఁ దప్పుగాదని తోఁచుచున్నది.

కైక — అటులైన నాకందరకంటె దక్కువ నిచ్చెదవా?

సు — చెల్లెలా! ఈపాయసముతో వాఁకలిదీర్చుకొనఁదలఁచితివా? ఇది దైవదత్తమగు పదార్థము. కొంచెము భుజించిన నేమి విశేషముగ భుజించిన నేమి? గిండెడు పాలగాఁ తీర్థము ద్రాఁగినఫలమొకయుద్ధరిణెఁడు తీర్థము ద్రాఁగిన ఫలముకంటె నెక్కుడగునా?

కౌ——(అపవారించి) చెల్లెలా! అడుగనిదే నీవేల మాటలాడెదవు?

కై——అక్కా! మీరిద్దఱు జ్యేష్ఠదేవులు. మీకు పెద్దసంతులు వచ్చునని గదా తాను ధైర్యముతో నెన్నిశ్రీరంగనీతులయినఁ జెప్పఁగలరు. నేను నీచురాలను. కనిష్ఠురాలను. అధమురాలను. నీచురాలను. పాపాత్మురాలను. మీరిద్ద రాదరింపఁగా నేదయిన నొక్కయుచ్ఛిష్టబింకపుమిగిలిన నది మీయిద్దఱిప్రసాదమని యెంచి కన్నుల కద్దుకొని తినవలసినదానను.

దశ——కైకేయీ! ఎందులకీకోపము? చూడుము. (చేయి పట్టుకొని) నేనుఁ జెప్పినమాట వినుము.

కైక——ఒక్క నీవు చెప్పినమాటల వినుటతోడనే నా యిబ్బందులు తెల్లవారునా? ఈయక్కగారు చెప్పినమాట వినవలయును. ఆయక్కగారు చెప్పిన మాట వినవలయును. కనిష్ఠురాలనై నీయింటఁ బ్రవేశించిన దోషమునకు నాకేది చిన్నతనము తప్పును? అనురాగములలోఁ జిన్నతనము. ఉపకరణములలోఁ జిన్నతనము. ముచ్చటలలోఁ జిన్నతనము. ముడుపులలోఁ జిన్నతనము. మాటలలోఁ జిన్నతనము. మర్యాదలలోఁ జిన్నతనము. బ్రతుకంతలోఁ గూడఁ జిన్నతనము. పరములోఁ గూడఁ జిన్నతనము.

సుమి——(లోపల) కాసించు అమ్మచూపులలోఁ బెద్దతనము. సూడుమాటలలోఁ బెద్దతనము. బుడిబుడియేడుపులలోఁ బెద్దతనము. బూకరింపులలోఁ బెద్దతనము. గయ్యాళితనములలోఁ బెద్దతనము. గడుసుదనములలోఁ బెద్దతనము. కారుమాటలలోఁ బెద్దతనము. కాటులాటలలోఁ బెద్దతనము.

దశ——(అపవారించి) కౌసల్యా! నీకెంతవంతు కావలయునని యడిగితివి. చెప్పవైతివేమి?

కౌ—(అపవారించి) మాచెల్లెలు కైకేయి కోరినంతవంతు నామెకిచ్చి మిగులుదానిలో మీకుఁ దోచినంత నాకుఁ గటాక్షింపుఁడు.

కై—అక్కా! నాకు వంతు నీయవలదని భర్తతో రహస్యముగఁ జెప్పుచున్నావా?

కౌ—చెల్లెలా! నీకే పెద్దభాగము నీయవలసినదని చెప్పుచున్నాను.

కై—నాకంత యాస లేదమ్మా! నాకట్టిపేరాస లేదమ్మా! నాకట్టిదురాశ లేదమ్మా! పెద్దవారైన మీకే పెద్దపెద్దయాశలుండును గాని—

సు—చెల్లెలా! ఎందులకు మమ్ము నిందింతువు? భాగముల గూర్చి భర్తగారితో మేమేమైనఁ బ్రస్తావించితిమా? పెద్దవంతులని చిన్న వంతులని సమభాగములని లేనిపోని సిద్ధాంత పూర్వపక్షములన్ని నీవే చేయుచున్నావుకదా! మేమేమైన మాటలాడితిమా?

కై—అయ్యో! మీరు సంగనాములు నాలి పురుగులు. చలి చీమలు. సన్నసన్నాయినొక్కులజాణలు. నన్ను భగవంతుఁడు పెద్దగొంతు, పెద్దకడుపు, పెద్దయాశతో సృష్టించినాఁడు. పాత్రములోని పరమాన్నమునంతయు నేనే భక్షింపవలయునని యెంచుచున్నా ననుకొంటిరేమో! నాకేమియు నక్కఱలేదు. మీరిద్దరే భుజింపుఁడు. మీరిద్దరే పుత్రులఁగనుఁడు నాథా! నేను బోవుచున్నాను.

(పోఁబోవును.)

దశ—(ఉస్సురనుచు) అబ్బ! కైకేయీ! ఆగుము. ఎప్పుడును గోపమేనా?

సుమి—(తనలో) బెదరింపులేగాని యెక్కడకుఁబోవును?

కౌ—(కైకను బట్టుకొని) చెల్లెలా! పోకుము. దైవప్రసాదిత

పదార్థమును నిరాకరించుటదోషము. అమ్మా! నీయిష్టమువచ్చినంత భాగమును నీవు తీసికొనుము. మిగిలినదే మేము భక్షింతుము.

కై—నన్నాఁపకుము. అమ్మా! అంతయు మీరేతీసికొనుఁడు. నాకేమియునక్కఱలేదు. మీకుఁగలుగు పుత్త్రులు నాపుత్త్రులు కాక పోవుదురా?

సుమి—చెల్లెలా! నీకుఁగలుగు పుత్త్రులు మాకుమాత్రము పుత్త్రులుగాక పోవుదురా? నీకింతకోప మొందులకు? నీవొక్కతెవే భుజింపుము.

దశ—(చేయిపట్టుకొని) కైకా! పుత్త్రభిక్షకై నేనుదేవునెంత ప్రార్థించితినో పాయసమునుఁదిని పుత్త్రునిగనవలసినదని నిన్నంతకంటె నెక్కువగఁ బ్రార్థింపవలయునా?

సుమి—(లోలో) నాథా మీకేలాగునను దప్పదు. విశేషమే మన మేముకూడఁ బ్రార్థింపవలసివచ్చినది.

కైక—నాథా! పొఁగిపొఁగిమాటలచే సంతోషపెట్టఁ బ్రయ [illegible] శోభనాను గలదానవయినను [illegible] ప్రా[illegible] హాస్యభాషణములు, పై కిచకిచలు, లోని ఘుము ఘుము[illegible] లోని వెటకారములు, పైపోషు, లోని మూషు. తెలియలేనంతమందబుద్ధినిగాను. పాయసమిచ్చుటలో నీకుఁబక్షపాతముదయించినది.

దశ—పక్షపాతముగగాక సరిగఁబంచియిచ్చెదను.

కైక—సెబాస్. సరిగనిచ్చెదవుకాదా? ఇమ్ము. వలదనినవా రెవరు?

దశ—"సరిగ" ననఁగ నీయభిప్రాయమేమి?

కైక—ఇదిగో ఏపెద్దల కధికభాగములనిచ్చి యధికులఁజేసి నన్నన్నివిధములఁ జిన్నసేయఁ దలఁచితివో యట్టి మాయక్కలనె యడుగుము.

దశ—ఏమి? సుమిత్రా! నీయభిప్రాయమేమి?

సుమి—నేను బెద్దనుగాను; చిన్ననుగాను. నడిమిదానను. నన్నడుగనేల?

దశ—సతులారా! మీరాలోచించుఁడు నిష్కారణముగ వైరము మొదవలదు. నేను సరిగఁ బంచియిచ్చెదను.

కైక—"సరిగ" ననఁగ సమభాగములుగ ననియే యభిప్రాయ మాకు నెడలఁ గానిండు.

దశ—సరిగ ననఁగ న్యాయముగ.

కైక—న్యాయమనఁగ నేమి? మీబుద్ధికి న్యాయమా? మా అక్కలబుద్ధికి న్యాయమా? నాబుద్ధికి న్యాయమా? దైవబుద్ధికి న్యాయమా? ఎవరుచెప్పిన న్యాయము? ఏటిన్యాయము? పాయసప్రదాతయగు యజ్ఞదేవుఁడీ పదార్థమును మాముగ్గుర కొసఁగుమని నాఁడా? లేదా?

దశ—అట్లే సెలవిచ్చినాఁడు.

కైక—అంతేకాని బుద్ధిచేతనాలోచించి న్యాయమనితోఁచిన క్షాత్రన్యాయము ననుసరించి కొందఱను సంతోషపెట్టి కొందఱ నేడ్పించి యిమ్మని యిన్నిమాటలు చెప్పినాఁడా? ఏమి? మాటలాడ రేమి?

దశ—అట్లు సెలవీయలేదు.

కైక—లేనియెడల నింత సందేహమేల? ఈయోజనములేల? ఈతొట్రుపాటేల? నానోరు నాటవేయనేల?! మీరన్నన్యాయము

న్యాయముకాదు. పెద్దభార్యకొక్క న్యాయము. మాయక్క చెప్పినట్లు నడిమిభార్య కొక్క న్యాయము చిన్నభార్య కొక్క న్యాయమునా? వైప్రప్రసాదమున కందజుసమానాష్టులను లోకన్యాయము ననుస రించి పంచిపెట్టుము.

దశ—కైకా! బ్రాహ్మణుల కనేకపర్యాయములు నీవుదాన దక్షిణాదుల నిప్పించితివికదా! పెద్దలకు చిన్నల కొకరీతినే యిప్పించితివా?

కైక—బ్రాహ్మణులకిచ్చినదినాసొమ్ము. నాసొమ్మును నా యిష్టానుసారముగఁ బంచియిచ్చెదను. నాయనుగ్రహము ననుసరించి యిచ్చెదను. నీభండారములోని సర్వధనమును మాయక్కలకిచ్చిన నైన నేను నోరెత్తుదునా? నీవు నన్నునిరాకరించి మాయక్కల తోడనే కాలక్షేపము చేసినను నేను దైవమును దూఱుచు నీపాద ములయొద్దఁబడి యుండుదాననే కాని యిదియేమియని పలుకవలసిన దాననా?

సుమి—(తనలో) అబ్బా! ఏమిశాంత చిత్తత! ఏమినమ్రత! అటులే నాథుఁడు చేసినయెడలయినా సా కేతపురినిసమూలముగా సముద్ర మునగలుపకమానునువా? కైకమ్మతల్లీ! నాథుఁడునీయెడల సత్యాను రాగుఁడై మాయెడల నొకరీతిగనున్నను మాకు నాథునికిఁ గూడఁ జీవాట్లుతప్ప లేదయ్యెను.

కైక—నీయనుగ్రహమును గనఁబఱచుటకు నీయిష్టమునుఁ జూపుటకు నీన్యాయమును జరుపుటకు సంభావనకువచ్చిన ముష్టిబాప నయ్యలకువలె మేము నీబంగారమపేక్షింపలేదే? ఏమణులఁగోరలేదే? నీవస్తువేదియును దేవురింపలేదే?

దశ—ఈపరమాన్నము నావస్తువుకాదా?

కైక—ఎట్లు?

దశ—(నవ్వుచు) యజ్ఞపురుషుఁడు నాకొసఁగుటచేనాది.

కై—మిమ్ముఁ దినుమని మీకిచ్చెనా?

దశ—(నవ్వుచు) నీవు నన్నిట్లు వేఁడుకొని తినుటకు నాకిచ్చి నాఁడు. తెలిసినదా?

సుమి—(తనలో) మాతోపాటు.

కై—నాథా! [illegible] నామీఁద నిట్టి భేదమునుఁ జేయుచుంటివి. నీయుపశక్తిజనులము? నీసహధర్మచారిణులమే! పుత్ర భిక్షఁగోరి మీతోఁబాటు యజ్ఞము మేముగూడఁ జేయలేదా? మీవలెనే యజ్ఞదీక్ష మేముగూడ నెఱపలేదా? మీతోడనే [illegible] జదివ్యఁ బ్రాపింపలేదా? ఆయజ్ఞపురుషుఁడు నీకు [illegible] బడినదా? అంతచేసినదా? అటుగాక [illegible] చేసినఁ బనులచే నీకియఁబడినయది. కాని నీకీయఁగా [illegible] నీ ప్రమా కిచ్చుటలేదు. మాకిచ్చినది యజ్ఞపురుషుఁడు, [illegible] జ్యేష్ఠాకనిష్ఠాభేదమాయనకు—

దశ—సరే. ఆయనకు లేదు. మీకట్టిభేద మున్నదందువా? లేదందువా?

కైక—మీప్రశ్నము నాకు బాగుగఁ దెలియలేదు.

దశ—సుమిత్రా! నాయభిప్రాయమును నీచెల్లెలికిఁ జెప్పుము.

సుమి—చెల్లెలా! నీవందఱికంటెఁ జిన్నదానవనియు నీకంటె నేనుఁ బెద్దదాననసియు నీమె సర్వజ్యేష్ఠురాలనియు భేదము మనలో నున్నదా లేదా యని యడుగుచున్నారు.

కైక—అట్టి వ్యత్యాసము లేకేమి?

దశ—కావున నేనొక్కసంగతిని చెప్పెదను. వినుఁడు ఒక పావు గడియసేపు మీరు సవతులమను మాట మఱచిపొండు. మీరొక్కతల్లి బిడ్డలని యెంచుకొనుఁడు. అన్యోన్య ప్రేమాధిక్యము గలవారని యనుకొనుఁడు. కైకా! ఈపాయసపాత్రము నీచేతి కిచ్చెదను. నీవే పంచి యిచ్చుటకు నే నంగీకరించెదను. ఎట్లు పంచియిచ్చెదవో చెప్పుము?

కైక—మేము ముగ్గురము సమముగఁ బంచుకొందుము.

దశ—అట్లు చేయునెడల నీయక్కలయందేమి గౌరవమును గనఁబఱచినదానవగుదువు. అదితప్పు. కౌసల్యా! నీవు పంచునెడల నెట్లు చేసెదవు?

కౌ—అందఱకంటెఁ జిన్నచెల్లెలగు కైకకుఁ బెద్దభాగమిచ్చి సుమిత్రకు నంతకంటెఁ దక్కువనిచ్చి యంతకంటెఁ దక్కువభాగము నేను దీసికొనెదను.

దశ—సుమిత్రా! నీవు పంచునెడల నెట్లుచేసెదవు?

సుమి—(నవ్వుచు) నాకేమియు నుంచుకొనకుండ నీయిద్దఱకు చెఱియొక సగమిచ్చెదను.

దశ—నీకో!

సుమి—పిదప వారిభాగములలోఁ జెఱియొకసగమును బుచ్చుకొందును. (నవ్వును)

దశ—ఎంతగడుసుదానవు! సతులారా! ఇదివఱకే వ్యర్థముగ నాలస్యమయినది. ఇఁక నీపదార్థమును శీఘ్రముగ మీరనుభవింపవలయును. పెద్దభాగముఁ దినినదానికిఁ బెద్దకొడుకును జిన్నభాగమును దినినదానికిఁ జిన్నకొడుకును బుట్టునా? కౌసల్య చిన్నభాగము దినినను నామెకుఁ బుట్టుకొడుకు పెద్దకొడుకే. కైకా! నీవు పెద్దభాగమును దినినను నీకుఁ బుట్టుకొడుకు చిన్నవాఁడే. అందుచే నీవు పెద్ద

భాగము పేక్షింపఁదగదు. అపేక్షించిన లాభమును లేదు. కౌసల్య వయస్సుచే యోగ్యతచేగూడఁ బెద్దది. చిరకాలము కాపురము చేసినది. పుత్త్రిలు లేరని మీయిరువురకంటె నెక్కువకాలము తపించినది. మీయక్కయగుటచే మీకుఁ బూజ్యురాలు. అందుపై మీయందు నిరంతరానురాగముగలది. ఎన్నఁడునుస్వలాభమును గోరుకొనియుండ లేదు. అట్టియీ కౌసల్యాదేవిని నేను మీరుతప్పక గౌరవింపఁదగినది. మనల లోకులు మెత్తురు. మనతరువాతివారు మనలఁగొనియాడుదురు. కైకా! మనసులో నేమియుంచుకొనకుము. పవిత్రమైన ముహూర్తము దాటి పోవుచున్నది. అట్లు తలవంచుకొనుట కాదు. నీచేయి నిటుచెమ్ము. కౌసల్య చేయి పట్టుకొనుము.

కైక—(అట్లుచేయును.)

కౌ—చెల్లెలా! నేను వయస్సుచేఁ బెద్దదాననయినను నీవే నాకంటెఁ బెద్దదానవుగ భావించినిన్ను గౌరవించుచున్నసంగతి నీ వెఱుఁగుదువుకదా! అట్టిచో ననవసరమగు నీగాధయేల? నీయిష్ట మెట్లో యట్లు కానిమ్ము.

కై—నేను దొందరపడి యేమయినను నిన్ననిన యెడల క్షమింపుము. (కౌసల్యను గౌఁగిలించుకొనును.) అక్కా! సుమిత్రా! నిన్నుఁ గూడ నిట్లే కోరుచున్నాను.

దశ—సెబాస్! కైకా! నీకు కోపమెంత శీఘ్రముగఁగల్గునో ప్రసన్నతకూడ నంత శీఘ్రముగ నేకలుగును. వెఱ్ఱికోపమెటులో వెఱ్ఱి దయయునటులే. ఈపాయసకలశము నీచేతిలోనుంచుకొనుము. ఇదిగో పంచుచుంటిని. కౌసల్యా! నీకు దీనియందర్థభాగము.

కౌ—మహాప్రసాదము.

దశ—మిగిలినయర్థభాగము రెండుభాగములు చేయుచున్నాను.

(చేసి) ఇదిగో! ఒకభాగము. సుమిత్రా! నీది. (సుమిత్రకిచ్చును.)

సుమి—మహాప్రసాదము.

దశ—మిగిలిన భాగమును నీవు దీసికొందువా?

కైక—సుమిత్ర నాకంటె పెద్దదయినందుల కామెకు నాకంటె కొంత యధికభాగము రావలదా ?

దశ—అటులయిన నేమిసేయుమంటివి?

కైక—నావంతు రెండు భాగములు చేసి యొక భాగము సుమిత్రకిమ్ము.

దశ—సెబాస్! కైకా! సుమిత్రా! నీవనినట్లు నీకు రెండు వంతులు వచ్చినవి. తీసికో. నీకిద్దఱు కొడుకులు గలుగుదురేమో ?

సుమి—(తనలో) ఇద్దఱు పుత్త్రులయినసరే! అనేక శిరస్సులుగలవాఁడయినసరే. కొడుకు పుట్టినఁజాలు.

కైక— నేనీ యష్టమభాగమును దీసికొందును.

దశ—కైకా! నీవు సంతుష్టినొందితివా ?

కై—ఆ.

దశ—ఉత్తరక్షణమునుండి మనకు ముచ్చటలపై ముచ్చటలు. వేడుకలపై వేడుకలు. పండుగలపైఁ బండుగలు. ఇక్కడకు మనస్సు శాంతి పడినది. సతులారా! మీరింక భుజింపరేమి?

కౌ—ఇక్కడనేల? భోజనశాలలోనికిఁబోయి యక్కడ కలిసి భుజింతుము.

దశ—సరే. పోదము రండు.

(నిష్క్రమింతురు.)

శ్రీ

# కల్యాణరాఘవము.

## ద్వితీయాంకము.

(ప్రదేశము—వీధి. ప్రవేశము—కావేరి, రుచిర.)

కావే—రుచిరా! వేగరా! అట్టులడుగులో నడుగు పెట్టెద వేల?

రుచి—మాయమ్మ కైకమ్మకుఁ గడుపుచేత మందగమనము వచ్చియుండ నాకుఁ గాలిపైకురుపుచే వచ్చియున్నది.

కావే—ఇట్లిప్పటినుండియే నేల తిరుగుచున్నావు?

రుచి—కురుపుకంటె దోగనాసి యెక్కువ సలుపుచున్నదమ్మా.

కావే—మా కౌసల్యకుఁ గడుపు రాలేదా? సుమిత్రకుఁ గడుపు రాలేదా? కైకమ్మ వీరిద్దఱికంటె నెక్కువసుకుమారియా? తానంత "అస్సు ఉస్సు"ఁ బడుచున్నదఁటేమి?

రుచి—కావేరమ్మా! చెప్పినవన్నివేమోకాని చూడు! ఎవరితోడ నయినఁ దిరుగ ననఁబోకుసుమా! నాతోనే సరి. ఇదిగో! ఆ పాయసముఁ దిన్నమరునాఁటియుదయమారంభము. ఒక్కటే వేవిళ్ళు విని, విరామము లేదు. ఇటుగుటుక. అటు "ఓక్కు" వెలుతురుకంట బయటకు పీలు లేదుగదా! ఎవ్వరిని జూచిన నసహ్యతగదా! ఇదిగో

మొగఁడుండఁగ నాలాగునఁ బాధలుపడుదిగదా! ఇప్పుడతఁడుండఁగ వట్టి గొంగళిపురుగు. గోకులిబండ ఆనుహారాజు—పాపము. ఆతనిఁ జూచిన జాలియగును—తన్నుభార్యదగ్గఱకు రానిమ్మని స్తుతిచేయుచుని నన్ను బతిమాలుచున్నాఁడు.

కావే—ఇదేమిచోద్యమమ్మా! నెలలునిండినతరువాతఁగూడ వేవిళ్లేమిటి? మామేనత్త కేడు నెలలుండునప్పటికే యారునెలలుకూడ పూర్తిపోయినది. ఇది మఱియుఁ జిత్రముగనున్నది. ఏమి కొత్త ల్లమ్మగారివమ్మా! ఇదివఱకెన్నాళ్లాగునఁ దుఃఖములేదుగదా! కాని నీవిప్పుడెక్కడకు వెళ్ళుచున్నావు?

రుచి—సెనగపప్పులుసుకంటెఁ బుల్లనిదేదయినఁ బోయితెమ్మన్నది. ఎవరిపిందుగుగూర్చి యడిగినవారే నవ్వుచున్నారు. చూడు! మనలోమనమాట. నన్నుఁ జేరఁదీసి యయ్యవారలేమనెనో వింటివా? వైకమ్మకంటె గయ్యాళిలభించినప్పుడదికూడ దొరకునని నాఁడు.

కావే—తనకంటె పరసురుంగిన యెవరికిని కూడఁ జెప్పినాఁడా? ఆతనిమాటలెన్నటికి యెఱుఁగడు! కాని సెనగపప్పులుసుకంటె బుల్లని వస్తువేదో నేనుఁ జెప్పెదను, ఉండు. నోటిదివరనాడు మున్నది. ఏదో ఘృతమునుమ్మా! స్త్రీలకొఱకు ముఖ్యముగఁ జేయఁబడినదఁట! మిగుల రుచిమనఁట ఆముదము నూనెలో నమ్మలక్కలందఱు చెప్పుకొనినా రమ్మా! ఏదోఘృతము. ఊఁ—ఉండు! ఫుల్లకవిఘృతము.

రుచి—అబ్బే! అది ఘృతముకాదు. నేవిళ్లచేత మాందార పాని రుచిగ్రాణశక్తి యెల్లన్నదో విద్యావిహీనచేత మావియ్యాపు రాలి గుణగ్రాణశక్తియెల్లున్నది. అదిఫుల్లకవికృతము. ఫుల్లకవిచేఁ జేయఁబడిన వైద్యగ్రంథమో వల్లకానిది. అది తెచ్చి మాఁడవరాణి గారి మూతికిఁ గట్టినయందువేమి?

కావే—చదువుకొన్నవారు మీరెక్కడ గట్టుకొనిన గట్టుకొందురు; నాకెందులకమ్మా! నేను బోయెదను.

రుచి—వదినా! కోపమా! ఎచ్చటకుఁ బోదలఁచితివో చెప్పవా!

కావే—చెప్పుటకు రహస్యమేమున్నది? మాయమ్మ వసిష్ఠభగవానుని యాశ్రమమునకుఁబోయి వారచ్చటనున్నారేమో కనుగొనిరమ్మన్నది.

రుచి—ఎందులకో!

కావే—నాకుఁ దెలియలేదు.

రుచి—పురుడు శీఘ్రముగ రానైయున్నదని సందేహముచే గురువుగారింటనున్నారో లేదో కనుగొనుమన్నదేమో?

కావే—పురిటికిఁగావలసినదిమంత్రసానియా? మహర్షియా?

రుచి—అదేమిమాట! శిశుజన్మకాలనిర్ణయము మొదలగు పనులకు గురువుగారుండవలదా? కానిమీయమ్మగారప్పుడేమిచేయుచున్నారు?

కావే—నేనిటు వచ్చుచుండఁగనే మా చెల్లెలిని బిలిచి "రాజుగారి నిటకురమ్మని కోరితినని చెప్పుము." అని దానితోఁ జెప్పెను.

రుచి—సరి! ఇఁక నేమి. నేననినదే నిజము. ఈసరికి రాజుగారామెయొద్దకు వచ్చియుందురు. కావున నీవు వేగ పొమ్మా. నేనును బోయియేదియో యొకపుల్లని వస్తువును దీసికొని పోయెదను.

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

*

## ద్వితీయాంకము.

ప్రదేశము—కౌసల్యాంతఃపురము.

ప్రవేశము—దశరథుఁడు, కౌసల్య.

దశ—ఏల ?

కౌస—వంగి మీపాదములను శిరమున నద్దుకొనుటకు నాకు మిగుల గష్టముగనున్నది. అందుచే దయచేసి మీపాదములను నా తొడలపైనుంచుఁడు. చేతులనెత్తి కన్నుల కద్దుకొందును.

దశ—ప్రాణప్రియా ! నీవిప్పుడటులు చేయకున్న నేమి ?

కౌస—నాథా ! (గద్గదికతో) ఏమియు లేదు.

(కన్నుల నీరుంచుకొనును.)

దశ—ఆ ! ఆ ! అదేమి కౌసల్యా ! ఏమిటికు ? (మొగము నెత్తి కౌఁగిలించుకొని) హా ! ప్రాణప్రియా !

గీ. చెప్పవా ! చెప్పవా ! నీదు ♦ గొప్పకనుల
కొలుకులను వేఁడి కన్నీళు ♦ లొలుక నేల ?
చెక్కు లెఱుపెక్క నేల ? ♦ సీత్కృతులఁ బె
దవు లొడుల నేల గుండెల ♦ దడయు నేల ?

కౌస—(దైన్యముతో) నాథా ! నాకేమియుఁదోచుట లేదు. లోపల నేమియో యావేదనముగనున్నది. గర్భమున నేదియో తళుక్కుమని ప్రవేశించినట్లు నున్నది. కనులు చీకటులు గ్రమ్మినవి. అమితముగ

(ప్రకాశముగా) ప్రాణప్రియా! నీకేమియు భయము లేదు. దైవ కటాక్షమునఁ గులగురులగు వసిష్ఠభగవానుల యాశీర్వాదమున నీవు సుపుత్త్రిని నేఁడో రేపో కాంతువు.

కౌ—రేపటివఱకు నేనీబాధ పడుచుండవలసినదా? ఆ! నా వలనఁగాదు.

దశ—(కౌసల్యను ముద్దిడుకొని)

గీ. వార్ధకము దరిసేరు సం ♦ ప్రాప్తమైన
చూలుపుణ్యమాయని ముద్ధ ♦ రాలితనపు
నీదు ముద్దులుఁ జూలుతోఁట, ♦ నెఱిసొగసులు
మురిపములగాంచి తిరుగ ను ♦ ప్పొంగుచుంటి.

కౌ—ఇప్పుడు పరిహసించుచుంటిరా?

దశ—ప్రియురాలా! క్షమింపుము. ఇప్పుడు నే జేసిన పరి హాసమునకు నీకోడుకు చేయిఁబట్టుకొని యిట్టియిట్టిమందునన్నుఁ దిట్టింతువుగాసలే. చూడు. (కడుపుపైఁ జేయినైచి)

గీ. కనుపులోఁ జిన్నిబుడుతెఁడు ♦ దుడుకుదుడుకు
మనుచునీటిలో మత్స్యంబు ♦ ననువుఁదోఁప
దళుకు తళుకని స్ఫురియించి ♦ తుళకరించు
మేఘగర్భస్థమగు నెఱి ♦ మెఱుపువలెను.

కౌసల్యా!

గీ. ఎగుమొగంబగు గర్భంబుఁ ♦ దిగఁబడిమెను
డొక్కలెత్తునుబాసి లోఁ ♦ తెక్కెఁ గడుపు
బడిబడిగ బిగబట్టును ♦ ముడుగులివిగో
కుర్రిం కె వడిగ నే ప్రసవింతు ♦ వింకనేమి?

నీవు రేపటివఱ కుండనక్కఱలేదు. ఈదినముననే శుభప్రసవమగు చుండుగాక! నీదాసి యొవతెయయిన నక్కఁడనున్నదా?

కౌ—అందఱను బంపివయిచితిని. ఏల?

దశ—ఏలయందువేల? పిలిపింపవలసినవారిఁ బిలిపించి, వల సిన సన్నాహమంతయుఁ జేయింపనక్కఱలేదా?

కౌ—తొందరపడకుఁడు. ఎవ్వరిని బిలిపింపవలెను. ఇఁక కొంత సేపు చూతము.

దశ—ఇంకఁ జూచునదేమి. (గట్టిగ) కావేరీ!

(నేపథ్యమున) బాబూ! వచ్చుచున్నాను.

కౌస—దానితో నిందుకొఱకని చెప్పఁగరాదేమి? వలదు.

దశ—దాసీకయినఁ దెలియకుండనెటులు?

కౌ—ఇప్పటినుండియునా? ఈదాసుల చెవినిఁబడిన ముక్క నీటిపైఁబడిన నూనెచుక్క.

దశ—అటులయిన యిప్పుడేమిచేయుమంటివి?

(నేపథ్యమున) అమ్మా! లోనికిరావచ్చునా?

కౌస—కావేరీ! రావచ్చునుకాని నీవిచ్చటకువచ్చి చేయున దేదియులేదు. జపమగునెడలఁ బూజ్యురాలగు నరుంధతీదేవిగారిట కొకసారి దయసేయుదురేమో కనుఁగొనెదవా?

దశ—(నిమ్మళముగ) జపము వదలియయిన శీఘ్రముగనని చెప్పరాదా?

(నేపథ్యమున) అమ్మా! పోయి చెప్పెదను.

కౌ—సరే.

దశ—వసిష్ఠభగవానునకెప్పుడు వార్త నంపుదము.

కౌస—ఆమె పెద్దది. మిగులఁ దెలిసినది. వచ్చినతరువాతనన్ని యేర్పాటులును సందడి లేకుండ నామెయే చేయును.

దశ—సంతోషమే. నీకింక భయమేమియు లేదుకద.

కౌస—లేకేమి! ఇప్పుడంత బాధ లేకుంట చేస్థిమితతగనున్నాను. ఇదియంతయుఁ గడచి గట్టెక్కి తిరుగమీతో సుఖింపఁగలనా?

(నేపథ్యమున) ఆ! ఆ!

దశ—ఆహా! వింటివా? ఎట్టి సదుపశ్రుతియయినదో.

కౌ—కావేరీ! ఆ. ఆ. యనుచున్నావేమి?

(నేపథ్యమున) దేవిగారు మహారాజుగారియొద్దనేయున్నారా? యని రెండవరాణిగారిదాసిగంగచేసిన ప్రశ్నమునకు ఆ. ఆ. యనుచున్నాను.

కౌ—భగవతియగు నామెతో మనవిఁజేసితివా?

(నేపథ్యమున) ఆ, వచ్చెదననినారు.

కౌ—తొందరగ దయసేయుమని చెప్పలేదుకద.

(నేపథ్యమున) ఊ. హు.

కౌ—సరే. పోయొత్తు నాథా! నాచెల్లెలు సుమిత్ర నన్నుఁ జూచుటకయి రాఁదలచి దాసిచేవార్తనంపియున్నదికాఁబోలు. నేను సెలవు తీసికొనవెళ్ళనా?

దశ—నీవు వెళ్లుటయేల? ఆమెయే యిక్కడికి రాఁగూడదా?

కౌ—సరి.సరి. చాలులెండు. నాథా! నేనొకరహస్యపుమాట నడిగెదను. చెప్పెదరా?

దశ—తెలిసినయెడల.

కౌ—సుమిత్రగర్భము కైకమ్మ నాగర్భములవలె లేదేమి?

దశ — లేక ?

కౌ — మిగులఁ బెద్దదిగా నుంటయే కాక యాకృతిచేఁ జూడ వింతగ నున్నది ఈపక్షిని బెరిగియున్నది. ఆపక్షిని బెరిగియున్నది. బొంత యరఁటిపండువలె నజుమగొంచెము వెలితిగనున్నది. ఎందుచేత?

దశ — ఆమె కవలపిల్లలను గాంచుననితోఁచుచున్నది.

కౌస — అమ్మయ్యో! ఇద్దఱుపిల్లలే. నాకొడలు జలదరించు చున్నది. ఏమండి నేనడిగిన ప్రశ్నమునకుత్తరము చెప్పక పోయితిరి ?

దశ — ఉపశ్రుతియే చెప్పినది.

గీ. నీదు నునులోమ్ము తలగడ ♦ మీఁదఁదలయు
నాదు నెఱపైనఁ గాళ్ళుంచి ♦ నీదు సుతుఁడు
పండి యెడనెడఁగుఱుకు యం ♦ చుండఁ గలసి
యతని జోకొట్టుచును సుఖ ♦ మందగలము.

అంతకంటె మనకికఁ గావలసినదేమి?

కౌ — అంతవారమగు నెడల నికఁ గావలసినదేమి? నాకుఁ గొంచెము కష్టముగనున్నది. నేనింకఁ బోవుదును. (పోఁబోవుచు) వైకుంఠవాసా! నాహృదయముననుండుము. గురు వసిష్ఠ భగవానుఁడా! నమస్కారము.

(కన్నులనీరు పెట్టుకొని) ప్రాణనాథా! నమ — స్కా —

దశ — ప్రాణకాంతా! వలదు. నీవు నమస్కరింపఁదగదు. నేనే నీకు నమస్కరింతును. (తనలో)

గీ. కష్టములకోర్చి ప్రకృతికిజం ♦ కక యపార
సర్వసృష్టి మహాతంత్ర ♦ సారసరణి
నున్నతన బొజ్జని ముడుచు ♦ కొన్న గర్భ
వతియె పత్న్యుక్తపరమ దై ♦ వంబుగాదె?

శ్రీ శేషశయన పరబ్రహ్మణేనమః (నమస్కరించును.)

కౌ—(మోమెత్తి తేరిపారఁ జూచును.)

దశ—సతీ! అట్లు నిశ్చలముగఁ జూచెదవేల?

(తనలో)గీ. కసరినను దండ్రపడినను ♦ గైకయాజ్ఞ
భీతిమన్నించి తనమాట ♦ వినకయుండి
నను జలువచూపు వలపుల ♦ నవ్వుపూలఁ
జల్లు నీమె జ్వాలల వెదఁ ♦ జల్లునేల?

(చేయిఁ బట్టుకొని) కౌసల్యా! మాటలాడవేమి? ఇట్లు రోజెదవేల!

కౌ—(దశరథుని ద్రోసివయిచి) ధనుస్సు! ఏదీధనుస్సు—
హా! హా! హా!

(చేయి విదల్చుకొని అట్టహాసము చేయును.)

దశ—హాహాహా! ఇదియేమి?

గీ. మోవి కెలఁకుల దాటిపైఁ ♦ బోనిచిన్న
మొలకనవ్వుల నను, కతి ♦ గొలుకులెడలి
పోని చూపులముగ్ధ ని ♦ ష్ఫలను గురిసి
యట్టహాసము సేయు, వీ ♦ రాగ్రణివలె,

గీ. అంగుళుల యుంగరములె బ ♦ ర్వంచునోలుచు
నబల, యిల్లాలు, మూలింత ♦ రాలు, నన్ను
భీకరాసురహారుని ను ♦ వ్వెత్తుగాఁగ
గోటికొన వీరాప్రు నిదియేటి ♦ పాటవంబొ!

గీ. వీణయో! కేళికాబ్జమో? ♦ ప్రాణనాథు
పాదయుగ్మకమో! చిత్ర ♦ ఫలకమొక్కొ!
యూఁడుదానికి ధనుసేల! ♦ యకటకట!
ఇంతికింతలొ మతి చలి ♦ యింపఁగలదె?

ఇది సమాసన్న ప్రసవసూచకముగు తొట్రుపాటు కాదు. ఏదయిన భూత మావేశించి యుండవలయును, లేదా పెద్దలో పేరటాండ్రో మ్రొక్కు కొందును. ఏదయిన ముడుపుఁ గట్టవలసినయెడలఁ గట్టుకొందును. శిశువున కెవరి పేరు పెట్టుకొనుమన్న వారి పేరు పెట్టుకొందును. ఓ కుల దేవతలారా! ఓ పితృదేవతలారా! మీ యారాధనమున నేమయిన కొఱఁతగావించియుండిన యెడల నన్ను క్షమింపుఁడు మీ కోరిక లేవ్వో దయచేసి స్వప్నరూపమున వెల్లడింపుఁడు. అంతేకాని

గీ. అనువదగు వేళ యే ఫలు ♦ మొలచుదాఁక
నున్నకట్టె మాధవవృక్షపుఁ ♦ జిన్నిచిగురు
పెట్టనున్నది, తతదయా ♦ దృష్టిఁ గలిసి
పెంచుకొనుఁడు, మీయది మీరు ♦ పెఱుకదగునె !

(ప్రకాశముగా) కౌసల్యా ! (దరిఁ జేరఁబోయి) ఆహా! తిరుగఁ ద్రోచి వచ్చిన నెక్కడఁ బడిపోదునో ?

గీ. అసురరణ రంగములను శా ♦ కారి వెన్ను
నంగు పట్టుల ప్రబలరి ♦ క్షః పిశాచ
ఖండనోద్దండతాభి ము ♦ ఖ్యాబుగాంచు
నేను సతిఁ జూడఁ జాల మో ♦ మొత్తి యహాహా !

ఆహా ! నాసతి యేమి దివ్యదర్శన మిచ్చుచున్నది !

గీ. పరమసుఖము, నగాధమగుచు ♦ పరివిమలంబు
నగుచు, దుర్నిరీక్ష్యమగుచు ♦ నమితమగుచు
వర్ణనాతీతమగుచు దు ♦ ర్భావమునగుచు,
నొకమహాతేజమంటఁ గాంచు ♦ చున్నదహాహా !

కావేరీ! కావేరీ!

(నేపథ్యమున) బాబూ !

దశ—వసిష్ఠ భగవానుని శీఘ్రముగ దయసేయుఁడని చెప్పి వెంటఁబెట్టుకొనిరా! వెళ్ళితివా?

(నేపథ్యమున) ఆ!

దశ—నాకు మతిలేదు. చైతన్యమే లేనట్లున్నది. వైకుంఠ నిలయా! పన్నగశయనా! నాతండ్రీ! ఏమియీమాయ! ఏమియుఁ దోచకున్నది. ఎవరిదో కాలిచప్పుడగుచున్నది. గురువులవారువిచ్చేయు చున్నారుకాఁబోలు. (కొంచెమెదురుగఁబోయి) మహాత్మా! దయ సేయుఁడు.

[వశిష్ఠుఁడు ప్రవేశించును.]

దశ—మహానుభావా! నమస్కారము. మహాసముద్రమున బడియున్నాను. కౌసల్యవంకఁజూడుఁడు. అదేమి?

వసి—(నవ్వుచు) మహాసముద్రమున నీవుబడియుండుట కాదు. మహాసముద్రమున బడియున్నయాతఁడు మనయింటికిం విచ్చేయును. ఈదినమే సుదినము నీబ్రదుకంతయునిందుకొఱకే! నాజప మంతయు నిందుకొఱకే!

దశ—మహాత్మా! కౌసల్యకేమియు నాపత్తులేదుకదా?

వసి—(నవ్వుచు) దేవతలయాపత్తులింక నశించిపోవును ఋషుల యాపత్తులింకదీఱును. లోకములయాపదలు మాయమగును.

కౌ—(పీఠమునుండి దుమికి) రే! సకలసురనికరసుఖరమా సమారంభ విఘ్నా! రే! సకలపవిత్రమహర్షిజాల జపతపోభంగ సమాచరణ సాహితీసనాథా! సామసాధ్వీయూథ బాధాచరణ విదగ్ధా! సత్యదయాశౌచ ధర్మశూన్యా! మహామాయావీ! రే! లోకకంటకా! రాక్షసాపశదా! కుంభకర్ణాగ్రజా! రావణాధమా! కాదికో! నీమరణమింక నిశ్చయము! పుత్రపౌత్రికళత్రబంధుమిత్ర

పరివారసహితముగ సీతాను సమీపించినది. ధనుస్సేది! తమ్ముఁడా! ధనుస్సు—

వసి—సెబాస్! వినఁదగినమాటలువినఁబడినవి. ఈకర్ణములు పవిత్రములయినవి.

దశ—మహర్షి చంద్రమా! ఇదియేమిటి? అయ్యయ్యో! ఆ పీఠము పైనుండి క్రిందకు దుమికెను. గర్భమేమగునో? గుండెలదఱి పోవునట్టి మాటలేమిటి?

వసి—రాజచంద్రమా! ఏమియుఁ జడియకుము. ఒక గడియలో నింక భగవంతుఁ డవతరింపఁగలఁడు. ఆతనిముందు చర్యయే యిప్పుడు వెల్లడింపఁబడినది. అదృష్టవంతులలో నగ్రగణ్యుఁడవునీవే! నింద్యమగు పురోహితవృత్తి నవలంబించి నీయింటనింతకాలమునుండి పడికాపులుపడుచు నేనుండుట యీమహాసుదినముకొఱకే.

దశ—తానేయింకఁ బుట్టలేదుకదా! తమ్ముఁడా! ధనుస్సేదీ యనుచున్నాఁడేమి? రావణు నీతఁడు వధియించునా?

కౌ—(పండ్లుకొఱుకుచు,గట్టిగ) వధియింపక–ఇంకను పేక్షయా! ధనుస్సు. ధనుస్సు. హా! హా! హా!

(విఱుచుకొని (క్రిందఁబడును.)

దశ—అయ్యో! అయ్యో! (కౌసల్యనుబట్టుకొని) కౌసల్యా! కౌసల్యా! మహర్షిచంద్రమా! ఇదియేమి?

వసి—మరేమియు జడువకుము. గర్భముననున్న మహాతేజమామె భరియింపలేక పోవుటచేనట్లయినది. తొందరలేదు.

దశ—కౌసల్యా! కౌసల్యా! ఇంకనుస్మృతిరాలేదు. గురూత్తమా! ఏమిగతి?

వసి—నాకమండలూదకము నీమోపై కొంతచల్లెదను. (అట్లు చేసి) కౌసల్యా !

(కౌసల్య లేచును.)

(కౌసల్య అటునిటు తొట్రుపాటుతోఁజూచి)

దశ—ప్రాణకాంతా! నీకిపుడెట్లున్నది? ఇదిగోఅటుచూడుము. వా రెవ్వరు ?

కౌస—గురూత్తమా ! నమస్కారము. నాథా ! అట్లడిగెద రేమి ?

వసి—(అపవారించి) రాజోత్తమా ! ఆమెకిప్పటివృత్తాంతము తెలియనీయకపోవుటమంచిది. వెంటనే సూతికాగృహమున కామెను బంపుము.

దశ—కావేరీ !

(నేపథ్యమున) బాబూ ! వచ్చుచున్నాను.

వసి—రాజా ! నీవుకూడ లోనికిఁబోయి తద్గృహసమీపమున నుండి శీఘ్రోదయమగు వెంటనే యొకగంట వాయింపఁబంపుము. నే నిచ్చటనేయుందును.

దశ—తామొక్కరే యిక్కడ దయచేసియుందురా ?

వసి—నాశిష్యునిరమ్మనిచెప్పి వచ్చితిని.

దశ—కావేరీ! ఇంక రావేమి ?

(నేపథ్యమున) అరుంధతమ్మగారువచ్చినారు. ఆమెకుఁ బూజా మందిరములోనికిఁ దారిచూపుచున్నాను.

దశ—సంతోషమే ! నీవిక్కడకు రానక్కఱలేదు. నేను గౌసల్యనటకుఁ దీసికొని వచ్చెదను. మహానుభావా ! సెలవా ?

వసి—మంచిది.

దశ—(కౌసల్యనుబట్టుకొని) దేవీ ! నీగర్భమున కెక్కడను దెబ్బతగిలినట్లులేదుకద. అంతయు సరిగనున్నదికద ?

కౌస—(అపవారించి)ఏమియులేదు ప్రాణప్రియా ! నీకుమహాతేజస్సంపన్నుఁడగు పుత్త్రుఁడు కలుగునని గురువుగారుమంగళాశాసనమొనర్చిరిసుమా !

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

వసి—రెండుయామముల వేళకావచ్చినది.

గీ. తనకులంబునఁ దనకంటె ♦ ఘనసమగ్ర
విమల తేజోవిరాజిత ♦ విగ్రహంబు
పుట్టివంశంబునకు వన్నెఁ ♦ బెట్టుననుచుఁ
బడక్ష్మబంధుఁడు నడునింగిఁ ♦ బ్రబలియుండు.

శిష్యుఁడు—(ప్రవేశించి) ఇదుగో శిష్యుఁడు, గురువుగారు నాకొఱకుపైకిఁ జూచుచున్నారేమి ?

వసి—ఓరీ, శుంఠా ! నీవు వచ్చితివేల ? వాఁడేఁడీ ?

శిష్య—నేను మాత్రము శిష్యుఁడనుగానా ?

వసి—సరే. కూరుచుండుము. ఈదిన మేతిథియో యెఱుఁగుదువా ?

శిష్య—ఏదయిన గొంచెమాధారమున్నగాని చెప్పలేను.

వసి—ఏయాధారము ?

శిష్య—ఈసంవత్సరము పంచాంగముచేయుటకుఁ గ్రిందటిసంవత్సరపుఁ గణితముకొంత యావశ్యకమగునట్లీనాఁటితిథి తెలిసికొనుటకు నిన్నటితిథి తెలియుటఁ గొంతయావశ్యకము.

వసి—నీకింకం జదువురాదు. నీకు నావలన నేమియు నుపయోగించునట్లు తోంచదు.

శిష్యు—ఆసంగతి నేనెఱుంగకపోలేదు.

వసి—అటులయిన మఱియెక్కడకయినం బొమ్ము.

శిష్యు—అన్ని స్థలములు చూడనిదే యిక్కడకు రాలేదండి. నాపూర్వగురువులందఱు తమరుగట్టివారని చెప్పిరి. నాదురదృష్టమున నన్యథాయయ్యెను. నేనునింకం జదువుమానివైచి తపమో, కవిత్వమో మొదలు పెట్టవలయునని యోచించుచున్నాను. కాని యీమహారాజుగారి పుత్త్రోత్సవాదులలో నేమయినలాభించునేమోయని యాసబెట్టుకొనియున్నాను. రాజభార్యలకుం దొమ్మిది దాంటినది. పదిపదునొకండు దాంటినది. పండ్రెండవమాసము నడుచుచున్నదని తెలియుచున్నది. మూడు తొమ్మిదులు కంబోలును. అందుచే నింతట దేలునట్లు తోంచదు.

వసి—అక్కరలేదు. కౌసల్యాదేవి గర్భమున మహాతేజశ్శాలియగు పుత్త్రుండింక పావుగడియలో జన్మింపనైయున్నాండు. శుద్ధనవమి. పునర్వసూనక్షత్రము. అన్నియు బాగుగనున్నవి.

శిష్యు—నవమినింగూర్చి నాకుం గొంచెము సందేహముగనున్నది.

వసి—ఎందుచేత?

శిష్యు—జన్మమనంగా నింటిలోం బ్రవేశముకాదా? ప్రవేశ నవమి నిషేధముగదా?

వసి—నీమొగము! ఆమహాతేజ మిదివఱకే దేవీగర్భమునం బ్రవేశించినది. ఇప్పుడు ప్రత్యక్షమగుటయే జరుగనైయున్నది.

శిష్యు—ప్రత్యక్షనవమిమాత్రము నిషేధముకాదా ?

(లోనగంటవినఁబడుచున్నది.)

శిష్యు—అద్దీ ! సత్యము, నేను జెప్పినమాట సత్యము.

వసి—ఆగంట నీకుపశుత్రి కాదు. అది శీర్షోదయమగువెంటనే వాయించినగంట. దీనినిఁబట్టి తరువాత జాతకచక్రము వేయుదును.

శిష్యు—శీర్షోదయసమయము మనకుఁ బ్రధానము కాదు. మూఁడు దినములక్రింద శీర్షోదయము కానిండు. అదిమనకు లెక్క కాదు. భూపతన సమయమే ముఖ్యము.

(నేపథ్యమున) ఫిరంగులధ్వనియు ఢంకాభేరీవాద్యములధ్వనులు వినఁబడును.)

వసి—ఆహా ! మంగళవాద్యములు వినఁబడుచున్నవి. భగవానుఁడవతరించినాఁడు. లోకమునకెట్టి శుభదినము సిద్ధించినది ?

గీ. చైత్రమందునశుద్ధ ప • క్షముననవమి
తిథిఁ బునర్వసూ తారను • విధుగురుయుత
గర్కటక శుభోదర్క ల • గ్నమునను బుధ
వారమునను శ్రీహరి యువ • తారముందె.

(నేపథ్యమున) జనులారా ! సందడిసేయవలదు. మీకందఱకు సంతుష్టికరముగఁ బంచిపెట్టించెదను.

శిష్యు—సుమంత్రుఁడు సేవకులచే ఖండశర్కరజనులకుఁబంచి పెట్టించుచున్నాఁడు. నేనుగూడఁ బోయి తెచ్చికొందునా ?

వసి—పో—

శిష్యు—(పోవును)

(నేపథ్యమున) సుమంత్రుఁడా ! యథేష్టముగ నిమ్ము మములఁ

బంధిపెట్టింపుము.

వసి—రాజేంద్రుడడుగో! యిటకు వచ్చుచున్నాడు.

దశ—(ప్రవేశించి) నమస్కారము.

గీ. అంధునకు నేత్రసంపత్తి • యమరెఁ బుల్ల
విఱిగి మోడైన చెట్టు పు • ష్పించెఁ గడుపు
కలవగు దరిద్రునకు • రత్నఖనిలభించె
దాసునకుదొడ్డగతిగల్గె • దాపసేంద్ర.

వసి—దాసునకేగాదు దేశమునకంతకని చెప్పుము.

దశ—బాలుఁడు బహుతేజస్వియైయున్నాఁడఁట.

వసి—నీవింకఁ జూడలేదా!

దశ—నాకు దైవసములగు మీరుచూడకుండ నేజూచెదనా? వత్సనకు శుభస్నానమయినది. నేను గూడస్నానమొనర్చి పరిశుద్ధుఁడనయియున్నాను.

వసి—జాతకర్మాదికృత్యములింక నిర్వర్తింపవలసి యున్నవి.

దశ—కావేరీ! బాలునిట్లు తీసికొనిరమ్ము మహర్షిసత్తములకుఁ జూపింతును.

(కావేరి పొత్తులలోనుంచి వత్సను దెచ్చును)

దశ—పిల్లవానిని ముందు గురువుగారికిఁ గానఁబఱుపుము.

వసి—రాజేంద్రా! నీవుకూడ జూడుము.

దశ—(చూచుచు) ఎట్టులున్నాఁడు?

వసి—ఇదికన్ను. ఇదిముక్కు. ఇది చెవియని నాకేమియువిస్పష్టముగఁ గానఁబడుటలేదు.

గీ. కనులు మిఱుమిట్లుగొల్పు పు • ల్కలనొసంగి
మోదబాష్పములను వెల్చు • పూర్ణ విమల
శాంతగంభీరతేజంబు • స్వల్పపూర్వ
పరిచయముగల యదియెచూ • పట్టెనాకు.

దశ—గురువర్యా ! అదియేమి? ఇంతపిల్లవాఁడువిస్పష్టముగఁ గానరాఁడనుచున్నారేమి ?

ఆ. వె. అరగమూయునపుడె • యంతంతలోకనుల్
విప్పినప్పుడెంత • గొప్పలగునొ ?
మాట గాఁగ బాదు • బుఱుతఁజింతగనుండ
సాగియుండ నెంత • సొగయగునొ ?

గీ. మెఱుఁగుఁ జామనచాయల • హారఁగుఁతోడ
డంబుమీరెడు గుండ్రని • గడ్డంబుతోడ
ముద్దులనుమాట గట్టు నె • మ్మొగముతోడ
నితఁడు నయనాభిరాముఁడై ; • యెసఁగునాకు.

గురువర్యా ! ఈతనికేమిపేరు పెట్టినబాగుగనుండునో తెలిపెదరా ?

వసి—నీవు సూచించుచునేయుంటివికాదా ? ఈతఁడు సర్వ జన నయనాభిరాముఁడు. కావున రాముఁడని పేరు పెట్టుదుము.

దశ—తగినపేరు సెలవిచ్చితిరి.

వసి—ఈతఁడు ముందుచేయు లోకోపకారక కృత్యములను బట్టి యాపేరింతకంటెఁ దగియుండఁదలఁచియున్నది.

దశ—అంతయు దమ యనుగ్రహము. సుమిత్రయుఁగైకయు బాలునిఁజూచిరా ?

కావే—సుమిత్రమ్మగారు చూచినారు. కైకమ్మగారుచూడ లేదు.

దశ—ఎందుచేత ?

కావే—ఆమె బద్ధకముగా నున్నారు.

వసి— రేపటిదినమున నీసరికి రెండవపుత్త్రినెత్తి కొనియుందువు జాతకర్మము లాలసింపఁదగదు. లోనికి మీరు పొండు. నేను స్నానమొనర్చివచ్చెదను.

దశ—చిత్తము !

(అందఱు నిష్క్రమింతురు)

శ్రీ

# కల్యాణరాఘవము.

## తృతీయాంకము.

ప్రదేశము—సరయూనదిదాపు.

ప్రవేశము—విశ్వామిత్ర శిష్యుఁడు నారాయణుఁడు;

వసిష్ఠ శిష్యుఁడగు శంకరుఁడు.

శంక—నారాయణుఁడా! మనముగలసియెంతకాలమైనదో?

నారా—శంకరా! శ్రీరామ జనోత్సవములకు మహారాజాహూతులగుమావిశ్వామిత్రగురువుగారితో నేనిటకువచ్చినప్పుడునిన్నుఁ గలసితిని.

శంక—ఎన్ని వత్సరములైనదో — ఇరువది వత్సరములై యుండునా ?

నారా—అబ్బే! పదుమూఁడువెడలి పదునాలుగు జరుగుచున్నదో—పదునాలుగు వెడలి పదునయిదు జరుగుచున్నదో?

శంక—ఇంతే—కాలము నాచదువువలె నింతమెల్లఁగ నడచుచున్నదే.

నారా —

గీ. బాలుకంటెఁ గాలంబు తాఁ ♦ బేలువలెను
బ్రాఁకు ఘనతయందలి యాస ♦ బాలుఁడుంట;
వృద్ధుకంటెఁ గాలంబు ప ♦ ర్వత్తులేఁడి
రీతిఁ జావునందలి భీతి ♦ వృద్ధుఁడుంట.

శంక — నీవనుమాటకొంత నిజములాగున నేయున్నది. మా గురువుగారయిన వసిష్ఠుని రాముఁడు జన్మించి యెంతకాల మయినదని యడుగ "నేఁడే! మొన్న మొన్ననే కాదఁటరా!" యని యాతఁడనెను.

నారా — కానియప్పటియుత్సవములు బహుదివ్యముగ జరిగినవి.

శంక — దైవవశముచే రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల జన్మోత్సవము లొక్క సమయముననే వచ్చినవి కావున నంత వేడుకగ జరిగెను. దేనిమట్టనకది వేఱుగ జరిగియుండు నెడల నీ వేడుక జరిగియుండునా?

నారా — వీరిలో భరతలక్ష్మణులిద్దఱు కవలలా!

శంక — తెలివితేటలలో మనవిద్దఱము కవలలవలెనున్నాము. లక్ష్మణశత్రుఘ్నులిద్దఱు సుమిత్రాపుత్త్రులు — కవలలు. కైకేయీ పుత్త్రుఁడు భరతుఁడు.

నారా — అలాగా! ఆదినములలో మీ గురువుగారి యొద్ద నేదియో చదువు చుంటివి కాదా?

శంక — ఇప్పటికి నక్కడనే సరిగ నదియే నేర్చుచున్నాను.

నారా — అంతవిసుఁగుదలతోఁ జెప్పెద వేమి? చదువువచ్చు చుంట లేదా?

శంక — ఉపనయనములగువెంటనే రాజపుత్త్రులను నల్వురను

మీగురువుగారికి విద్యాభ్యాసనార్థమై రాజుగారొప్పగించిరి. అప్పటికి నేనొక యర్థపురుష్కారమునుండి జందెములుమడతపైడి రుప్యాలు వేయుచున్నాను. వారు నాక్రింది తరగతిలో నొకవారముండిరి. తరువాత నొకమధ్యాహ్నము సహపాఠకులుగనుండిరి. ఇప్పుడు నాకుగురువులుగ నుండిరి. వారికి నాలుగు వేదములువచ్చినవి. ధనుర్వేదమువచ్చినది. ఉపనిషద్విద్యవచ్చినది. వేయేల? అఱువదినాలుగువిద్యలునువచ్చినవి.

నా రా—నీకేమివచ్చినవి?

శంక—నెత్తికిఁ జేతులు—కంటికి నీళ్ళు—ఒడలికిఁ జేఁపరొత్తుపుఁ దట్టులు.

నా రా—రాకపోయినప్పుడింతకాలము కష్టపడి చదువనేల?

శంక—వచ్చుచున్నదికావుననే చదువుచుంటిని.

నారా—వచ్చుచున్నదేమి?

శంక—కోటలో సంభావన—ఊరిలో దొడ్డిదక్షిణ.

నా రా—"నీకుఁ జదువు రాదు—నీవుపో" యనిగురువుగారెప్పుడు నిన్ననలేదా?

శంక—అనేకపర్యాయములు.

నా రా—అట్లయిన నాయన నిన్నేల వదలుకొనలేదు?

శంక—విస్తళ్లుకుట్టుటలోను పీఁపు గోయుటలోను విశేషవిద్వాంసుఁడ నగుటచే విడువలేకుండ నున్నారు కాఁబోలు. కాని యిప్పుడేమియు నుత్సవములు లేవుకదా! మీగురువుగారేలవచ్చిరి?

నా రా—అదినాకెట్లు తెలియఁగలదు?

శంక—పోనీ—నీవిట్లు వీథివెంట నేలతిరుగుచున్నావో యది యెఱుఁగ దెలియునా?

నారా—మాగురువుగారు రాజుగారినిఁజూడఁ గోటలోనికేగిరి, నాకేమియుఁ బనిలేక తిరుగుచున్నాను.

శంక—మాగురువుగా రీదినమునఁ గోటలోనికి వెళ్ళరని నేననుకొందును.

నారా—ఏల ?

శంక—వారికి వీరికి నష్టమచంద్రుఁడు, నైధనతార కాదా ?

నారా—ఐననేమి ?

శంక—ఏమియు లేదు. నడువుఁడు.

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

## తృతీయాంకము.

---

### ప్రదేశము—రాజసభ.

ప్రవేశము—దశరథుఁడు, విశ్వామిత్రుఁడు.

విశ్వా—అట్టులాడుట న్యాయమా?

దశ—కాకేమి? దయయున్నవారయినయెడల నింతకాలము నకు దయచేయుదురా?

గీ. కృపగలయెడకుఁ గాళ్ళు • కేళ్ళుదాఁటు
కన్నులుబ్బాటలూరుచు • గంతులిడును
ధరణికలరునాకర్షణ • ద్రఢిమకంటె
దయకుఁగల దెక్కు-వగుఁ గాదె • తాపసేంద్ర!

గీ. కాలమునుబట్టి యవకాశ • కలనఁబట్టి
యితరకర్షణ శక్తులౌ • నెగుడుదిగుడు
దయయె సర్వదా తదబాధి • తంబటంద్రు
దయయొనరులోని దైవత • త్వంబుగాదె?

విశ్వా—(నవ్వుచు) సమీచీనముగఁ బలికితివి. సంతోషించితిని. నీవుగూడ నాయెడల దయగలవాఁడవగుటచే నీవుచేసినదయాతత్త్వోపన్యాసార్థము నీకుఁగూడ వర్తింపవచ్చునేమో!

దశ—(నవ్వుచు) మహర్షిచంద్రమా! మీకును నాయెడలఁగలి

గినదిదయ—నాకు మీయెడఁ గలయది భక్తి. అందుచేత—
(సందేహించును.)

విశ్వా—(నవ్వుచు) నీయుత్తరము నీకే సంతుష్టికరముగ లేనట్లు కనఁబడుచున్న దేమి?

గీ. ఈఁత వాలైన నెమ్మైన ♦ నీఁతగాదె?
చూపుక్రిందైన మీఁదైనఁ ♦ జూపుగాదె?
కొండ నెక్కుటన్నన ది ♦ గుటనునైనఁ
గమనకలనా ప్రసక్తి, యొ ♦ క్కటియె కాదె?

గీ. శివుని బూజించు పూలకుఁ ♦ జెలువ సిగను
ముడుచు పూలకు భేదంబు ♦ నుడువనగునె?
ఘనుల యందలి యనురాగ ♦ కలన భక్తి;
యదియె యితరులపైఁ గల్గ ♦ నగును దయఁగ.

గీ. క్రిందిమీఁది పోకడలను ♦ జెందియుంట
బట్టి రాగము భేదత ♦ త్త్వంబుఁగనునె?
యాపగానీరపూరవే ♦ గాధికతకు
దానిలో మాఱువడికి భే ♦ దంబు గలదె?

దశ—(నవ్వుచు) మహానిసత్త్వమా! అందువలన నేనే మిమ్ము దరిసించుటకు రావలసియుండెను, క్షమింపుఁడు.

విశ్వా—అట్లు కాదు.

గీ. కృతనమస్కృతియౌనప్పు ♦ డీకరంబు
దీనినైనను నిదిదీని ♦ నైనఁగలియ
వచ్చు; వర్షోదయమున, ♦ నబ్దంబులందు
వానిని విశ్లేషిసదిచేరఁ ♦ దగ్గునుమింట.

దశ—మహాత్మా! యథార్థముగ నేనేవచ్చి మిమ్ము సేవింపవలసియుండెను. కాని—ఒక్కయంశము తమతో మనవి చేసికొనక తప్పదు. నిజము మనవిచేసెదను.

గీ. శ్రీరఘూద్వహుఁ డిల వెల ◆ సిన దిమొదలు
కనులకానంద మొదవ నతనిఁ ◆ గాంచుటందు
వీనులలరఁగఁ బలుకులు ◆ వినుటయందు
మనములలరారఁ దోడఁ బెట్టి ◆ కొనుటయందుఁ
దనివిదీఱఁగఁ దలమూరు ◆ కొనుటయందుఁ
గోరింజవులుదేర ముద్దిడు ◆ కొనుటయందు
మురువుమురువుగఁ జెక్కిలి ◆ ఫుడుకుటందుఁ
దనువు హాయిగఁ గౌఁగిలి ◆ గొనుటయందు
ఒక నిముసమాత్రనిని గాన ◆ కుండు నపుడు
రామ! రఘువీర! రాఘవా! ◆ రామచంద్ర!
యనుచు నోరారఁ గాఁ బిల్చు ◆ కొనుటయందు
సంతునీటును నాతని వెదకు ◆ లాడుటందు
తెరపి లేదు, ఓర్మిక లేదు; ◆ విరతి లేదు;
అప్పుదల లేదు; తుద లేదు ◆ హద్దు లేదు;
అలపు లేదు; సొలపు లేదు; ◆ విసుపు లేదు;
చాలు చాలులే; దీనిక సరి ◆ సరియు లేదు
సర్వరాజ్యతంత్రములు ◆ చప్పఁబడియెఁ;
గోఱకోఱనుచు సుమంత్రుఁడు ◆ గొణఁగుకొనియెఁ
వహ్ని తంత్రంబులును జల్లఁ ◆ బడియెఁ; కాని

విభుని యెడాగుప్పు కానంతి ♦ వెచ్చఁబడితొ.
ఇన్నియేల ? రామునిగాంచి ♦ యింతగాఁగఁ
బ్రాఁకులాడెదు నేనెట్లు ♦ రాముఁవిడిచి
దివికిఁ బోదునో యనుచు సం ♦ దియమునొందెఁచూ
నెవరు లేరుకావున నంటి ♦ నిక్కమీఁకు.

కన్నరాముని మొగముదాఁట లేకుంటచేఁ గాలుగుమాత్రము దాఁట లేద య్యెను. క్షమింపుఁడు.

విశ్వా—(అదరిపడి—తొంట నేనిమ్మళపడి) రాజా ! మహాదృష్టవంతుఁడవు.

గీ. పూర్ణవిజ్ఞానమే తప ♦ మునకు ఫలము
విద్యకు ఫలంబు వినయంబు ♦ వితరణంబు
సిరికిఫలము ; తేజోరూప ♦ గుణగుణాఢ్య
సుతపరిష్వంగ సుఖమె సం ♦ సృతికిఫలము.

దశ—అందఱు సామాన్యముగఁ బుత్త్రులఁ గాంతురు. ఈ రాముఁడు నావయః కాలములోనే పుట్టియుండిన యెడల నాకెంత వెట్టి యుండదేమో ?

గీ. యువకుఁ డబలాబలిష్ఠస్త ♦ నోపధాన
మున శిరముఁ జేర్చి మోదాబ్ధి ♦ మునుకలుఁగును
జ్యేష్ఠపుత్త్రాంకవిన్యస్త ♦ శీర్షుఁడగుచుఁ
బోసలయువేగనని చీకు ♦ మ్రొక్కుకొనును
లింకొఱకుఁ జేకట్టియు ♦ వాలికగును ;
వద్ధి లేకుండినను వృద్ధుఁ ♦ డవనిఁ బడున్ను.

యువకు చెవులకు గానమాత్రోద్భవుండు ;
ముక్కుటూపిరియగువాఁడు ♦ ముదుసలికిని.

విశ్వా—(తనలో) ఇతఁడు శ్రీరామచంద్రవినిక్షిప్తప్రాణుఁడయియున్నాఁడు. ఎంతసేపు తదనురాగాభివర్ణనమే చేయుచున్నాఁడు. ఇతని మఱియొక మాటలదారిని బెట్టుటయే కష్టముగనున్నది. (ప్రకాశముగా) రాజేంద్రా! సుతు లందఱకు సుధాసన్నిభులే. అందులో నీకు వార్ధకమునఁ గలుగక కలుగక సంతతిగలుగుటచే నీ కట్లున్నది. అది యాశ్చర్యముకాదు. అదిగాక-శ్రీరామమూర్తి సంగపరిత్యాగులే. వాంఛించునంతటి కళ్యాణగుణ సమంజసుఁడగుటచేఁ గన్నవాఁడవగు నీకట్లుంట మిక్కిలి సహజమే! నీవు నాయాశ్రమమునకు రాకుండుటకు రామప్రేమయే కారణమని చెప్పితివి. నే నుఁ దఱచుగవచ్చి నిన్నుఁ జూడవలసినదే కాని—

గీ. ప్రభుఁడు తనయెడ దయగల ♦ వఁడటంచు
బడిబడిగ నాతనిని జేర ♦ వలనుండదు ,
ఎక్కఁగూర్చుండు మన్నను ♦ బ్రభుని కెదుట
వాసియగు దూరమున నిల్వఁ ♦ బడఁగవలయు
ఎదుటఁ బడసిచ్చెఁ జాలు ; నింకేమియనుచు
ముకుదుడుకొన నెల్ల వ ♦ స్తులను ముక్కఁ
దూర్చి, విభుకర్ణమునమూతిఁ ♦ జేర్చి, మిగుల
దడబడలుసేయు ససులపో ♦ కడయె తుదకు
ఉర్వివిభుచిత్త మొక్కలా ♦ గుండ ; దెప్ప
డశనికి మనోవ్యథలు కోటు ♦ లైనసుండు ;

సతతమనుమది చలించును రావి ◆ యాకు రీతిఁ
సింప్రభనువట్టులట్ల భే ◆ దించుసతతము.

అదియుగాక—

చిటుకు చిటుకున నెప్పుడు ◆ చెవిలిఁబడెడు
నిమేసముల దెబ్బ నెవరు గ ◆ ణింతురయ్య
గంట కంగుల లెక్కింత్రు ◆ కర్ణ మొగ్గి;
అతిగ దొరలెడువాని మ ◆ ర్యాదయంతె.
అట్టివానికి సర్వంస ◆ హానినాథ
ధర్మదాక్షిణ్యగాంభీర్య ◆ స్థైర్యశౌర్య
ముఖగుణంబులు మదికెక్కి ◆ ముద మొసఁగవు
పల్లెవానికంబుధి హోరు ◆ ప్రియద మగునె?

దశ—అందుచేత నాయొద్దకుఁ దఱచుగ రాక మీమర్యాదను గాపాడుకొనుచుంటిరా? ఉదరపోషణార్థమై యుర్వీధవుల నాశ్రయించు సామాన్యజనులయెడ మీరు సెలవిచ్చినమాట లొకప్పుడు చెల్లవచ్చునుగాని— ఆఁ! ఇదియేమి? ఇవియేటిమాటలు? మీరు మాకుఁ బ్రభువులుగారా?

సీ. ఆరబ్ధ దీక్షులై ◆ యాగములేసియ నా
సురబాధ లేకుండఁ ◆ జూచు సేవ
నిశ్చలసత్తపో ◆ నిష్ఠులైయుండ జం
తులబాధ లేకుండ ◆ సలుపు సేవ
దానవ్రతక్రియా ◆ నూనులై యుండ స్వ
ల్పపు విత్తముఁ దోడు ◆ పడెడు సేవ

తీర్థయాత్రలదూర ♦ దేశాలనుండ నా
శ్రమశాలికాంరక్ష ♦ జరుపుసేవ
సేయవలయువాఁడను గానె? ♦ సేయుకొఱకె
శతమునకుఁ బదునార్వురు ♦ సగదపఃఫ
లాలినిచ్చుచుందురు గాదె? ♦ యందువలన
నేనె మీసేవకుఁడగాదె? ♦ యిద్ధచరిత!
ఏమి సెలవు? సేవకునకిప్పుడేమియాజ్ఞ?

విశ్వా—రాజేంద్రా! నేనుజేటికిమాటికొకనికిశ్రమమిచ్చువాఁడనుగాను. ఎన్ని శ్రమములయినను నేనే సహియించి యూరకుందునుగాని వానినిఁగూర్చియేమియుఁ జింతించువాఁడనుగాను. ఒకనితో జెదవిని గదపువాఁడనుగాను. నాస్వభావమును నీవు బాగుగ నెఱిఁగియే యుందువు.

దశ—అయ్యయ్యో! సామాన్యశ్రమములనయిన సహించి యూరకుండవలసిన యావశ్యకత నీకేమి కలిగెను? తామిచ్చుటకు దయచేయవలయునా? శిష్యునిచే వార్త నంపిన బరుగుబరుగున రానా? మీకష్టనివారణమునకై యుపయోగింపని నాతనువుతో నేమిఫలము! అదిగాక—సాధుశిఖామణులగు మీరు బాధపడుచుండ నేను దెలిసియయిన తెలియకనయిన యుపేక్షించియుండుట నాకెంత యక్షేమకరము?

విశ్వా—ఇఁక సహనశక్తికి మీఱి ప్రతీకారసమర్థతకు మీఱి నిత్యతపోవిధ్వంసకారియయి సతతహృదయశల్యప్రాయమై వేధించు మహాపద యేదియయిన సిద్ధించినప్పుడే యిఁకఁ దప్పదుగదా యని

యీసంగతి పరిపాలకుని చెవిని వయివేసి పోయిన నాంతేమి చిన్న బుచ్చుకొనునో యని— చెప్పకొనుటకు మాకుం బ్రిభుని కంటెభూలోక గతి మరియెవ్వరు లేకుండుటంబట్టి—"చెప్పదునా? మానుదునా? ఆతనికిబ్బంది కలుగంజేయుదునా? నేనే యీబాధ పడుదునా?" యని నాలోనేను దొత్రిక్కడులు పడుచుంబూర్వపక్ష రాద్ధాంతము లొనర్చుకొనుచు ముందునకు వెనుకకూగులాడుచుం దుదకుం జెప్ప కుండినయెడల లోకులు నన్నే దూషింతు రేమోయని—సంశయించి విధి లేక—

దశ—మునిచంద్రమా! నీకంతసందేహమేల? తొత్రిక్కులాట లేల? ఎంతమాట?

విశ్వా—రాజేంద్రా! "దేహి" యనుటకంటె హైన్య మున్నదా? అంతకంటెం గిష్టమున్నదా? అంతకంటె మహాపద యున్నదా? అంతకంటె నోరురానిమాట మఱియొకటియున్నదా? దేహి మానప్రాణముల సంతలో హరింపగల రెండక్షరములకూర్పు మఱియేదయినన్నదా? దేహి యనుటకంటె దేహత్యాగము మంచిదికాదా? నేనేమి యధముండనా? నీచుండనా? తపస్సామర్థ్యముచేనిప్పడు బ్రహ్మర్షినయినను వెనుక రాజేంద్రుండను గానా? రాష్ట్రపరిపాలనము నిరంకుశముగ నొనర్చినవాండనుగానా? సకల రాజభోగముల ననుభవించినవాండనుగానా? విశేషవితరణ విద్యాశీలుండనయి వెలసినవాండెరుగానా? నేను—అట్టినేను "తీసికో" యనిననోటితో "దేహి" యనంగలనా? "ఇదిగో" యనిన మొగముతో "నిమ్ము" నంగలనా? ఇచ్చినచేతితో పుచ్చుకొనంగలనా? నందేహమేల? తొత్రిక్కులాటయేల?" యని యనుమనేల?

దశ—తాపసేంద్రా! "దేహీ" యనుటయెందులకండీ? మీరు దేహియనువారుమీరు కారు; వారు నాయాశ్రితులు. మీ రాజ్ఞాపించువారు; నేనుమీయాజ్ఞను దలఁదాల్చి మారుమాటాడక నిర్వహించు సేవకుఁడను.

విశ్వా—నాయనా! శబ్దములుమృదువులైన నర్థములుమృదువు లగునా? శుంఠ దొడ్డసంభాషణనుఁ బండితుని పోలికఁ జేసినను బ్రధానుని బహురూపాకృతికి శబ్దభేదమేకాని యంతకంటె నేమున్నది? పరమార్థమున నంతయు ముష్టియే కదా? తపస్సంపన్నుఁడనుగాన నన్నుఁ గూర్చి "యాజ్ఞ" యను గొప్పమాటగ నంటివి. బాగుపడఁదలఁచిన ప్రభుఁడవుగావున నన్నుఁగూర్చి సేవకుఁడ ననుకొంటివి. అంతేకాని యథార్థముగనీవు ప్రభుఁడవు—నేనర్థిని. దేహీ యనుటకే తెగించి తెగించి వచ్చితిని. కాని, నోరు వచ్చుటలేదు. చేయిసాగుటలేదు. మనస్సువంగుటలేదు.

దశ—(చేతులు జోడించుకొని తొందరతో) అయ్యయ్యో! అట్లనుచున్నారేమి? అట్లనుచున్నారేమి?

విశ్వా—అడుగుటకే వచ్చితిని. యాచించుటకే వచ్చితిని. కాని నీసంభాషణవైఖరిఁ జూడ నామనస్సు విముఖమగుచున్నది. అడుగుటకుఁ బెదవులు విడకున్నవి. పడనీ! కష్టములఁ బడనీ! ఎన్ని కష్టములనయినఁ బడనీ! తాటక యజ్ఞశాలదగ్ధము సేయనీ! మారీచుఁడు రక్తమాంస వర్షములుహోమకుండమునఁ గురియనీ! సుబాహుఁ డుద్బాహుఁడై నా మొగమున నిప్పులు కుప్పలు ప్రోయనీ! తలపెట్టిన యజ్ఞములు ధ్వంసములు కానీ! దీక్షలు మంటఁగలియనీ! ఏమి రానీ! ఏమి రాఁబోవనీ! దేహీ యనినపిమ్మట లేవనియందువేమో? రాజేంద్రా! నేనుఁ బోయివచ్చెదను. (లేచుచున్నాఁడు)

దశ—(ఆతనికడ్డుదగిలి చేతులు పట్టుకొని) లేదనుటయే—లేదనుటయే—ఎప్పుడైన నట్లంటినా? సందేహింపవలదు. వలదు. వలదు. వెంటనే మీయభిసంధి యేదియో యాజ్ఞాపింపుఁడు.

విశ్వా—లేదనవచ్చును. తప్పేమియు లేదు. నాసొమ్ము నీ యొద్దనేమి దాఁచఁ బెట్టితినా? రాజధర్మానుసారముగ నొకపు 'డౌఁ' యనవచ్చును. మఱియొకపు 'డు హుఁ(హూఁ)' యనవచ్చును. ఇట్టిది, రాజవయిన నీయొక్కని తలనే పుట్టెనా? రాజనీతి రహస్యక్రమము నేనుగూడ రవ్వంత యెఱిఁగినదే కాదా?

దశ—మీరు ముందు కూర్చుండుఁడు. (విశ్వామిత్రుని కూర్చుండఁ బెట్టి) వినుఁడు—

గీ. స్వామి మాపూర్వుఁడౌ హరి ♦ శ్చంద్రుఁ డఖిల
ధరణి ధారవోసినటు లీ ♦ ధరణినంత
మీ కొసంగుటె కాక నా ♦ మేని జీవ
ములను గోరిన నిచ్చెద ♦ ముదముతోడ.

విశ్వా—(చిఱునవ్వుతో) "ముదముతోడ" ననికూడ ననుచున్నావా? అట్లుకూడఁ జరుపుకొనఁగలవా?

దశ—(నవ్వుచు) హరిశ్చంద్రుని సత్యహరిశ్చంద్రునిఁ జేసిన వారెవ్వరు? 'జరుపుకొనఁగలవా?' యని నన్నడిగెద రేల? జరిపించుకొను భారము మీదే.

విశ్వా—(చిఱునవ్వుతో) అంతవాఁడనే యహంకృతిని వదలుచుంటివేల?

దశ—(చిఱునవ్వుతో) మీయాధిక్యము నభినుతించుచున్నాను.

విశ్వా—సరే! నీవు కూర్చుండుము.

దశ—(కూరుచుండి) సుబాహు మారీచులంత ప్రబలులై, దుర్మదాతిరేకులై మిమ్ము బాధించుచున్నారా!

విశ్వా—(సాగుడుగ) బాధించుచునే యున్నారు.

దశ—ఇంత కాలము పేక్ష యేలచేసితిరి ?

విశ్వా—వారిని మఱియొక మహావీరునిచేఁ జంపింపఁ దలఁచి యిట్లు సహించియుండవలసివచ్చినది.

దశ—(తొందరతో) ఆ మహావీరుఁ డెవ్వఁడు ?

విశ్వా—మఱెవ్వరునా?—రాముఁడు.

దశ—(అసూయతో) జామదగ్నిరాముఁడా ?

విశ్వా—అతనికొఱ కిక్కడి కేలవత్తును? దాశరథరాముఁడే.

దశ—(అదరిపడి) ఆఁ! ఆఁ! ఎవరు ?

విశ్వా—మన రాముఁడే. సర్వజన నయనాభిరాముఁడయిన మనరాముఁడే. సుగుణసూనారాముఁడయిన మనరాముఁడే.

దశ—(సందేహించుచు) ఊఁ! ఊఁ!

విశ్వా—మారీచ సుబాహు వధార్థమై—మదీయ సవనరక్షణార్థమై—మనరాముని నాతో నిపుడు పంపుము. ఇదియే నాకోరిక. ఇందుకొఱకే వచ్చితిని.

దశ—(గడగడలాడుచు) ఆలా—స—రే—కాని—

విశ్వా—ఇఁకఁగానియేల? అతనిఁ బంపుము.

దశ—(గద్గదికతో) అ అ అటులే—మీ—సె—ల వగు నెడలఁ దప్పునా ?

విశ్వా—నాసెలవుమాత్రమేనా? నీవాగ్దానముకూడ నట్టిదికాదా ?

దశ — అలాగే — ఊఁ — అటులే — ఊఁ — మీయిష్ట మాటలుండఁ దప్పునా ? మాటవరుస కడుగుచుంటిని మహాత్మా !

విశ్వా — రాజేంద్రా ! ఏల ?

దశ — మనరాముఁడే — ఏది ? మన చిన్న రాముఁడే — మనయింట రాముఁడే — మాంసలమదమత్తమహాసురమారణమునకర్హుఁట — ఆఁ! పసివాఁడు ! ఏది ? కుఱ్ఱవాఁడు — బాలుఁడు —

విశ్వా —

గీ. అంతసగముకంటె ♦ నింతహీనము మేలు
ఘనమనంటె పూవు ♦ కంటె జాజి ;
బూరుగునకుఁ దులసి ♦ మొక్క పూజ్యంబౌను
చిన్న పెద్ద చింతఁ ♦ జేయుటేల ?

దశ — విలువలో, గౌరవములో, బూజ్యతలో, ఘనమే కావచ్చును. కాని, మోసుకొనుటకు దేహదార్ఢ్యమేది ? బూరుగొక్కటి విఱుచుకొనిపడినయెడల నెంత తులసివనము దగ్ధమైపోవును ?

విశ్వా — రాజేంద్రా ! అట్లనుటవేల ?

గీ. పూజ్యతాపేక్షతాదిసం ♦ స్ఫూర్తిగల్గు
చిన్నయొకన్నైన సత్వంబు ♦ జేరుఁ బ్రాయి
క[illegible]గ, నలుపగు నంగార ♦ కణము దండ
కామహాకుజరాజము ♦ గ్గాల్ప లేదె ?

కన్న[illegible]చే[illegible] మునిమహాత్త్వముఁ గనక యిట్లనుచుంటివి. సందేహింపకుము.

దశ — క్షమింపుఁడు. కన్నతండ్రి నగుటచేతనే యాతనిశక్తియుక్తులు బాగుగ నెఱుఁగుదుననుకొనుచున్నాను ఆశీర్వదింపవలసిన మీరు చిన్నబిడ్డను బట్టుకొని మహత్త్వము హెచ్చనెదరేల ?

సీ. పొడుగువాఁడేకాని ♦ పొడుగున కన్నైన
యొదలింకఁ జేయని ♦ బుడుతవాఁడు ;
ఘనముగా నిడుదగా ♦ కనుల వాఁడేకాని
బెదరింకఁదీరని ♦ పిన్నవాఁడు
కళుకుగా గనుసుచె ♦ క్రాళుల వాఁడేకాని
పాలింకఁ జిలికెడు ♦ పాపవాఁడు
పొడవుగా వంకగా ♦ బొమలవాఁడేకాని
చిట్టించుటేఁకరాని ♦ చిన్నవాఁడు.

గీ. చిన్ననవ్వుల చెన్నుల ♦ వన్నెలాఁడె
కాని యట్టహాసముసేయ ♦ లేనిచిఱుత
సొగసు నెఱి వెంట్రుకల నిగ ♦ న్నిగలవాఁడె
కాని పిల్లజుట్టునవింకఁ ♦ గ్రాలువాఁడు.

గీ. వెదుక సౌమిత్రి ముందు నై ♦ వునను భటుఁడు
నెనసియుండనిమెడ నడు ♦ గిడనివాఁడు
తల్లియొకవంక నొకవంక ♦ దండ్రిచేతఁ
బొదువకుండిన మెడ నిద్ర ♦ పోనివాఁడు.

గీ. నోటిబిళ్ళయెసూటిగ ♦ గొట్టఁజాల
నట్టి యతఁ డమ్ముల్రనుజిమ్ము ♦ గొట్టుకొల్లు ?
కుండబంతియె గుఱిపెట్టి ♦ కొట్టలేని
బొట్టెఁడసురవీరుల తలల్ ♦ గొట్టుకొల్లు.

సీ. క్రుద్ధయై తాటక ♦ గుద్దెకు గుద్దులు
కూర్మిసమ్మెయొసంగు ♦ కుసుమములగునె ?

అలసుబాహుండు వేయు ♦ బలుచ పేటంబులౌ
మురిపించి నేఁబెట్టు ♦ ముద్దులగునె ?
మారీచ ఘోరాగ్ని ♦ నారాచ వారంబు
మామయిచ్చిన రత్న ♦ దామమగునె ?
రణదేవత యొసంగు ♦ రక్తార్ద్రవసనంబు
తాతయిచ్చిన పట్టు ♦ తాపితగునె ?
బాలుఁడెక్కడ ? యంజన ♦ శైలకాల
కఠిన దంష్ట్రాకరాళ వి ♦ గ్రహ వినిర్భ
రాక్షయ బలాఢ్య రాక్షసా ♦ ధ్యక్షులేడ ?
పూల వేఁటులఁ బగులునే ♦ పులులతలలు.

మహాత్మా! అట్లు యోచించుచున్నారేమి ?

విశ్వా — ఇఁక ముందేమి చేయవలయునో యని —

దశ — (గుండె కొట్టుకొని)

గీ. ఈతఁడెవఁడు ? దాసుఁడు మహా ♦ హీనదేవ
దానవానూనజన్య సం ♦ తానమునను
కసిను, కటురు, కంగుల కాఁగి ♦ గడినిదీఱు
గండ్రఁడిడె వచ్చుచున్నాఁడు ♦ గానఁ బదుఁడు..

(నమస్కరించును.)

గీ. తాటకామహామారోద్ధ ♦ నాటికకును
భరతవాక్యముఁ జెప్పించి ♦ ప్రబలబాహు
బలసుబాహు మారీచాది ♦ ఖలులకెల్ల
దర్భశయ్యలనిచ్చి వ ♦ త్తముబిరాన.

(లేచును.)

విశ్వా—రాజేంద్రా! కూరుచుండుము.

గీ. వాదమున శిష్యుఁడే జయ • పత్రమొంద
గురుని ఘనత వేమడుఁగులు • మెఱయకున్నె?
శిష్యు నెడచేసి గురుఁడఁట • సిద్ధపడిన
గురు ఘనతయేది? శిష్యుని • గురుతయేది?
అధిపులాత్మశక్తిని మంత్రు • లందునిల్పి
యవనిఁబాలింతురనుట నీ • యనుభవంబె.
కాచగోళంబుగుండఁ బ్ర • కాశమొందు
దీపమునకుఁ దేజంబెంతొ • తెలియవొక్కొ!

దశ—(దైన్యమున) రామచంద్రుఁడు వయఃపరిపాక సంపన్నుఁడేయయిన మొదలమీఁరన్న మాటలు చెల్లఁదగినవే. అయ్యయ్యో! పట్టి కనుగాయవలన మీకేమి యుపయోగమండి? మహాత్మా నేనురావలదా? రావలదా?

గీ. చిన్నపామునైనఁ • బెద్దకఱ్ఱను గొట్ట
వలయునంచు జనుల • పలుకులుండఁ
బెద్దయహులఁ గొట్టఁ • జిన్నకఱ్ఱనుగోరె
దేల? గోలలీల • మేల మేల!

విశ్వా—తేజమే ప్రధానమగు వస్తువులఁగూర్చి చిన్న పెద్ద చింతచేయవలసిన పని లేదని నేనిదివఱకే చెప్పితిని. ఆమాటను నీవు పాటింపక యిట్లు పలుకుచున్నావు నేను గోలనో, కొంటెనో, కుమతినో. గురుఁడనో, రాముని గోరితిని. ఇచ్చెదనంటివి. అంతేకాదా?

దశ—(ఉస్సురనుచు, సాగుఁడుగ) అంటిని. ఆ! అంటిని.

ఇదిగో! ఇటుచూచుండుడు మహాత్మా!

విశ్వా—ఏల?

దశ—నేనే నాకొడుకనై— నాసుగుణాభిరాముఁడై నవిన్న రాముఁడనై యుద్భవించితినిగాదా? అతఁడే నేనైనప్పుడు నేనవచ్చిననైన నాతఁడు వచ్చినట్లేకద!

విశ్వా—అటులతే నాకును నాకొడుకునకు భేదము లేదుకావున నాకొడుకుతో నీకొడుకును ముందెప్పుడైనఁ బంపవచ్చును. లెమ్ము. నీవుసుఖముగ నుండుము. నేఁబోయెదను. (లేచును.)

దశ—మహానుభావా! కూర్చుండుఁడు. తొందరగా లేచి పోవుటన్యాయమా?

గీ. ఇమ్మనఁగనె 'ఉఁ' యిదేతీసి ♦ కొమ్మనుటకు
ఫలము కాదు; బంగరుకాదు ♦ ప్రభుత కాదు
ఆఱుపదివేల యేండ్లేడ్చి ♦ ప్రాణమునకు
ప్రాణమగునట్లు కాంచిన ♦ ప్రథమసుతుఁడు.

తొందరయేల? ఆలోచించుకొననిండు. శాంతిపడనిండు. శాంతి పడనిండు. ప్రాణములు కుదుటఁ బఱచుకొననిండు. ఆత్మమిక్కిలికలఁత నొందినదిసుఁడీ! మీరు రాముని గోరుదురని స్వప్నమునసయిన నెఱుఁగను జుఁడీ! అయిననేమి? అంటిని, అన్నమాట సత్యముకాదనఁ గలనా? ఆహా! మహాత్మా! మీయజ్ఞభంగమునకు, నాయసుభంగమునకుఁ దాటక యెక్కడదాపురించినదండీ! మహాత్మా! అట్లేమి యాలోచించుచున్నారు?

విశ్వా—ఏమియు లేదు.

దశ—ఏమియు లేనేలేదా! "కావలసినది యసురఖండనము కదా? అది యీతనివలన యగునప్పు డీతని బాధించి రాముని దీసికొని పోవుటెందులకు? చిరకాలమునకు సంతతిఁ గనినవాఁడు. అందుపై వలదు వలదని కన్నతండ్రి యపశకునముగ నాంగోళనపడుచుఁ బ్రాకులాడుచుండ నెటుపోయి నెటువచ్చునో? జయాపజయంబులు దైవాధీనములు. అందులో రాక్షసులు మహాప్రబలులు. రాముఁడు పట్టి కసుగాయ. ఏమో! ఎందులకయిన మంచిది. దశరథునే తీసికొనిపోద" మని మీ రాలోచించుచున్నారేమో యని నేననుకొనుచుంటిని. మీ ముఖవైఖరిచూడ నాకట్లుతోఁచినది. మహానుభావా! ఈయాలోచనములలో నొక్కటి యయిన మీహృదయమున నట్టెమెఱపు మెఱసినట్లయినఁ దళుక్కని యడఁగిపోలేదా?

విశ్వా—లేదు. నీకట్లుతోఁచుట భ్రమము.

గీ. కాతరుఁడు మదిఁగలపాము ♦ గాంచు నెదుట;
విరహి యెదుటఁ జూచునులోన ♦ వెలయు ప్రియను,
మెదడులోని స్వర్గముకవి ♦ యెదుటగాంచు;
మనసుచూడు మన్నట్టు లే ♦ కనులుగాంచు.

దశ—అటులయినఁ బోనిండు. కాని—ఒక్కచిన్నప్రశ్న మడిగెదను. క్షమియింతురా?

విశ్వా—అడుగుము.

దశ—సందర్భశూన్యములగు వాక్యములున్న క్షమింపుఁడు. మీరే దశరథుఁడనుకొనుఁడు. నేనే విశ్వామిత్రుఁడను. నేనే మీరాముని నడిగితిని. ఎఱుగక యిచ్చెదనని మీరుపలికితిరి. ఇట్టిస్థితిలో మీరిట్లు మనస్సులో గుబ్బటలు పడుదురాలేదా?

విశ్వా—ఎట్లు?

దశ—కన్ను తెఱువని రాము నీమునియడిగినాఁడేమి? యడిగి నంతమాత్రమునఁ బ్రత్యక్షమృత్యు దేవతలగు రాక్షసులనోటఁబడవైవ వలసినదే! అంతే! రాక్షసశక్తి యెఱిఁగి, రాముని యశక్తి యెఱిఁగి చూచుచుఁజూచుచుఁ జేతులార రాముని గట్టికట్టి సర్వనాశకులపండ్ల క్రిందఁ బెట్టవలసినదే. కానంత వెనుకముందు నాలోచించుకొననక్కర లేదా? రామునే తీసుకొనిపోవలయునను నిరంతరదీక్ష యీ మునీశ్వరుని కెందులకు? నేనుపోయి రాక్షససంహారమొనర్తును; లేదా రాక్షసులచేఁ జచ్చెదను. రాముఁ డందుచేఁ నిరపాయుఁడై యుండును గాదా? తనముందుగతికైన యజ్ఞమును గాపాడుకొనుట కీతఁడాతురపడుచుండగా, నాముందుగతికై నా రాముని గాపాడుకొనఁ జూడగూడదా? ఇదితప్పా?" అను నిట్టియూహలు తండ్రియైన నీమనస్సునఁ గలుగునా లేదా? అట్లు గలుగుట సహజమగునా కాదా? సెలవీయఁగోరెదను.

విశ్వా—ఐహికలంపటతా శూన్యుఁడనగు నేను—చిరకాలమునకు సంతానలాభమొందుటచే నూతనసంసార సౌఖ్యమును సహస్రగుణాధికముగా ననుభవించు నీమనస్థితి నెట్లూహించుకొని స్వానుభూతిచే నీస్థానమున నెట్లు నిలువఁగలను? నీమనస్థితిసీదియే. ఏసంసారియు దానిననుకరింపలేనప్పుడు సన్న్యాసినయిన నేనట్లు సేయఁగలనా?

దశ—మీరు సేయలేకపోవుటయేమి? సామాన్యముగ నాటకపాత్రములు హరిశ్చంద్రాది పురుషులను జంద్రమత్యాది కాంతలను గూడ ననుకరించుటలేదా?

విశ్వా—అదెంతపాటి యనుకరణము! ఛాయ వస్తువగునా? చిత్రపటము మానిసియగునా?

దశ—కాకపోనిండు. ప్రథాసవస్తువును జ్ఞప్తి చేయుటకయినఁ జాలియున్నదికాదా? అందుచే మీరు రెండు నిముసములు నేనని భావించియట్టి సన్నివేశమున మీహృదయవిధ మెట్టులుండునో కాసంత సెలవిండు.

విశ్వా—ఈనాటకము నాకుఁ దప్పదా?

దశ—నాయెడల మీదయ తప్పనటులే.

విశ్వా—అటులైన వినుము "ఈముని రాము నడిగినాఁడు. ఇచ్చెదనని బాసచేసితిని. నేను నిచ్చెదనన్న వలదనుచున్నాఁడు. రాము నీకుండినయెడలఁ బోయెదననుచున్నాఁడు. ఈముని మతిలేనివాఁడు కాఁడు. మహాధీమంతుఁడు. ప్రబలబలశాలి. అనేకాస్త్రశస్త్రకళాకౌశలకర్కశుఁడు. అందుపై దివ్యతపోరాశి. రాముఁడు కేవలము నిరుపయోగుఁడైయుండు నెడల నిట్టివివిధమహాశక్తిసంపన్నుఁడేల యాస్వార్థునిఁ గోరుకొని కార్యమును ధ్వంసమును జేసికొని బ్రదికియుండినంతకాలమేల నగుబాటొందుటకు సాహసించును. రామునియందుమహారాక్షసశిక్షణవిచక్షణతయుండి తీఱవలయును. తండ్రినగుటచే నాకాతనిమాహాత్మ్యము తెలియకపోవచ్చును. ఒకవేళమాటవరుస కాతనిలో మహత్త్వమియు లేదనియే నిశ్చయింతును. అయిననేమి? విశ్వామిత్రుఁడు మహనీయ మాహాత్మ్యసంపన్నుఁడు కాఁడా? సృష్టికిఁ బ్రతిసృష్టి చేయఁజాలిన భూతలవిధాత కాఁడా? అట్టియాతఁడు మనరామునకెన్ని దివ్యాస్త్రములొసఁగునో? ఎన్ని యఖండశక్తులు ప్రసాదించునో? వానిచే రాముఁడు రాక్షసులను సవలీలగ గెల్చునేమో? ఎవఁడెఱుఁగును? ఇంక నేనెన్నోశుభములా మునివలనఁ గలుఁగునో?" యని దశరథ శైలూషుఁడనైన నేననుకొందును.

దశ—(తనలో) ఇంతపని చేయుటకీతనికి సమర్థత గలదు. కాని

# కల్యాణరాఘవము,

[illegible]మున్నదో లేదో యెవనికిఁ దెలియును? యాగార్థము పారిశ్రాం [illegible] ని. ద[illegible]ననుద్ధనేయుంచుట కొప్పించు కొని. మాయచే రాజ్యమును ధారవోయించుకొని దాఁచినసొమ్ము [illegible] మహానుభావుఁడు! లోహితాస్యుని [illegible] ధారాళముగ[illegible]; [illegible] రాజ్యమున్నది; [illegible]ది. [illegible]ది, [illegible]మున్నది. [illegible] [illegible] రాముని[illegible] [illegible] కిర్పించినాఁడేమో? ఏమిఁడు చెప్పఁగలఁడు? వసిష్ఠ భగవానుని నూర్గురు పుత్త్రులను బూడిదచేసిన పుణ్యాత్ముఁడు! నా పైనాతనికేమియుఁ గోపము లేదనుకొందును. ఏమో! ఉండినను ఉండఁ గూడదా? వసిష్ఠమహర్షి యిచ్చటనుండు నెడల నీతనికి నాతనికి మాటపై మాట కలుగునేమోయని యీతనికి రహస్యసమావేశ మొసఁగితిని. ఇప్పుడాతని నిటకు రమ్మనుటెట్లు? రానియెడల నాకీ సంధిని గర్తవ్యముపదేశించువారెవ్వరు? ఇంతసేపు తనతో మాట లాడక నాలో నేనేదియో యాలోచించుకొనుచుంటినని కాఁబోలు నప్పుడే యాతఁడు దుమధుమలాడుచున్నాఁడు. ఏమి చేయుదును? (ప్రకాశముగ) మహానుభావా!

విశ్వా—ఏల?

దశ—మీమాటలు హేతుపటిమచే గింకములై యున్నవేకాని యర్థకానురాగ రసార్ద్రములుగ లేవు. మఱియొక మాట. రాముని మీవెంట దీసికొనిపొండు; కాని, రామునితో నేనుగూడ వచ్చుట కనుగ్రహింపవలయును.

విశ్వా—(వికటముగ నవ్వుచు) రామునకు సాహాయ్యార్థము గనా?

భర—అందులకు మీరుండ నేనట్లందునా ?

విశ్వా—మఱి యెందులకు ?

దశ—(తనలో) నేనుగూడవచ్చుట కీతఁడ౦గీకరింపకుంటయే యీతని మాటయోద్దేశముఁ బ్రకటించుచున్నది. తనకుఁ గావలసిన రాముఁడుండినప్పుడు పైగ నేనుండినపుడు తనపుట్టియేమిమునిఁగెను ! నమ్మఁదగదు (ప్రకాశముగ) రామునకు సాహాయ్యమునకై కాకుండు నెడల మఱి యెందులకనుచున్నారా?

గీ. అమ్మయెడఁజూపునిల్పిమా ♦ టాడుచుండ
నట్లుమాటాడి ననుఁ జూడు♦మయ్యయిట్లు
లనుచుగడ్డము గ్రహియించి ♦ యతనిమొగము
నాయెడకుఁద్రిప్పుకొను వెఱ్ఱి ♦ నయ్య నేను.

ఒక్క—టేమాట! రామునివిడిచి నేను బ్రదుకఁజాలను.

గీ. ముగురుభార్యలు కాపుర ♦ మునకువచ్చి
పిదపదివ్యమహానంద ♦ పదవిగొన్ని
వత్సరములొందినాఁడత ♦ ర్వాతనంతె
కాని యేమొ; యేమున్నదీ ♦ కంపతోడుగు
సందనుచు గొంత విసుగును ♦ జెందినాఁడ;
గొడుకులేకఁబుట్టరను చింత ♦ వ్రేడముపిదప
బ్రదుకనఁగరోత; చావనః; ♦ బరమపదము
గాఁగఁజూప్రే చావో యంచు ♦ వేఁగినాఁడ
రామచంద్రుఁడు తల్లిగ ♦ ర్భమునఁబడఁగఁ
దిరుగనరులలోఁ బడినాఁడ ♦ మఱలబ్రదుకు
8

కొలఁదిగాఁ దియ్యఁబడెనాద్చు • కొనుచుఁబోవు
నాసలోఁ జిన్నిజలపడె • నయ్యవినడె.
మనసుపుష్పింపరాముఁడు • కనులఁబడఁగఁ
బాల మున్నీరుగాఁ బొంగి • పామరత్వ
మొలయుద్రేకమునమీఁద • నట్టెపడిరొ;
నాఁడ్రిగబడె, మృతిమాట • యడంగఁబడిరొ
శాత హేమంతమునను వ • సంతమయ్యె
తరణి గుర్రుకువేళను భర • ద్వాజపక్షి
మేలుకొల్పుపాడినదర్శ • రేలఁ బోడమోఁ
బూర్ణచంద్రుఁడు నేనురా • మునిఁగసంగె.

మహాత్మ!

గీ. బ్రదుకుకొఱకు నేను • బ్రదుకుట లేదు నా
కొఱకు నేను బ్రదుకఁ • గోరనయ్య
రామచంద్రు కొఱకె • బ్రదికియుంటిని రాముఁ
గనుసన్నలముగాల • గతినిగాంతు.

మీరాయిష్టమువచ్చినట్లు సేయుఁడు

విశ్వా—నీమాటలు వింతగఁ గనఁబడుచున్నవి. ఇంతకుముందు నీవే నా వెంటవచ్చి యాసుర శిక్షణ మొనర్చెద నంటివి. రాముని బాసిన నిముసముననే నిశ్చయముగ మరణించువాఁడవయిన రాముని విడచి నా వెంట నెట్లువచ్చెదనంటివి.

దశ—(తెల్లవోయి) మహర్షిచంద్రమా! అట్లు మొదట నంటిని. సత్యముగ నంటిని. తరువాత కొంచ మాలోచించుకొని నమీఁద—ఆ! అందుమీఁదనే కాఁబోలు—అట్లు చేయుటకే నాకు

శక్తి లేదనితోఁచుటచే నాతో రాముని వెంటఁబెట్టుకొని వచ్చెదనంటిని గాఁబోలు.—మనసు కుదురు లేదు. ఆ! అట్లుకాదనితోఁచుచున్నది. నేను మీవెంట వచ్చెదనన్న మీరు రాముని దీసికొనిపోవుట మాని వైచెదరేమోయని మొదటనట్లన్న మాటసత్యము! రామునిమీరు విడువఁదలఁచుకొనినయెడల నాకుఁదోఁచ రామునితో నన్నుఁగూడఁ దీసికొనిపొమ్మని మిమ్ముఁ బ్రార్థించియుందును.

విశ్వా—ఇంతటితో సరియా? మఱియొక కల్పన మున్నదా? ఇంకఁ గొంచెము శోధించుము. మఱియొక చిత్రమయిన యల్లిక మనమునకుఁ బొడకట్టునేమో? రాజా! ఏమి? మొదట స్థూలముగ ననుటయా? అటుపైఁ దినుగ నాలోచించి సూక్ష్మముగ ననుటయా? దానిపై మఱింత నాలోచించి సూక్ష్మతరముగ ననుటయా? సత్యమునకెట్టి స్థూల సూక్ష్మ నిర్ణయ మొనర్చితివి? మొదటిమాట రెండవదాని వలనఖండనమా? రెండవది మూడవదానివలనదిగదుడుపా? సెబాస్! సత్యాధారమైన సూర్యుఁ డాదిపురుషుఁడగు వంశమున నుద్భవించిననీవు—ఒడలు ముక్కలుగఁగోసి యర్థికిచ్చిన మహానుభావుని కులములోఁబుట్టిన నీవు—పలుసంతేయసత్యమాఁడ వెఱచి రాజ్యముఁ గోల్పోయి, భార్యాపుత్రులను విక్రయించుకొని! తన్ను మాలవానికమ్ముకొని, మరణించిన పుత్రుని దహించుటకువచ్చిన యిల్లాలిఁజేతి నాఁడుగ ఖండించుటకు సిద్ధపడిన సర్వజగద్విఖ్యాతయశస్సంపన్నుఁడగు సత్య హరిశ్చంద్రుని శాఖకుపశాఖవైన నీవు—తన యిల్లాలినే యొకనికి దానమిచ్చినయనన్యసామాన్య వదాన్యాగ్రగణ్యుఁడయిన రఘుమహారాజుగద్దెపై నెక్కిననీవు—మీకులమున కాధార మయిన సత్యమును—సర్వప్రపంచమున కాధారమయిన సత్యమును—కేవలస్వరూపమయిన సత్యమును—ఆఁ!

దశ—మహానుభావా! క్షమియింపుఁడు. అట్టిసత్యమును బరి

గణింపకపోలేను!

గీ. ముందు నెడకు సత్యము, రామ ♦ మూర్తి ప్రేమ
వెనుకలాగ నడుమ గొట్టు ♦ కొనుచునుంటి
బిసము ముందు నెడకును, గాళ్ళ ♦ బెనయు నాచు
వెనుకలాగ స్రుక్కెడు హంస ♦ విధముగాగ.

విశ్వా— (ఈమాటలు వినిపించుకొనక) ఈనీతి సూక్తవరు చెప్పిరి? మీగురువగు వసిష్ఠర్షి నిచ్చటకుఁ బిలిపింపుము. ఆయన యెదుటఁ జెప్పవలసిన నాలుగుమాటలఁ జెప్పెదను. సత్యము వదలుకొనుమని మీగురువుగా రుపదేశింతురేమో చూచెదను.

దశ—(తనలో) అమ్మ! బ్రదికితిని. గురువుగారు కర్తవ్యము తెలుపఁగలరు. (ప్రకాశముగ) ఎవరక్కడ?

(నేపథ్యమున) చిత్తము.

దశ—వసిష్ఠ భగవానునిటకుఁ దయచేయఁ బ్రార్థించితినని చెప్పుము.

విశ్వా—త్వరగ—

దశ—మీకాగ్రహము వలదు. నేను సత్యమును వదలుకొనువాఁడనుగాను. అంటిని. రాముని చ్చెదననియంటిని. అలాగే! ఇచ్చెదనని బాసచేసినతరువాత నీరువలదా? (తనలో) వసిష్ఠుఁడేమి యానతిచ్చునో?

(వసిష్ఠుఁడు ప్రవేశించును.)

(దశరథుఁడు విశ్వామిత్రుఁడు లేతురు.)

వసి—బ్రహ్మర్షిసత్తమా! తపము బాగుగ వర్ధిల్లుచున్నది కదా

విశ్వా—మీదయవలన—

దశ—గురూత్తమా! నమస్కారము.

వసి—కళ్యాణమస్తు.

విశ్వా—రాజేంద్రా! గురువుగారితోఁ జెప్పుము.

దశ—నేనేల? మీరే సెలవిండు.

విశ్వా—మహర్షిచంద్రమా! నాకును మీశిష్యునకొక వివాదముకలిగినది. అదిమీమాధ్యస్థమునఁ దేలవలసియున్నది.

వసి—అదియేదియో సెలవిండు.

విశ్వా—మీరేదియడిగిననిచ్చెదననియీభూపుఁడింతకుముందు నాకు బాసచేసియున్నాఁడు. మారీచసుబాహు వధార్థమై నేను రాముని నాతోఁ బంపుమని కోరితిని. రామునిచ్చుటకు సందేహపడుచున్నాఁడు. ఈయకతప్పదని నేను జెప్పుచున్నాను. మీయిష్టానుసారముగఁ దీరుమానింపుఁడు.

వసి—రాజేంద్రా! నీవు విశ్వామిత్రుని మాహాత్మ్యమెఱుఁగనిదికాదు. అద్వితీయతపఃప్రభావాధికతగలవాఁడు. అతఁడుతలఁచుకొనినయెడల మారీచాదుల నొక్కతెప్పపాటులో భస్మము చేయఁగలఁడు. తపస్సు వ్యయమగునని యుపేక్షించియున్నాఁడు. ఈరాక్షసులఁ జంపినకీర్తి నిరాక్షసహరణముకొఱకే పుట్టినట్టిరామమూర్తికిఁ దక్కింపగ నీతఁడిటకువిచ్చేసినాఁడు. గంధగంధ లేశమైన నేసందేహమును బొందక రాము నాతనితోఁ బంపుము.

గీ. అర్థిబ్రహ్మర్షి; దాత మహాప్రభుండు;
పనియసురమారణము; దత్త • వస్తువఖిల
జగదుదంచి తానంద తే • జస్స్వరూప;
మింతకంటెఁ గావలసిన • దేమియిలను?

విశ్వా-ఇమ్మని చెప్పినయంతటనే కూడ మహాతపశ్శాలియేయని మీయానతికిం గానంత చేర్చితిని.

వసి—(నవ్వుచు) రాజేంద్రా! వింటివా? విశ్వామిత్రుండీ మాటలవలన నన్ను స్తుతిసేయుట లేదు. ఇమ్మని చెప్పకుండ నీయలేక పోయితివిగదా యని నిన్నెత్తిపొడుచుచున్నాఁడు. ఇప్పుడైన వేగిర పడుము. రామునిటకుం బిలిపింపుము.

దశ—ఎవరక్కడ?

(నేపథ్యమున) చిత్తము.

దశ—రామలక్ష్మణుల నిటకుం దీసికొనిరమ్ము.

(నేపథ్యమున) చిత్తము.

(రామలక్ష్మణులు ప్రవేశించి వసిష్ఠునకు నమస్కరింతురు.)

దశ—రామచంద్రా! (విశ్వామిత్రునిం జూపి) తాతగారికి నమస్కరింపుము.

రాము—మహర్షిసత్తమా! నమస్కారము.

విశ్వా—వత్సా! కళ్యాణమస్తు.

దశ—లక్ష్మణా! నీవుంగూడం దాతగారికి నమస్కరింపుము

లక్ష్మ—నేను నమస్కరింపను. ఈయన మాతాతగారు కారు.

దశ—అటులనుటతప్పు నమస్కరింపుము.

లక్ష్మ—ఊఁహు. మాతాతగారికింత పొడుగుగడ్డము లేదు. ఈ నడుమ నేను జూడలేదా?

దశ—ఆతాతగారు మగధదేశమహారాజుగారు. ఆయన మీయమ్మకుం బితృతుల్యుఁడు. ఈతాతగారు మహర్షిశేఖరు. ఈయన నాకుం బితృతుల్యుఁడు.

లక్ష్మ—మహర్షిచంద్రమా! నమస్కారము.

విశ్వా—(సహాస్యము) వత్సా! కళ్యాణమస్తు!

దశ—గాధినందనా! లక్ష్మణశత్రుఘ్నులిద్దఱు కవలలయిన రామునితో లక్ష్మణుఁడు జోడు. భరతునితో శత్రుఘ్నుఁడు జంట. కావున లక్ష్మణునిగూడ వెంటఁబెట్టుకొని పోవేఁడుచున్నాను

విశ్వా—అడిగినంత యిచ్చువాఁడే మహోదాతయగుచో నంతకంటె నధికముగ నిచ్చు నీకేమిపేరు తగునో!

దశ—నాకును నాపిల్లలకుఁ దను యాశీర్వాదము తక్క వేఱొక్కఱలేదు. (రామ లక్ష్మణులతో) మీరీమహర్షితోఁ బోవలయును.

రామ—చిత్తము.

లక్ష్మ—నేను మాయన్నగారితోఁ బోవుదును.

దశ—మహాత్మా! బాలురు. తప్పులు గలిగిన దిద్దికొనుఁడు. (ఆలోచించి కన్నులొత్తుకొని) ఇప్పుడు వెఱ్ఱిపడఁదగదు. నాయనలారా. నన్నొక్కసారి కౌఁగలించుకొనుఁడు.

(రామలక్ష్మణులు కౌఁగలించుకొందురు.)

గాధినందనా! తిరుగ శీఘ్రముగఁ బిల్లలతో దయచేయుదురు కాదా?

విశ్వా—సందేహమేమి? (లేచి) రాజేంద్రా! నేనుబోయెదను.

దశ—చిత్తము. నమస్కారము.

రామ.—లక్ష్మ—గురూత్తమా! మాకు సెలవొసంగుఁడు నమస్కారము.

వసి—కల్యాణమస్తు!

దశ—సేవకా! ఈపిల్లల నొక్కసారి తల్లుల యెదుటఁ బెట్టి వెంట నేమహర్షికప్పజెప్పుము.

వసి—(లేచి) రాజేంద్రా! నేనుఁ బోవుదును.

దశ — చిత్తము. నమస్కారము.

(వసిష్ఠుఁడు, విశ్వామిత్రుఁడు, రాముఁడు, లక్ష్మణుఁడు నిష్క్రమింతురు)

దశ — గీ. ఇమ్మనుటతోడనే రాము ♦ నిచ్చియుండు
నెసల సత్యవంతుఁడనని ♦ యిలయశంబు
నెనపియుందు; రామునిఁదున ♦ కిచ్చినాఁడ;
మునివలననాల్గుతిట్టులు ♦ దనినవాఁడ
కృపణునకు వ్యయము తుదకు ♦ నెక్కువగును,
మెప్పులేమ పైపెచ్చుగ ♦ దెప్పలగును.
పనియదెన్నునఁజేయక మాల్గు ♦ వానికిఁ బని
యెక్కువగుఁ; గష్టమును నష్ట ♦ మినుమడించు
విసరు నాల్కను వాగ్దాన ♦ వితతిఁజేయు
పృధ్వీపతియిచ్చి కీర్తి ద ♦ క్కించుకొనఁడు
ఒసఁగువఱకు బాసనుజేయ ♦ కుండువిభుఁడు
గడుసరియురక్షితుఁడు కీర్తిఁ? ♦ బడయువాఁడు
ఎద్ది యెవనికిఁబ్రాప్తమో ♦ యద్దివాని
నెనయుననుమాట నిజమైన ♦ నిచ్చునొకఁడు
కిమ్మనక సన్నసన్నగ ♦ నమ్మ వెట్టు
నాలుగైనపిమ్మటనిచ్చు ♦ నరుఁడొకండు;
గాధిసుతశాపభయముచే ♦ గానిసత్య
బద్ధతను నేనురాముని ♦ బంపననుమ
ముందత్రికవులు నాటక ♦ ములనువ్రాసి
యెదుటి దృష్టలచేతఁడి ♦ ట్టింతురే మొ
ఎల్లరకు గావలసినంత ♦ స్వేచ్ఛయుండ

నవనిధవునకుఁ గాసంత ♦ యైన లేదు.
పాదరక్షలతో నన్ను ♦ పాటితొ్రట
నడుగిడుచు గాలిలోపల ♦ నడునవలయు
ప్రాణమెంతదాఁకను బిగ ♦ బట్టికొనుచు
హృదయమెందాఁకఁ జెర, బిగి ♦ యించుకొనుచు
నాకసపు వింత నాట్యంబు ♦ నాడఁగలఁడు
ఘా్రథపుఁడుగూడ మనుజుఁడు ♦ గాఁడె? యకట
అలయికనో, తాల్మిలేకయో ♦ యాత్రముననో,
భ్రమమునవో యాతఁడిసుమంత ♦ పట్టుతూలి
నిటు నటునునూఁగ "నిహిహిహి ♦ హీ" యటంచుఁ
గోటిజనములు చప్పటల్ ♦ గొట్టు వారె.
అందఱును జేయు మంచుకొం♦డంతతప్పు
కరఁగి యావిరియైపోవు ♦ క్షణములోన;
భూపుఁడు ప్రమాదమునఁ జేయు ♦ ముత్తెమంత
నెఱను శతశతాబ్దములైన ♦ నిల్చికాలు
రాముపైఁ బ్రేమచేఁ జాల ♦ ప్రాఁకులాడి
నాఁడనేకాని, సత్యంబు ♦ వీడలేదు
కనుబొమలు పండు తరువాతఁ ♦ గడుపుపండు
నాతఁడె గ్రహించు నాదేవు ♦ లాటమెంతో!

(నేపథ్యమున) మహాప్రభూ! భోజనవేళ యతిక్రమించినది.

దశ—ఇంక భోజనమా? కడుపు నిండుగనే యున్నది కాదా! కావేరీ!

గీ. ఏను భుజియించునప్పుడు ♦ మృదులముగను
గమ్రముగఁను బూర్వరాజుల ♦ కథలనాకు
భరతుఁడూ కొట్టఁ బల్కునా ♦ ప్రాణమిటకుఁ
దిరుగవచ్చిన తరువాతఁ ♦ దినెద మజ్జల.

(నేపథ్యమున) అట్టులనుట న్యాయమా? కౌసల్యాదేవిగారు చాల ఖిన్నులై యున్నారు. మీరువచ్చి యామె నోదార్తురుగాక!

దశ—

గీ. జ్ఞానవాసిష్ఠముఁ బఠించి ♦ జగముమిథ్య
యనితలంచు నాగతిఁదమె యిట్టు ♦ లగుడు నెపుడు
పదములకుఁ జేతులకు నడ్డు ♦ పడెడుబిడ్డఁ
డగుపడని యీయఁడు ప్రాణపు ♦ టార్తియెంతో!

హా! రామచంద్రా! హా! లక్ష్మణా! హా! విశ్వామిత్రా!

(నిష్క్రమించును.)

శ్రీ

# కల్యాణరాఘవము.

చతుర్థాంకము.

ప్రదేశము—అరణ్యము.

ప్రవేశము—రాముఁడు, లక్ష్మణుఁడు, విశ్వామిత్రుఁడు, నారాయణుఁడు.

విశ్వా—ఈదినమున మిగుల నడచితిరి. కొంచెమిట విశ్రమింతమా?

నారా—అదిగో! సాయంకాల మగుచున్నది.

గీ. పచ్చనగు చందనపుఁ జర్చ • ప్రకృతికాంత
గిరికుచములకుఁగై సేసి గి • ల్గింతఁబెట్టి
చెక్కిళులఁ బోసి, కెమ్మోవి • నొక్కసవిత
వృద్ధునకుఁ బ్రేమ సతిపైన • హెచ్చుఁగాదె?

లక్ష్మ—తాతగారూ! మీశిష్యుఁడు నారాయణుఁడు తప్పాడుచున్నాఁడు. వృద్ధునకుఁ బ్రేమపుత్రులపైహెచ్చని చెప్పవలయును. నిజమగునా? కాదా?

వశ్యా—విత్నా! ఈసారినీవు చెప్పినదినిజము. మఱియొకసారియాతఁడు చెప్పినదినిజముకావచ్చునా! ప్రకృతిసహస్రముఖికాదా? నారాయణుఁడు నవనవసాహిత్యద్రఢిమచే, నూత్న యౌవనోచిత శృంగార రసగరిమచేనటులు చెప్పినాఁడు. అదితప్పు. శిష్యునకు—

గీ. గురులతో శాస్త్రచర్చను ♦ గోరఁదగును,
కలికి గండచందనచర్చఁ ♦ దలఁపఁదగదు,
వేదములవల్లె పలుకులు ♦ వినఁగఁదగును.
వెలఁది మట్టెలగిలుకులు ♦ వినఁగఁదగదు
ఈశ్వరునిముక్కుచివరని ♦ క్షింపఁదగును,
కన్నుకెలఁకుల నింతిని ♦ గానఁదగదు
జగమసత్యంబలుకఁ ♦ జనునుగాని
చాననడుమ సత్యంబనఁ ♦ జనదు చనదు.

అదియుఁగాక,

వృద్ధులైనను బతితుల ♦ యొద్దనెపుడు
పరుష శృంగార వాక్యముల్ ♦ బలుకఁదగదు;
ఘంటకమును బైఁట చెఱఁగునఁ ♦ గూడునఁదగదు;
రవికలోనొంటుపుచ్చఁ జే ♦ ర్పంగదగదు.
మసినిఁ దాంబూలరక్తితో ♦ మార్పఁదగదు,
దుప్పితోలున జాజులు ♦ గుప్పఁదగదు;
ఒంటుపోచను మృగమద ♦ మూన్పఁదగదు;

నారాయణా! రాజబాలురయెదుట నీవట్టి శృంగారవాక్యములాడుట తప్పు.

రామ—మహానుభావా! ఆతనిక్షమియింతురుగాక!

లక్ష్మ—తాతగారూ! వసిష్ఠశిష్యులమగు మేమామాత్రము నకే చెడిపోవువారముగాము.

రాము—తమ్ముఁడా! అట్లు పలుకఁగూడదు. తప్పు.

విశ్వా—రామచంద్రా! తప్పుకాదు. లక్ష్మణుఁడట్లు పలుకఁ దగును. ఆతని నేను బాగుగ నెఱుఁగుదును;

గీ. గాత్రమునసంటి యెంత శృం • గారమహిమ.
వెలసినను, గన్నులును, గర్ణ • ములును లేక
మునిమొదలెలేక స్థాణువై • మనఁగఁదగిన
మహితవిజ్ఞానుఁడగును ల • క్ష్మణుఁడురామ;

ఆతని పైవాఁడనయిన నీసంగతి యింకినవర్ణ్యముకాదా!

రామ—మహాత్మా! మీదయకుఁ బాత్రులము.

నారా—(తనలో) శృగారవాక్యములచే శిష్యులు చెడుదురు కాని, స్తుతివాక్యములచేఁ జెడరుకాఁబోలు! ఎవనివెఱ్ఱి వానికి వేడుక.

విశ్వా—నారాయణా! ఘూసతల్పముల బాలురకుఁ గల్పింపుము.

లక్ష్మ—గురువుగారియాజ్ఞ యనుల్లంఘనీయము; కాన నీవు నాకును గురువుగారికిని శయ్యలఁ గల్పింపుము. శ్రీరామమూర్తికి నేనే నైచెదను. (అట్లుచేయును.)

విశ్వా—(శయ్యపైఁగూర్చుండి) వత్సలారా!

సీ. గంధసింధుర బద్ధ • బంధురస్యందనా
నందవిహారమే • నడకలయ్యె

ద్రాక్షారసాయన ♦ గోక్షీరపానంబు
నిర్ఝర, నిస్సర ♦ న్నీరమయ్యె
స్వర్ణమంచస్థ పే ♦ శలతూల తల్పముల్
వట్టినేలను గడ్డి ♦ బఱపులయ్యె
బహురుచ్య శాక సం ♦ భార సారాహార
భక్షణంబులు పర్ణ ♦ ఫలములయ్యె
మాతృమాన్యత్వమాంగళ్య ♦ మహితమంది
రస్థలావాస ముద్ధతా ♦ గణ్యకుయ్యెఁ
బాలలోఁ బెట్టఁదగు పుణ్య ♦ మూర్తి యుగము
ముండ్లలోఁ బెట్టి బాధించె ♦ మునియితండు.

రామ — స్వామీ! మీరట్లానతీయఁదగునా? మీరు గటాక్షిం చిన బలాతిబల విద్యలవలన మాకు క్షుత్పిపాసాబాధలు లేవు. బడలి కయు లేదు. అదిగాక —

సీ. అడవిశారికకును బెంపు ♦ డైనశారి
కములతాదులనున్న వ్య ♦ త్యాసమెంతొ
వనసమధివాస సౌఖ్య సం ♦ పదకుఁ బురని
వాససౌఖ్యమునకును వ్య ♦ త్యాసమంత
పురనివాసముచే మది ♦ ముడుచుకొనుచు
నిట్టియిట్టి దేహమునందు ♦ నిమిడిపోవు
నాటవికవాసమున మది ♦ యట్టియట్టి
పొంగి జగదాత్మతో నైక్య ♦ మును లభించు
కృత్రిమ సుఖాళిమనసు మె ♦ ప్పింపలేదు
పదయమక బంధయుక్తకా ♦ వ్యంబువలెను;

పురసుఖములు మదికి బాల • స్ఫూర్తిఁ జేయఁ
జాలవర్భకునకిఁ బోఁత • పాలలీల.

లక్ష్మ—రామభద్రునకేమియుఁ గష్టములు లేకపోవుటచే నా కేమియు లేవు

గీ. ఇదియె దేశాటనమునకు • సదమల ప్ర
పంచ విజ్ఞానసార సం • పాదనమున
కడవిఁ దిరుగుటకును వేఁట • లాడుటకును
దనువు గడిదేర్చుకొనుటకుఁ • దగినవయసు
దీనివ్యర్థపోనిచ్చు భూ • జాని సుతుఁడు
తనువు తపతపతో జగ • త్తునెదురుకొనఁ
దగని మానసం గడగడతో • దక్షిమ లేని
పెగుగుబగుబతోఁ, ద్రేపు • బేవుబేవు
తోనగరులోన రాకాసి • తోలుబొమ్మ
లీల పోతుముత్తైదున్నై • పూలగాఁగ
రా గుడారములనడుమ • రాణితోఁడ
గచ్చకాయలరణమున • గండ్రఁడగును.

రామ—లక్ష్మణా! ఇఁక నట్టె మాటలాడక విశ్రమింపుము.

విశ్వా—నారాయణా! ఊరకుంటివేమి?

(అందఱు విశ్రమింతురు.)

నార—వచ్చుచుంటిని. (తాళములొత్తును.)

లక్ష్మ—తాతగారూ! ఏమైనకథఁ జెప్పెదరా?

విశ్వా—ఆలాగే! అనఁగనఁగ—సుందోపసుందులని— ఎవ్వరు "నూ" యనరేమి?

గీ. తలఁ గదుపు వాఁడు లేనట్టి ♦ తానమట్లు
వెనుకహొంగు లేనట్టి యు ♦ భినయుమట్లు
రణితనిస్వాణరవ శూన్య ♦ రణమువలెను
కథనడున దూఁకొనెడు వాఁడు ♦ గలుగకున్న.

లక్ష్మ—నే "నూ" కొట్టెదను.

విశ్వా—సుందోపసుందులని—.

లక్ష్మ—ఊ—అన్నదమ్ములా ?

విశ్వా—అవును. నీకెట్లు తెలిసెను ?

లక్ష్మ—పేళ్ళనుబట్టి-నాకుమాత్రమండి) యుపరామునఁడసుపేరేల పెట్టలేదో ?

రామ—తమ్ముడా ! కథ వినవేల ?

విశ్వా—వారిరాష్ట్రభూమి యిదియే.

లక్ష్మ—ఊఁ—

వి—వారిద్ద ఱన్యోన్యసహాయులై యనేకదుష్కృతులొనర్చి దుర్జయులైరి.

లక్ష్మ—ఊఁ

విశ్వా—ఒకనాఁడొక యప్సరోనారీమణి వారి కగపడెను.

లక్ష్మ—ఊఁ

విశ్వా—వారిద్దఱుఁగూడ దానిని పేక్షించిరి. అదితనకే కావలయు నని యొకఁడు తనకే కావలయునని యింకొకఁడు నన్యోన్యముఁ గఁగల హించి పోరాడి, గుద్దుకొని, కఱచుకొని, పొడుచుకొని యిద్దఱుఁ జచ్చిరి.

లక్ష్మ—(నవ్వుచున్నాఁడు.) సెబాస్! బాగుగా జరిగినది.

నారా—ఇచ్చట నాటికంటెబోము విల్లే పీనుని చేతి వింటికంటెఁ బ్రిబలమయినది.

లక్ష్మ—నారాయణా! పీనుని వింటి నట్లు నిందించుట తగదు. తగినవీరుఁడప్పటికి వారితోఁ దారసింపక పోయినంత మాత్రిమున వీర ధనుః ప్రకాండము నధిక్షేపించుటనుచితము. మాయన్నగారివలనఁ గొందు లకు? ఈధనుస్సుచేఁబూని నేనే యిప్పుడిట నుండినమొదల నొక్క ప్రేటుతో రెండు తలలునూడఁ గొట్టలేకుందునా?

రామ—తమ్ముఁడా! కథకడ్డువచ్చెద వేల?

విశ్వా—వారిలో సుందుఁడనువాని భార్య తాటక.

లక్ష్మ—ఊఁ.

(నేపథ్యమున ఊఁ.)

రామ—(లేచి) మఱియెవ్వరో 'ఊఁ' యనుచున్నారు?

నారా—ప్రతిధ్వనియైయుండునేమో?

రామ—కాదు.

విశ్వా—తాటక కిద్దఱు పుత్త్రిలు. మారీచ సుబాహులు.

లక్ష్మ—ఊఁ.

(నేపథ్యమున) ఊఁ.

రామ—లక్ష్మణా! ధనుస్సు! ధనుస్సు! (తీసికొని) గురూత్తమా! ఆధ్వనివచ్చునెడకుఁబోయి చూచివత్తును.

లక్ష్మ—రామభద్రా! నేను ముందునడచుచు దారిచూపెదను; రమ్ము.

విశ్వా—మీరటకుఁ బోకుఁడు. ఆమెయే యిటకు రావచ్చును.

రామ—ఆమె యెవ్వరు ?

విశ్వా—తాటక—ఆపొదచాటున 'ఊఁఊఁ' యనుచు నది గురుక పెట్టి నిద్రించుచున్నట్లున్నది.

నారా—అమ్మయ్యో ! తాటక యింత చేరువనే యున్నదా ? గురూత్తమా ! పాఱిపోవుదము.

రామ—నారాయణా ! నీకేమియు భయము లేదు.

విశ్వా—ఆమె యిచ్చటనుండుట యెఱిఁగియుండియే మిమ్మిత్తటకుఁ దీసికొనివచ్చితిని. సంహరించుట కింక వేళ కాకుండుటచే రామభద్రా ! నీతోఁ జెప్పియుండలేదు. ఇది నాయజ్ఞమునకుఁ జేసిన విఘాతము లిన్నిన్ని కావు. ఒక పావుగడియలో నీమెను వధింతువుగాక !

నారా—అది నామెడలో నొకసారి త్రాచుపామును జుట్టెను.

లక్ష్మ—నారాయణ శంకరుల కభేదమని తెల్పుటకు గాఁబోలును.

రామ—గురూత్తమా ! అబలను వధింపుమని యానతిచ్చుచున్నారేమి ?

నారా—అనేక గజ సహస్ర బలాన్వితయగునది యబల యెట్లగును ?

లక్ష్మ—నారాయణా ! స్త్రీపురుష విభాగముఁ బాగుగఁ జేయుచున్నావు. బలముండుటచేతనే యది పురుషుఁ డగునెడల బలము లేకుంటచే నీవు కాంతవగుదువా ?

రామ—లక్ష్మణా ! అట్లు తీవ్రముగ మాటాడవచ్చునా ? నారాయణా ! నీవేమియు ననుకొనవలదుసుమా !

విశ్వా—లక్ష్మణుఁడు నారాయణు నధిక్షేపించినను గొంత సత్యము నారాయణుఁడే వచించినాఁడు.

గీ. కుడి యెడమ భేదమున్నది ♦ పడఁతికిఁ బురు
షునకుఁ గఠినగాత్రుఁ డతఁడు ♦ సుమసమాంగి
యద్ది; భరియింపఁ గల్గువాఁ ♦ డతఁడు; సేవ
నంది భరియింపఁ బడుచుండు ♦ నద్ది యీమె.
స్వల్ప కఠినాత్ముఁ డతఁడు; పే ♦ శల సుధాని
భోన్నతమనస్క యామె యది; ♦ యన్నితనకు
వలయునను వాఁడతండు; కా ♦ వలయునంత
నందఱకుఁ బెట్టి మోదించు ♦ నట్టిదామె.
కర్త కతఁడర్హుఁడగు; సూది ♦ గరిటెలకు స
మర్థయగునీమె; రాజసే ♦ వార్హుఁడతఁడు;
అతిథికుల దేవతాదుల ♦ కర్చసలిపి
యిల్లు స్వర్గతుల్యముఁ జేయఁ ♦ జెల్లునామె.
సర్వదేశంబు నతని సం ♦ చారభూమి;
యిల్లె యీమె పాలన సీమ; ♦ యెల్లజనులు
సూనివారు; పిల్లలగుదు ♦ రామె ప్రజలు;
యశ మతనికోర్కి; పుణ్యమా ♦ నామెఫలము.
పిఱికితనమును బిడియంబు ♦ పురుషునకును
బనికిరా; వవ్వె భూషలౌ ♦ వనితకెపుడు;
దేవుచేతనుదరియింపఁ ♦ దివురునాతఁ;
డతని చేతను దరియించు ♦ నయ్యయామె.

అల్లిగానుండ ముద్దియ ♦ నర్హమైన
యువిద పని ముక్కు మొదలంట ♦ నూడఁ గోలుకే
గోటికొనలను గిల్లింతఁ ♦ గూర్పఁ దగిన
పడఁతి మగవానిఁ బడగుద్ది ♦ వధము సేయ
నిల్లువదలి దేశంబున ♦ నెగచిపడుచు
సత్యమును ధర్మమును మునీ ♦ శ్వరుల జడల
తోడఁ గోయించి యజ్ఞము ♦ ల్వాశు సేసి
కుత్తల మెల్లఁగూర్చితను గ ♦ గ్గోలుపఱుప.
కుసుమముల చెండుల ఫిరంగి ♦ గుండుగాఁగ
మరు లకోరి భైరవమహో ♦ మారిగాఁగ
చక్కనగు చుక్క బలుతోక ♦ చుక్కగాఁక.
పున్నెముల తావు పాపము ♦ పోర్చెగాఁగ.
స్త్రీత్వమిఁక నేమి? యాచింత ♦ సేయఁదగదుఁ;
జాతికిని శిక్షగాదు; దో ♦ షంబునకును
భువిని బాము సేసెడు వారు ♦ పురుషులైన
నేమి? స్త్రీలైననేమి శి ♦ క్షింపవలయు.

రామచంద్రా! లోకవిధ్వంసకారిణియగు నీరాక్షసినిజంపిలోకమును గాపాడుము.

రాము — (సందేహించుచు) క్షమింపవలెను. విరూపను జేసినఁ జాలదా?

విశ్వా — సందేహచారిత్రియగు తల్లినే పరశురాముఁడువధించి యుండ నిస్సందేహ నిరంకుశ దౌష్ట్యభూయిష్టయగు రాక్షసమానిని బరిమార్చుట కీతొట్రుపాటేల? సందేహింపకుము. కోయవలసినది

ముక్కు చెవులుగావు. గొంతు. ఖండింపవలసినవి పదకరములుకావు. పాపములు. నీచేతిలో నిది తనుప్రబాసితరింపవలసియున్నది. అవయవ ఖండన మొనర్చియకారణముగ నాయూసపెట్టుటకంటె నట్టెయొక్క కోలతో నసుహరణమొనర్చుట నన్నివిధముల శ్రేయముకాదా?

రామ—స్త్రీహంతకుఁడనని నన్నులోకము నిందింపదా?

విశ్వా—

గీ. ఆత్మను గ్రసించు పరిబంధమా ♦ యాంశుభాఁగి
నంత మొందించు శూరుఁడే ♦ యద్వితీయుఁ;
డతఁడె శ్రేష్ఠుఁడు; లోకాతీతుఁ ♦ డతఁడె ముక్తుఁ;
డవనిలో జన్మమంత స్త్రీ ♦ హంత్యకొలకె.

రామ—(నవ్వుచు) మీ సెలవగుటచేఁ జేయవలయును కాని—

విశ్వా—నా సెలవును బట్టికాదు. నీజన్మమునుఁ బట్టియే చేయవలయును. దుష్టశిక్షణమునకు, శిష్టరక్షణమునకు జన్మమొందిన పురుషోత్తముఁడవు.

గీ. పాత్రకృతులు చేయఁదగులింగ ♦ వర్ణవిధజ
నంబునీకేల? రామచం ♦ ద్ర! మహాత్మ!
సర్వహేతువౌ మది నప్పం ♦ నకముగాదె?
మట్టియొకటె పోతాఁడు బొ ♦ మ్మలకునైన.

రామ—ఇంతదూరము మీరు సెలవీయవలయునా? మీ యిష్టానుసారమే దానిని వధింతును.

లక్ష్మ—తాతగారూ! తాటకను, జూడవలయును. నన్నట్టు పోనిచ్చెదరా?

విశ్వా—అంగఱముఁ బోవుదము.

నారా—నన్నుఁగూడ రమ్మందురా?

లక్ష్మ—నీవునా వెనుకనుండుము. అదినిద్రించుచున్నదికాదా?

(అందఱు పరిక్రమింతురు. తెరయెత్తగ తాటక నిద్రించుచు కనఁబడియుండును)

విశ్వా—అదిగో! చూడు! ఎంతభయంకరస్వరూపిణియో!

రాము—ఘోరాకారయేయగును.

విశ్వా—

గీ. ప్రక్క గురుపెట్టి నిద్రించు భార్యయైన
రేయి నడుమ జూడఁగ భయా కృతిగఁదోఁచు
సృష్టిశక్తిస్వరూపిణి స్త్రీయనంగ
నిద్ది యీవేళ నిట్లుండ నేమిచెప్ప!

రామ—గురూత్తమా!

గీ. ప్రాణమొకత్రుటిలోనఁ దాఁ బాయునను చు
నెఱుఁగ కెంతహాయిగను ని ద్రించు నీమె;
ప్రాణులెంత యజ్ఞులో కట్ట! బ్రతుకనంగ
నింతె కద! యిట్టి మెఱుమిట్టె యిరులుగాదె.

విశ్వా—ఇంకసందేహమా?

లక్ష్మ—తాతగారూ! చంపుటకు వేళ యయినదేమోదాని లేపనా?

నారా—లేపుట యెందులకు? నిద్రపోవుచుండఁగనే చంప రాదా? ఈనిద్రలో నాఁద్రగూడఁ గలియును.

విశ్వా—వత్సా! లేపవచ్చును.

లక్ష్మ—తాటకా! తాటకా! అసురసాధ్యవేళ నిద్రింపఁ దగదు. తిరుగ నాసురజన్మము వచ్చునేమో! దూరప్రయాణము పోఁదలఁచియున్నావు. ఆలసింపకు! వేగ లే! ఉఁహు. లేవకున్నది. తాటకా! తాటకా! నామాటవినియొకవ్యక్తికాలము వేచియుందుము. చచ్చితిరుగ శాశ్వతముగఁ బొందుకొందువుగాని లే ఉఁహుఁ. లేవదు.

గీ. పూలబంతి వ్రేటులు పెద్ద ♦ పులికి నేల?
గిలుకుగిలిగింత పెనుకాలు ♦ గేదె కేల?
మంగళస్ఫటారతులు బల్ని ♦ వంగి కేల?
మేలుకొల్పుల భూపాల ♦ మేల కిటికి?
మును పసుందుఁడు మద్దాఁడు ♦ మూతిమీఁద.
మునివరేణ్యుఁడు దిట్టిన ♦ మూతిమీఁద
పోఁడిపోఁగ గుల్లు పెట్టెడు ♦ మూతిమీఁదఁ
దాటకా! యిదె రామ సో ♦ దరునితన్ను.

(తన్నును.)

తాట—(కన్నులు మూసికొని లేచి) హా! హా! నాథా! చిరకాలమగుటచేతనా? యింత గిట్టిగా మూర్ఛపెట్టుకొంటివి?

లక్ష్మ—నీనాలుకఁగోయ! చిరకాలపు మూర్ఛగాదు. శీఘ్రము కాలప్రమృతి. లే!

తాట—(కన్నులు మూసికొని) నాథా! నిన్నెంత కాలమునకుఁ జూచితిని?

లక్ష్మ—సాధుని స్వప్నమునఁజూచుటలో విశేషమేమున్నది? ఆతని శాశ్వతముగఁ జూచుటకే యీపుణ్యాత్ముఁడు వచ్చియున్నాఁడు,

కన్నులు తెఱువును. (వింటికొనం గంటిపై బొడుచును.)

తాట—(కన్నులు తెఱచి) ఎవఁడురా! కంటిలోఁ బొడిచినాఁడు?

లక్ష్మ—నేను,

తాట—(ఆవులించుచు లేచి) నీ వెవఁడవు?

లక్ష్మ—ఈతనిసోదరుఁడను.

తాట—(రామునివయిపు తిరిగి) నీ వెవఁడవు?

రామ—ఈ మహానుభావునివలన మహాస్త్రవిద్య నేర్చిన శిష్యుఁడను.

విశ్వా—తాటకా! నేనే నారాయణుని గురుఁడను. నీకుఁ గృతపరిచయుఁడను.

నార—అమ్మయ్యో! నాపేరు చెప్పితి రేల? నేనిట నుండ జాలను.

(పారిపోవును.)

తాట—ఓ మునిమ్రుచ్చా! ఋషిపక్షీ! నీవా? మారీచుం గారమున కాఁగ లేక, యీనడుమ బుజములు తెగిపోవ గాలిగోలఁది పారిపోయితివని వినియుంటిమే! తిరుగ గుత్తగొంబ మొగమున సందేశమున మాసన్నిధికి సిద్ధపడితివా? అట్లు చూచెద వేమి? గుడ్లు పీఁకెదను దూరకు! (మీఁదికిఁ బోవును.)

రామ—(ఆమె కడ్డముగఁ బోయి) గుహాంత్తమా! లక్ష్మణా! మీరా వృక్షముక్రింద విశ్రమింపుఁడు.

విశ్వా—(దూరముగఁ బోయి) (అపవారించి) ఓఃపాపుగడియ దఱుకుఁ జంపకుము. ఇంక వేళ కాలేదు.

రామ—తాటకా! మహాత్ములదూషించుట తప్పుకాదా?

తాట—నీ వేల యడ్డువచ్చెదవు? ఓసరిల్లు! ఊఁ—పో—పో!

ఖాఁడఁ బడునెడల నలిగిచచ్చెదవు. జేనెఁడు లేవు. కొంకెబద్దచేత సింగారించి కొండెసిగతో సిద్ధపడితివి. ఈవింటిపుల్లతో నాయొడలి మీఁది యీఁగలను గొట్టఁదలఁచితివా? తలలోని పేలను మట్టుమాపఁ దలఁచితివా?

రామ—ఛీ! ఛీ! నీప్రాణముల నేహరింపవచ్చితిని.

తాట—అబ్బ! అబ్బ! ప్రాణములనుహరించెదవటే! నాపాలు ద్రాఁగి యరగించుకొనఁగలవా? వామనా! దబ్బత్తుగా! గోగుపుల్లకుఁ దాఁడిచెట్టుతో గుటగుటలా? దోమకుఁ దోఁడేలుపై దండయాత్రయా? ఈముసలిముని ముండకొడుకు నిన్నిక్కడకుఁ దెచ్చినాఁడా? ఓస్! సితో నింకొక శొంటికాయగాఁ దున్నాఁడా? గొల్లభామలతోడను, ఇల్లిల్లులతోడను నాడుకోవలసిన కుఱ్ఱలు పెద్దపులి కోరలనదుమ ద్రోస్సు పెట్టవచ్చితిరా? సీతాకోకచిలుకల తాక్క లెక్క లాగువారు సింహపుజూలున వ్రేలాడఁదలఁచితిరా? నీకు మతి లేకున్న నిన్నుదెచ్చిన యాసన్యాసికి మతిలేదా? నిన్నుఁబంపిన యాసంసారికి మతి లేదా?

రామ—వారికి మతిలేకపోలేదు. నీకుమతి లేక—బ్రదుకగతి లేక—యిట్టికాఱులఱచుచున్నావు. నీమరణకాల మాసన్నమయినది. ఇఁక దాదాపుగ నాలుగునిముసములకంటె నెక్కువజీవింపవు. ఈయత్యంతస్వల్పకాలమును వ్యర్థపోనీయక పూర్వ మహాఘోరపాపకృత్యములకై నిశ్చలపశ్చాత్తాపమంది పరమేశ్వర లగ్నచిత్తవై ప్రాణములు విడుచుట నీకు శ్రేయస్కరము.

విశ్వా—(తనలో) జరుగునదంతే.

లక్ష్మ—(తనలో) వేగోలమునకు వేదాంతోపదేశమేల?

తాట—ఆఁ! ఆఁ! చిట్టెలుకకు సింహగర్జనమా? ఊర

కుండుకొలఁది నోరెక్కువగుచున్నది. ఎట్లు ? ఎట్లు? మేము చేసినవి ఘోరపాపకృత్యములా ? హోమకుండములరక్తవర్షములు కురిపించుట పాపమా? యజ్ఞశాలలకు నిప్పంటించుట పాపమా? మునికాంతలను దలకిందుగఁ జెట్లకు వ్రేలాడఁగట్టుట పాపమా ? వారి పిల్లలను యజ్ఞశాలాజ్య పాత్రముల దోరగవేయించి కమ్మఁగఁ గరకరలాడు చుండఁ దినుటపాపమా ? ఎవరికిఁ బాపము! దానివలన బాధనొందు వారి కదిపాపము—మా కేమి ? సంతోషమిచ్చునది పుణ్యము—బాధ నిచ్చునది పాపము—ఇదియే మాపుణ్యపాపవివక్ష. కాని, ప్రపంచ జ్ఞానశూన్యుఁడై—దయాదాక్షిణ్యశూన్యుఁడై—నిరుపయోగమైన దిక కర్మరతుఁడైన యీ మునివెంటవచ్చి నీతనువున పవిత్రముగఁ జేసికొని ప్రబలపాపము గట్టుకొనుటేల? చిన్నవాఁడవు—ఇంకఁ గొన్నియేండ్లు దాఁటినపిమ్మటఁ బొట్టపోసికొనఁ గలవాఁడవగుదువు నామనుమ రాలిసి—నీకంటెసగకుపైనింక నొక పిడికెడుమాత్రము పొడవు గల ముద్దులాఁడిని గట్టుకొనరాదా ? దాని వెంటఁబెట్టుకొని ముక్కు కొనవఱకుఁ ద్రావియామారరాత్రులందు శ్మశానములఁ జేరి క్షోణీ కుక్షివినిక్షిప్త శవములనుదిని, పుర్రెల బంతులాడుకొనుచుఁ బ్రేవు మాలలు ధరించి దిగంబరులై తాండవించుచుఁ గ్రీడించి సుఖమొంద రాదా ? గర్భవతులగు మునికాంతలనుబట్టి—

రాము—ఇఁక నోరుమూసికొనుము. ఇదిగో! నిన్నుఁ జంపె దను. కాచికొనుము.

తాట—చంపుదును, చంపుదునని యింత తెగసాగెదవేమి ? హేం! హేం! హేం! ఏదీ! చాపు! చంపుటయీబద్దతోడనేనా? ఈ బద్దనా తలగోట్టుకొనుటకుఁ గాదు కాని, పండ్లుకుట్టుటకు బనికివచ్చును. ఇటు తెమ్ము. (లాగుకొనఁబోయి విల్లుపట్టుకొ నను.)

రామ—సరే! లాగుకో!

తాట—రాదేమి?

రామ—రాకపోవునెపల చేతులువదలుము.

తాట—నీచేతిలోనుండి నీప్రాణములతోఁగూడ నిడలాఁగుకొనలేనా? ఊఁ! ఊఁ! అబ్బా! ఊఁ! రాదేమి! ఏమిది! సాలవృక్షములనవలీలగఁ బెకలించిన నేను—శైలములను బిండికిందఁ బడదన్నిన నేను—ఊఁ! ఊఁ! అబ్బ! రాదే! నీగొంతుకఁగోయ! నాచెంగాకాళియంత పొడవుంటివో లేదో—నాతోడఁ జెరపిన నీవంటివాండ్రెందఱగుదురో! ఊఁ! ఊఁ! అబ్బ! రాదే! లాండి తేఁకుంటివో లేదో—విల్లెంతగట్టిగఁ బట్టుకొంటివి! ఓరీ! జలగా! ఓరి! ముడుఁగుమూతివాఁడా! ఉఁ! అయ్యో! రాదేమి? పోనీ! విల్లులాగుకొనలేకపోయినపోనీ! నిన్ను నాదాడ నీదాడ వాయించలేకపోదునా? నిన్నెత్తి నెత్తిమీఁద నొకచేయి కాళ్ళక్రిందనొక చేయి బెట్టి—దిక్కులన చప్పళించి యరచేతులతో రసముతీసిపిప్పి నటుపారవేయలేకుందునా? నిన్ను రెండుకాళ్ళుపట్టి నిలువునఁ జీల్చి ప్రాడిపోవుచున్న యీచెవి రంధ్రములలోఁ బెట్టలేక పోవుదునా? పో! నీవిల్లెవతెకుఁ గావలయును? ఇదిగో గుద్దిపొడిచేసి రక్తముతోఁ బదనుచేసి మామనుమరాలికాళికి లత్తుకకై యుపయోగింతును. పో! (విల్లువదలి వైచుటకుఁ బ్రయత్నించును.) ఆఁ! ఆఁ! ఇదేమి! విల్లువదలెదనన్నఁ జేతులువదలిరావే! ఊఁ! ఊఁ! అయ్యో! అయ్యో! ఇదేమి? హా! హా! హా! (అఱచును.) ఊఁ! ఊఁ! (లాఁగుకొనును.)

రామ—తాటకా! నీచేతులమాడఁదీసికొనఁజాలవు. నావెంట నిమ్మళముగ రమ్ము.

(రాముఁడు పరిక్రమింపఁగఁ దాటకకూడవచ్చును.)

విశ్వా—(తనలో) సెబాస్! రామచంద్రా!

లక్ష్మ—(తనలో) ఆహాహా! అదేమి? దేహబలమా? యోగబలమా? అస్త్రబలమా? ఏమియు బోధపడకున్నది.

గీ. మంత్రిగాని వెంట ♦ మహీధరమట్లు పి
శాచగురుని వెంట ♦ శాకినివలె
నసుర దమను వెంట ♦ నాసురి చచ్చిన
ట్లిటులు రమ్మటన్న ♦ నటులువచ్చు,

రామ—ఇటు ఇటు.

తాట—"ఇటు. ఇటు" అని సుస్థిరముండకువలె దారిచూపింతువా? చేతులు స్వాధీనములేకున్నఁ గాళ్ళతో నెగిరితన్ని నిన్నుఁ బాతాళమునకుఁ బంపనైనలేనా? (ఎగురును) ఉఁ! ఊఁ! ఎగురుటకేగాని తన్నుటకుఁగాళ్ళు లేవకున్నవేమి? ఆకస్మికముగ నేదయిన వాతరోగమువచ్చినదా? రోగము వచ్చినయెడలమాత్రమీ నరమృగము నన్నిట్టి లేకుండునా? ఆఁ! ఆఁ! (నోరు తెఱచి) అల్లనేరేడుపండునువలె మింగెదను. గుటుక్కున మింగెదను. ఆ! ఆ! సీతలయంత దూరముగఁ బెట్టుక నెగవేమి?

లక్ష్మ—(తనలో) చండాలిసీ! కొఱుకుమని తల కోఱలసందునఁ బెట్టుమంటివా?

రామ—నేను దల వెన్నుకొఁ దీసికొనుటకాదు. సీతల ముందునకు సాగుటలేదు.

తాట—తలకూడవంగదా? ఊఁ! ఊఁ! హా! హా! హా! (నోరు తెఱచును) కొంచెము వంగుచునే యున్నదికాని సీతల తీసికొనిపోయి యీమూల పెట్టుకొన్న నేనెట్లు కొఱుకఁగలను?

రామ—వెట్టియాసలు పెట్టుకొనకుము. నాతల నీపండ్లనడు

మనునేఁబెట్టినను నీవు కొలుకఁజాలవు. కాని నిన్నట్లు ప్రత్యక్షముగ స్పృశింపనొల్లను కూడదరమ్ము ఇటు. ఇటు.

తాట — నన్నా మునియొద్ద కేలఁసికొనిపోయెదవు ?

రామ — ఆతఁడే నీకుత్తమగతిప్రదాత. ఆమహానుభావునికిఁ దలవంచి నమస్కృతినిఁ దెల్పుము. ఊఁ!

తాట — నాకీ బలాత్కార ప్రణామప్రబ్ధమేల ?

రామ — ఆమహానుభావుఁడు నిన్ను క్షమించు నెడల నీకుఁగొంత పాపశాంతి కాఁగలదు.

తాట — నన్నుఁ జంపఁదలఁచిన వాఁడవేనోరీతిగ శీఘ్రముగఁ జంపక యెందులకునన్నిట్లు బాధింతువు ?

రామ — తాటకా! చంపి పగఁ దీర్చుకొనుటయే నాపనియగు నెడల నీకును నాకు నేమియున భేదమున్నదా ?

గీ. కొట్టినయతండు పగదీర్చు ♦ కొనినయంతఁ
డిద్దఱును రాజశిక్షార్హు ♦ లేయగుదురు
పరనరునిపై స్వతంత్రతఁ ♦ బరయుకతన
పుడమిపతి శాసనముతానె ♦ నడపుకతన.
పాపములనొప్పుకొని యీప్ర ♦ పంచమందు
నర్హశిక్షనుగనునరుఁ ♦ డచటమరల
శిక్షనొందఁడు గానని ♦ శిక్షఁజేయఁ
బ్రభువునానతి ముని వెంట ♦ వచ్చినాఁడ.

కావున దోషములను మన్నింపుమని యామహాత్ముని వేడుకొనుము.

విశ్వా — (తనలో) సెబాస్! రామభద్రా!

లక్ష్మ — (విశ్వామిత్రునితో, నవ్వాఁరింది) మాయన్నగారెంత

మహానుభావులో! ఎంతకరుణామయులో!

తాట — మహాత్మా! గాధినందనా! ఒక్కనోరుతప్ప నేదియును స్వాధీనము లేదు. కాన, వాక్కులతోడనే నమస్కరించుచున్నాను. క్షమింపుఁడు.

విశ్వా — నీవింక ధన్యాత్మురాలవయితివి.

రామ — తాటకా! నీవిట మృతినొందుటఁజూడఁ బూజ్యులగు మునీశ్వరులకు వెగటుగనుండునుగానవేఁట నిర్ఝరఝురీ తీరమున సుస్నాతవై పరలోకమునకుఁ బోవుదువుగాని రమ్ము.

(రాముఁడు తాటకయు నిష్క్రమింతురు.)

లక్ష్మ — తాతగారూ! మాయన్నగారి చర్య విచిత్రముగ నున్నదండీ! ఇంతవారని నేనిదివఱకెఱిఁగియుండను. పనివచ్చినప్పుడే కాని మనుజుని గుణము లగుపడునా?

(నేపథ్యమున రాముఁడు)

గీ. ఖలసుబాహు మారీచ రా • క్షసులమాత
యైన తాటక గాచెను • తాబ్జభవుని
యూన పరలోకయానయా • కానవింక
ఋషులు నిర్విఘ్నయోగు ల • య్యెదరుగాక!

విశ్వా — తథాస్తు! (తనలో) ఇప్పుడుకూడ "మానియాన" ననియే యాతఁడు పలుకుచున్నాఁడు. కొంతనుజంపుట తన యిష్టము చేఁ గాదని వెల్లడించుచున్నాఁడు.

లక్ష్మ — ముందు చున్నవత్తిని జేయూఁపుచే నార్పినట్లు కొనసంత శబ్దమైనఁ గాకుండ నెల్లుగా వధించినాఁడో!

(నేపథ్యమున) హాహాహా! ఎవఁడురా! అక్కడే? మాఅమ్మను

వధించినకతినాత్ముఁడు. పట్టుకో! కొట్టు! పోకు! చంపు! తమ్ముఁడా! నీవిటురా! నేనటువత్తును. ఆఁగు! పోకు!

లక్ష్మ—ఆహా! యిద్దఱు రక్కసులు మాయయన్నయ్యమీఁదఁ గదలఁకోఁ బడుచున్నారు. నేను సహాయుఁడనై పోవుదును. (లేచును.)

విశ్వా—వత్సా! కూరుచుండుము. రాక్షసలోక మారకునకు నీసాహాయ్యమేమి? నాప్రోత్సాహమేమి?

లక్ష్మ—అదేమి? ఆరాక్షసుఁడట్లె గాలిలోఁ గొట్టుకొని పోవుచున్నాఁడేమి?

విశ్వా—రామచంద్రుని వాయవ్యాస్త్ర వేగమున నాతఁడట్లు కొట్టుకొనిపోవుచున్నాఁడు.

రాము—(ప్రవేశించి) సుబాహుఁడా! దైవ ధ్యాన మొనర్చు కొనుచుండుము.

విశ్వా—సెబాస్! సుబాహుఁడు కూలినాఁడు.

లక్ష్మ—అన్నయ్యా! రమ్ము. (కౌఁగలించుకొనుచున్నాఁడు.)

రాము—గురూత్తమా! నమస్కారము. మీశిష్యుఁడేఁడీ?

నా·రా—(ప్రవేశించి) ఇచ్చటనేయున్నాను, నాకు భయము చేఁబోలేదు. రాక్షసులు దగ్గఱకు వచ్చినయెడల మైల పడుదునని కొంచెము దూరముగఁబోయితిని.

విశ్వా—నాయజ్ఞమున కింకేమియు భంగము జరుగనేరదు. నేను కృతార్థుఁడనైతిని.

రాము—కాని, మారీచుఁడుచావలేదు. ఆతఁడు ముందునాపైఁ బగతీర్చుకొనుట నిస్సందేహము,

గీ. కష్టనిష్ఠుర భావిరా ♦ ఘువధమునకును
మిగిలె నతఁడు నాటక బీజ ♦ మగుటకొఱకు;

నప్పుడొక లాపపుగంతు • లాడవచ్చు
నిపుడు ముందంకమేదో వి • న్పింపవలయు.

విశ్వా—ఇఁక ముందుచేయవలసినదేదనఁగ, నాయాశ్రమము నకుఁబోయి యచ్చట యజ్ఞమాచరించుకొని వెంటనే జనకభూపతి దేశమున కేగవలయును.

లక్ష్మ—మేము మహారాజకుమారులముగదా! ఆరాజుదేశమునకు మేమేల ?

రామ—తమ్ముఁడా! మహారాజపుత్త్రులమైనను మునివరుని దాసులముకదా! వారిసందేశమునకు మనకారణపృచ్ఛయేల ?

విశ్వా—ఈస్థలమంతయు రాక్షసపదవిన్యాసమున బూడిదరేఁగి యున్నది. కొంచెము దూరముగఁబోయి యట శయనించి యరుణోదయమున బయలుదేఱి పోవుదము. ర. డు.

(అందఱు నిష్క్రమింతురు.)

శ్రీ

# కల్యాణరాఘవము.

## పంచమాంకము.

ప్రదేశము—మిథిలాపురము.

ప్రవేశము—జనకుఁడు, శతానందుఁడు, విశ్వామిత్రుఁడు రాముఁడు, లక్ష్మణుఁడు.

విశ్వా—జనకచక్రవర్తీ! ముమ్మాటికి యన నేల?

జన—ఒక మాటు కాదు. రెండు మాటులు కాదు. ముమ్మాటికి ధన్యుఁడ.

గీ. యతుల రాకచే ధన్యుఁడ; హితుని సుతులఁ
గనఁగఁ దిరుగ ధన్యుఁడ; మహో గ్రస్వభావ
తాటకాఘ్నుల కాతిథ్య ధర్మకలన
జరుపధన్యుఁడ; మూఁడవ పట్టినిమఱుల.

లక్ష్మ—రాజేంద్రా! మీహితుని సుతులము మేమిద్దఱమగుదుము. తాటకాఘ్నులని మీరు చెప్పుచున్నారు. కాని తాటకాంత

కులము మేమిద్దఱముకాము. అసహాయ శూరుఁడయిన మాయన్నగారగు శ్రీరామచంద్రుఁడొక్కఁడే గాక మీరు కొంచెము సవరించుకొని యనన్యముగ నాకుఁ బంచియిచ్చిన గౌరవమును మాయన్నగారి కొసఁగుఁడు.

రాము — (నవ్వుచు) తమ్ముఁడా! బహువచనప్రయోగ మేల?

జన — వత్సా! రామానుజా! తాటకాఘ్నులని మాయన్నగారిని బహు వచనప్రయోగముచే గౌరవించితివని యనుకొనరాదా?

రామ — రాజేంద్రా! మునిప్రభావమున జరిగిన పనికినన్నుఁ బెద్దసేయనేల?

జన — సెబాస్!

గీ. పండ్లఁబోలు పెను ఫిరంగి ♦ గుండ్లఁబోలు
వజ్రములఁబోలు భవ్య దీ ♦ పములఁబోలు
భువిని స్ఫటిక సాలగ్రామ ♦ ములనుబోలు
సుతులఁగను దశరథు భాగ్య ♦ మహితరంబు.

విశ్వా — రాజేంద్రా! ఈమాత్రమునకే యొకటి, రెండు, మూఁడు సారులు ధన్యుఁడనయితినని గణించుకొనుచున్నావా! నాలుగవసారి, యైదవసారికూడ ధన్యుఁడవు కాఁదలఁచియున్నావు.

జన — మహానుభావా! అదెట్లు? ముందునాలుగవసారిధన్యత యెట్టిదో సెలవిచ్చెదరా?

రామ — (అపవారించి) మహాత్మా, సంక్షేపముగఁ జెప్పుఁడు.

విశ్వా — (తలరామునివంక నూఁపి) జనకరాజేంద్రా! మీ పురోహితుఁడగు నీశతానందునకు జరిగిన మహోపకారము మీకుఁ

జరిగినట్లేకదా!

జన—ఇంకను సందేహమా? నాకు జరిగినకంటె నెక్కువ.

శతా—నాకట్టి యుపకార మేమి?

విశ్వా—

సీ. అసువుపోనున్న రోగిని • హస్తశుద్ధి
బ్రదుకఁ జేయునాతఁడె భగ • వంతుఁడనఁగ
జచ్చిపోయినయట్టి దేహిని • చరణశుద్ధి
బ్రదుకఁ జేసిన యాతఁడే • పాటివాఁడొ?

జన—నాకేమియుఁ దెలియలేదు.

శతా—ఆఁ! ఆఁ! మునిచంద్రమా! నాకు గుండెలు కొట్టుకొనుచున్నవి. మాతల్లిగారే! మాతల్లిగారే!

విశ్వా—

గీ. ఆకురాలున నట్టి మో • డైన తీఁగె
మాఁకు పునరాకఁ జిగిరించి • మనెడుకరణి
రమణుకోపంబుచే నైన • రాతిబొమ్మ
కల్లు రాముని దయముద్దు • గుమ్మయయ్యె.

శతా—ఆహా! రామచంద్రా! మాయమ్మగారిని బ్రదికించితివా? (రామునిఁ గౌఁగిలించుకొని) ఎంత మహోపకార మొనర్చితివి. వయసుచే నీకంటె పెద్దవాఁడనుగావున నమస్కరింపలేదు. క్షమింపుము.

రామ—మహాత్మా! మీరట్లు సెలవీయఁ దగునా? ఇందుకు

నేఁజేసిన మహాపుణ్యమేమున్నది ?

జన—ఆఁ! ఆఁ! మాయింటి కతిథివై దయచేసిన యాతఁడహల్యాశాపవిమోచకుఁడా ? ఏమి నాధన్యత !

విశ్వా—నాలుగవసారి ధన్యత యేదో చెప్పితివా ?

జన—ఇఁక నైదవసారి దేమో దయచేసి చెప్పెదరా ?

విశ్వా—దాని యవసరమునఁ జెప్పెదను.

శతా—రామచంద్రా ! ఇందున "నేమి పుణ్యము చేసితి" నని యనుటన్యాయమా !

గీ. కాంతను ద్యజించుకాంతుంతోఁ ♦ గాంతఁజేర్పఁ
గలుగుపుణ్యంబె యింతంత ♦ గాదనంగఁ;
దల్లి నెడఁ బాయుపుత్త్రుని ♦ దల్లిఁగూర్పు
పరమపుణ్యంబునకు భూమి ♦ పట్టఁగలదె ?
పితదయానుఁ బొర్తిపపుటంటూ ♦ వెలయుఁగొంత ;
సుతునిదయకై హెుకపుసాక్కు ♦ సుంతకలదు ;
పతిదయకు మట్టిరంగు కా ♦ నెంతయుందుఁ ;
దల్లిదయశుద్ధ దివ్యత ♦ త్త్వంబొకండె.

రామ—

కనవుతోనున్న మణియాడ్చి ♦ వినరివైవ
పీఠినున్నాతనికెది ల ♦ భింపవచ్చు ;
దానిచే వాఁడు భాగ్యంబుఁ ♦ గానవచ్చు
నూడ్చుసేవకు పుణ్యమేం ♦ మున్నదిందు ?
కలిసిబూడిద నున్న యం ♦ గారకణము

రథ్యలోఁ బాఱవైవఁగఁ • బ్రక్కతాటి
కి మ్రదడికాలి యూరెంత • గాలవచ్చు
నూడ్చు సేవకు పాపమే • మున్నదిందు?
నిదురఁ దిట్టిన తిట్టులు • నింద్యమగునె?
నిదుర దేవార్చనలు శుభా • స్పదములగునె?
మనసుతో లంకెలేని నా • మాన్యకృతుల
పాపపుణ్యచింతన సేయ • వలనుపడదు.
ఇట్లె నేవచ్చువేళ నా • దృచ్ఛికముగ
నాపదరజంబు ఱాతిని • నాతిఁ జేసె
నేమియు నెఱుంగఁ దెల్లవో • యి నిలఁబడితి
యిట్టినన్నుఁ బెద్దసేయుదు • రేల మీరు.

శతా—ఇట్లువచియించుచున్న నీతో నేనేమనఁగలను?

విశ్వా—(తనలో) స్తుతివాక్యములు వినుటచేఁ గాఁబోలు రాముని మొగ మెఱుపెక్కినది. (ప్రకాశముగ) శ్రీరామపదరజము సోకినవెంటనే శాపమును బాయుమవని మీతండ్రిగారు మీతల్లిగారికి గడువుఁబెట్టిరి. శతానందా! అట్టిరామమూర్తి నిందుకై తెచ్చిననన్ను స్తుతింప మఱచుట న్యాయమా? (నవ్వును)

శతా—మీరునాకు బిత్రుసములు, మీదయ నెన్నఁడైనమఱతునా! ఈమహోపకారమునకు మీకేమియాలము.

లక్ష్మ—(అపవారించి) అన్నయ్యా! కొంచెము మస్తిమితముగ నున్నట్లున్నారేమి?

రామ—విశేషమేమియు లేదు.

గీ. కత్తిపోటులు తనువును ♦ గాయపఱచుఁ;
దిట్టుపోటులు జీవంబుఁ ♦ దెగఁగఁజేయు
స్తుతుల వేఁటులు చిత్తంబు ♦ తుటుము సేయు
మెత్తనైన పదమ్మునెక్కె ♦ మిగులఁగోఁత.

లక్ష్మ—ఆతనికి జరిగిన మహోపకారముచే నాతఁడు తన కృతజ్ఞతను విశేషముగ వెల్లడించుచున్నాఁడు. మన్నింపఁదగును.

శతా—మాతల్లిగారు మాతండ్రిగారిగారి యాశ్రమమునకుఁ బోయిరా?

విశ్వా—ఎప్పుడు రామభద్రుఁడు వచ్చునో, యెప్పుడాతని పదరజస్స్పర్శమున ఱాయి రమణియగునో యని నిరీక్షించుచుఁ దత్సమీపముననే గౌతమర్షి యున్నాఁడు. అహల్య నాతఁడే యాశ్రమమునకుఁ దీసికొనిపోయెను

శతా—సంతోషము.

జన—శతానందగురువరా! సాధ్యమైనంతత్వరలో మీరాశ్రమమునకుఁ దయచేసి తల్లిగారిని దర్శించి సేవించి తిరుగ నిటకు దయచేయుదురుగాక!

శతా—అటులే.

జన—గాధినందనా! అయిదవధన్యత యేదో యన్యావసరమున నానతిచ్చెదమని సెలవిచ్చితిరి. అది సీతాకళ్యాణమును గూర్చినదే యగు నెడల నేనత్యంత ధన్యుఁడనుగదా!

విశ్వా—శివధనుస్సు సజ్యము చేయుటకానిదే సీతకుఁ గల్యాణ మెట్లు?

జన.—అదియే వచ్చిన పెద్దయుపరోధము. ఎఱింగియో యెఱుఁగకయో యిద్ది పణముగాఁ జేసియుంటిని. ఎవ్వఁడు నాదివ్యధనువును సమీపింపనైన నేరకున్నాఁడు. సీతకు మూఁడుముళ్లు పడునో యేమియుఁ దోఁచకున్నది.

లక్ష్మ—(తనలో) మాయన్నగారు హరధనువును సజ్యము చేసిన బాగుగనుండును.

జన—

గీ. కన్యకల్యాణ శుభవయః ♦ కలితయయ్యె;
వరుఁడె కానంగబడఁడయ్యె, ♦ హరునివిల్లు
వంపుమాట యటుంచుఁడు ♦ వసట నదుము
మాపు, సిగ్గునఁ దలవంపుఁ ♦ బడుదునిపుడు.

విశ్వా—(తనలో) వరుఁడు గానఁబడఁడనుచున్నాఁడు. నిజమే! చక్షురతీత తేజస్సంపన్నుఁడగు శ్రీరాముఁ డట్టివాఁడే!

జన—

గీ. పచ్చతోరణ మెటుఁ గంటఁ ♦ బడిన సీత
పెండ్లియెప్పుడని నామోము ♦ వెల్లఁబోవు
వీరణపుమ్రోఁత లెటులైన ♦ వినఁగబడిన
దుహిత పెండ్లెప్పుడని గుండె ♦ దుడుకులాడు.
బొమ్మరిండ్లకుఁ బెండ్లి సలిపెద ♦ భూమికిప్పు
వేగ రమ్మమ్మ జానకి ♦ విందుఁ జెప్ప
నీకుఁ గలిగిన యుచితత ♦ నాకుఁ గల్గ
దమ్మయనియెడి సిగ్గంది ♦ యార్తిఁ బడుదు.

కొడుకుకంటెను గూఁతురు ♦ కూర్చువస్తు
సైన నద్దాని నేకష్ట ♦ మైనఁబడుమఁ
త్వరఁగ వదలుచుకొనుదాఁక ♦ దండ్రియోర్వఁ
డకట! యిదియేమిచోద్యమో ♦ యవనిఁబోఁద.
అమ్మలక్కలంద ♦ అంతఃపురినిఁజేరి
యింక నూరకుంటి ♦ రేల యనుచు
నాదురాణి నడుగ ♦ ఖేదావిలాస్యయై
పులుకుపులుకు నన్ను ♦ నలుకఁజూచు.

సీ. పెద్ద కన్నులవాఁడు ♦ ప్రియదర్శనమువాఁడు
పదునైదు పదునాఱు ♦ వయసువాఁడు
చాపకళాశాలి ♦ శాంతస్వభావుఁడు
వేదవేదాంగ సం ♦ విద్వరుండు
నిశ్చలతేజుఁడు ♦ నిర్మలరూపుఁడు
నిత్యసంస్మిత ముఖ ♦ నీరజుండు
లోకమనోహరుఁ ♦ డేకపత్నీవ్రతుఁ
డతులసత్వాఢ్య భా ♦ హార్గళుండు
సైన రాసుతుఁ గని జూన ♦ కమ్మనీవు
ప్రేమగ్రహింపుమనుచుఁ బ్రా ♦ ర్థించుటకును
హరధనుఃకార్య మొకటి ♦ యడ్డుదగిలె
నద్దినెఱవేఱు టెఱవేదొ ♦ యకట! యెఱుఁగ.

లక్ష్మి—(తనలో) ఈరాజ మాయన్నగారినే యభివర్ణించుచున్నట్లున్నది. (ప్రకాశముగ) రామచంద్రా! శివధనుస్సు వంచు శూరుఁడే లేఁడని యీరాజు మిగుల పరితాపపడుచున్నాఁడు. మీరు వంచఁగలరని యీయనతో జెప్పుమని విశ్వామిత్రుఁడు తారగారితో

నేను మెల్లఁగఁ జెప్పనా ?

రామ—(అపవారించి) తమ్ముఁడా ! నీకేమియలకో ? ఊరకుండుము.

లక్ష్మ—(తనలో) ఈసమయమునవిశ్వామిత్రుఁడేమియుఁబలుకక యూరకుండెనేమో ? అదిగో ! ఏమియో చెప్పుటకు గాఁబోలు గొంతు సవరించుకొనుచున్నాఁడు.

విశ్వా—రాజేంద్రా ! ఆఁడుపడుచునుగాంచిన యాతనియార్తి యింతయని చెప్పఁదరముగాదు, కన్యకుఁ బెండ్లియగునంతమాత్రమున నదిసరిపోవునది కాదు.

గీ. అత్తప్రీతియో, కోఁతయో ♦ యాఁడుబిడ్డ
బొమ్మబోధింపో, సాధింపో ♦ బోసిమామ
పెట్టో, తిట్టో పెద్దమఱఁది ♦ వెలఁది నెనరో,
కనరో ; తోటికోడండ్రదో ♦ కట్టొరట్టో.
అన్ని యిట్లుండ నటుమీఁద ♦ నంతిపురిని
మగనిముద్దో గుద్దో పడు ♦ క గదిఁగునుకొ
కులటయొడిని గుటకొకూఁతు ♦ కుక్షియెంతో
నిండో యని కన్నవారొందు ♦ నగులదెంతో !

లక్ష్మ—(తనలో)ఓస్ ! ఈమాట లేవఁడెఱుఁగఁడు ? ఇదియా యిప్పుడీతఁడు పలుకవలసినది !

జన—

గీ. ఏకకన్యఁగాంచి ♦ యొసఁగెడువానికే
యిట్టిబాధయనఁగ ♦ నింటనల్వు

రాఁకుబిడ్డలున్న • యాతనిబాధ యిం
కెంతయో యెఱుంగ • నేవనితనము ?

శతా—మిగిలిన మువ్వురినిఁగూర్చియు నంత చింత యుండవలసినపనిలేదు. వారిసంగతి లోకముతోఁ పాటిదే యగును. జానకమ్మ సంగతియే లోకాతీతమయినది. అదియైన నీధనుర్వ్యవహారమున నట్లయినది.

జన—మహాత్మా! అందునుగూర్చియే యాందోళన మెక్కువగనున్నది. గాధిపుత్రా! శంకరచాపము సజ్యముచేయు నాతఁడెవఁడు లభింపకుండు నెడల నేమికావలసినది ? ఎంతకాల మందులకై నిరీక్షింపవలసినది ?

లక్ష్మ—(తనలో) ఈసారి విశ్వామిత్రుఁడు మాయన్నగారిని గూర్చి చెప్పకుండు నెడ నేనే తెగిపడి చెప్పెదను. ఏమి ? ఇంకను విశ్వామిత్రుఁడు మాటలాడఁడేమి ? (లక్ష్మణుఁడు లేచును.)

రామ— (అతనిఁ గూర్చుండఁబెట్టి యూరకుండుమని సంజ్ఞ సేయును.)

లక్ష్మ—(అపవారించి రామునితో) ఈరాజేంద్రునిమాటలు నేను సహింపఁజాలను. ధనుస్సు వంచునాతఁడు లభియింపఁ డనుచున్నాఁడు. జగతి నిర్వీర్యమైపోయెననుకొనినాఁడా? మహావీరులగు మీయెదుట నీమాటలువిని నేనూరకుండఁగలనా ?

రామ—(అపవారించి)తమ్ముఁడా ! ఇదికోపమునకదనుకాదు, మనగురువుగారే యుచితరీతిని జెప్పెదరు.

లక్ష్మ—(తనలో) నీళ్ళు నములుచున్నట్లు మునిమాటలాడునుగాని విడఁగొట్టి తెగవ్రేసి రెండు తునకలగునట్లు మాటలాడలేఁడా.

అదిగో! ఉపదేశముద్రను బట్టుచున్నాఁడు. ఏమి మాటలాడునో విందము.

విశ్వా—రాజేంద్రా! నీకంతయాందోళనమక్కఱలేదు. ధనువును వంచుటకు శ్రీరామచంద్రుఁడర్హుఁడు.

లక్ష్మ—(తనలో) అద్ది! వినఁదగినమాఁటలు వినఁబడినవి.

జన—చిత్తము. అటులైన నంతకంటె సంతోషమేమి?

లక్ష్మ—అటులైన నను సందేహముతో నిమిత్తమేమున్నది?

విశ్వా—ఇందుకొఱకే రామునిటకె నేను దీసికొనివచ్చితిని.

లక్ష్మ—బాహుబలపరీక్షానన్నివేశమిటనుంటచే రామభద్రుఁడిటకువిచ్చేసెను. కాని యనాహూతుఁడై ఈరాజునింటికేలవచ్చును?

జన—(అపవారించి) గాధినందనా! బాణాసురుఁడు, కార్తవీర్యార్జునుఁడు మొదలగు మహాభుజబలాఢ్యులు వింటినెత్తి కదుపనేలేకపోయిరి. శ్రీరామచంద్రుఁడు చిన్నవారిలోమహాపరాక్రమశాలి. ప్రబలభుజాబల సంపన్నుఁడే కాని సహస్రభుజులకే యసాధ్యమగు నీమహాకార్యము నిర్వహింపనోపునా?

విశ్వా—(అపవారించినవ్వుచు) ఓపునో లేదో చూడవచ్చును.

జన—ఇదిగో! మనము ముందుబాగుగ నాలోచించుకొనకుండ రామభద్రు నీపనికి బూనుకొనునట్లు చేయుట నాకిష్టములేదు.

విశ్వా—(అపవారించి) అట్లంటివేమి?

జన—(అపవారించి)మఱేమియుఁ లేదు,ఒకవేళ నాతఁడువిల్లెక్కుపెట్టలేకుండినయెడల సహస్రచంద్రమండలసంకాశమగు నాతనివదనమండలము చిన్నబోవదా? అట్టిమొగమును నేను జూడలేకుండుటచే

నిట్లు చెప్పుచున్నాను. కావున రామభద్రుఁడు విల్లువంపఁబూనుట నా కిష్టముగ లేదు.

విశ్వా—(అపవారించి) పణమును బెట్టుటవఱకే నీయిష్టము గాని యటుపైన నీయిష్టమేమున్నది ?

జన—(అపవారించి) అది నిజమేకాని యీధనుస్సు ప్రభావము శ్రీరామచంద్రునితో మీరిదివఱకు సెలవిచ్చితిరా ?

విశ్వా—చెప్పినయట్లులే చెప్పినాను. దాని నీవు వంపవలసి యుండునని నేను చెప్పలేదు.

జన—నేనిప్పుడు చెప్పనా ? మీరు చెప్పెదరా ?

విశ్వా—నీవు చెప్పకుండునెడల నాతఁడు పూనుకొనునా ? పిమ్మట నేను చెప్పెదను.

జన—శ్రీరామచంద్రా ! గాధేయసవన సంరక్షకై యీదేశ ప్రాంతమునకువచ్చి పూర్వపుణ్యవశమున నాకు దర్శనమిచ్చితివి. మహానందభరితుఁడనైతిని. శివచాపము నెక్కువెట్టినవానికినాకూఁతు నిచ్చెదనని దీక్షయొనర్చితినని యిదివఱకు జరిగియున్న మాటలవలన వినియుందువు. విల్లు వంచుటకుఁ గార్తవీర్యార్జునాది వీరులువచ్చి విముఖులైపోయిరి. ఆవిల్లువంచఁగల మహాపురుషుఁడెవ్వఁడునుగానఁ బడలేదు. రాక్షసక్షోదనక్షమాక్షీణభుజాబల విశేషుఁడవగు నీవిందులకు సమర్థుఁడవయి యుందువు కావున—

విశ్వా—రామభద్రా ! అవశ్యము హరుచాపమును సజ్యము చేయుము.

రామ—రాజేంద్రా ! అనేకాస్త్రములొసఁగి యనేకశక్తులఁ గటాక్షించి, యాసురబలరహస్యములెన్నియో వెల్లడించి, తాను

నాకు సమీపమున గూర్చుండి, చంపవలసిన నిమిషమునుగూడ నిర్దేశించి, మాగురుఁడగు నీమహర్షిశిఖామణి రాక్షసుల నాచేఁజంపించినాఁడు. యథార్థముగ నాతనికి నాపైనున్న కటాక్షమే యసుర హనన కారణము కాని నాబాహువులలో నున్న సత్వము కాదు ఇప్పుడుకూడ నామహానుభావుని కటాక్షమే కాలకంఠధనువును వంపఁగలదు.

జన—(తనలో) ఆహాహా! ఏమిసౌజన్యము!

లక్ష్మ—(తనలో) ప్రాణమైన వదలుకొనవచ్చునుగాని చేసిన గొప్పపని మని మెప్పును వదలుకొనుట యీతనికిఁదక్క మఱెవ్వరికి సాధ్యము.

శతా—ఆహా! శ్రీరామమూర్తివంటినిరహంభావస్వభావునెచ్చటను గనివినియుండలేదు.

గీ. చేయకుండఁ జేసితినని ♦ చెప్పునాతఁ
డధముఁడు, రవంత చేసి కొం ♦ డంత చేసి
నాఁడననువాఁడు గర్వి, యెం ♦ తయొయొనర్చి
నుంతఁ జేసితిననువాఁడు ♦ సుజనుఁడిలను.
సర్వలోకోపకార వి ♦ స్తారకార్య
వారమొనరించి భగవంతు ♦ వైభవంబొ
శిష్టకరుణయొ దానిని ♦ జేసెననుచు
తన్ను మఱచెడువాఁడెపో ♦ దైవమిలను.

జన—గురూత్తమా! బాగుగ సెలవిచ్చితిరి. అట్టిమహానుభావుఁడు హరధనువువంచి, నాకన్యనువరించి, నాచిత్తఖేదమునుబాపిం

చినన్నుఁ గృతార్థుని జేయఁగలఁడని తోఁచుచున్నది.

విశ్వా—ఊహములతోఁడ నింకఁగాలక్షేపమేల? ఆధనువునిటకు దెప్పింపుము.

జన—ఇప్పుడే యీకార్యము జరిగింపుమని సెలవా?

విశ్వా—శుభము సంకల్పించిన వెంటనే జరుపవలసినది కాదా?

జన—చిత్తము. ధనువీ వెనుకనేయున్నది. సేవకా! ఈద్వారము దెఱువుము.

(తెరయెత్తగఁ బుష్పమాలాద్యలంకృతంబగు నొక్కగద్దెపైహర ధనువు గానఁబడును)

అందఱు—(లేచినమస్కరించి) ఓం! హరహర! మహాదేవ శంభూ!

లక్ష్మ—(తనలో) ఓస్! ఈమాత్రపుధనువునే యెవరువంచ లేకపోయిరా?

జన—(రామచంద్రునిఁ గౌఁగలించుకొని) నాయనా! రామచంద్రా! ఇటువచ్చి దానిని సజ్యముచేసెదవా?

విశ్వా—రాజేంద్రా! ఉండు. రామచంద్రా! తొందరలేదు. జనకచక్రవర్తీ! జానకినిటకుఁ బిలిపింపుము.

రామ—(తనలో) ఆహా! నామనసులోని యూహమే నీనోట నుండి వెడలినదికదా! మహాత్మా!

జన—గాధినందనా! రాణివాసమున నున్న జానకియిటకేల?

విశ్వా—తండ్రియొద్ద రాణివాసమేల? ఈముసలిమునిముచ్చుల యొద్ద రాణివాసమేల? భర్తయొద్ద రాణివాసమేల? పుత్రుఁడైన

సౌమిత్రియొద్ద రాణివాసమేల?

లక్ష్మ—సెబాస్ ! గురూత్తమా ! బాగుగఁబలికితివి.

రామ—(తనలో)ఆహా ! మునీశ్వరా ! నీవాక్యమమోఘము కదా !

జన—

సీ॥ భర్గచాపమింక ♦ బల్లపై యుండఁగ
భర్తయనుచు రామ ♦ భద్రునంటి
భవసమాన తేజ! ♦ భవదీయవాక్యంబు
బహుళభవ్యభార ♦ భరితమయ్యె.

సేవకా! జానకి నిటకుఁ బంపుమని రాణిగారితోఁ జెప్పుము.

రామ—(తనలో) హృదయమా !

సీ. ఘోరవాకార రాక్షస ♦ వీరదర్శ
నమున నిసుమంతయుంజకు జెం ♦ దకయయుండి
మృదులమృదులాంగి సీత నీ ♦ క్షింపఁదలఁచి
తొడికెదేల యిప్పుడె మొత్త ♦ బడెదవేల ?
ఇలను సుఖదుఃఖ భాగార్థ ♦ ములకు శాశ్వ
తముగ సీతోడ గూర్పు కోఁ ♦ దలఁచినట్టి
సుదతివచ్చు దడఁబడక ♦ చూడుమయ్య
ప్రథమదర్శనమతి కృతా ♦ ర్థంబుగాదె?

[జానకియు మృదులయుఁ బ్రవేశింతురు.]

జాన—ఎవ్వరో కొత్తవారున్నట్లున్నారు (పోఁబోవును.)

రాము — ఆహాహా !

జన — (ముందునకుఁబోయి జానకిని బట్టుకొని) అమ్మా! పోనక్క-ఱలేదు, ఈతాతల నెఱుఁగనే యెఱుగుదువుకదా ! ఆరాజ కుమారులలో

గీ. పాకమాత్రికుఁబోలెఁ ♦ బొడుగైనవానిని
పచ్చనైన పట్టు ♦ బట్టువాని

తల్లీ ! తలవంచుకొనెద వేల ? (గడ్డముపట్టుకొని) ఇదిగో ! చూడు.

మొయిలు హాయలు మేని ♦ మురిపముల్గలవాని
పరమతేజమైన ♦ వానిగనుము!

జాన — (తనలో) కన్నులు మూసికొనినను నావఁహామహుని దివ్యతేజము అెప్పలగుండ కన్నులలోఁ బ్రవేశించి యొడలంతఁ బ్రకాశింపఁజేయుచున్నదే! ఇచ్చట సాక్షాత్కరించినది నాతపఃఫలమైన దైవమైయుండునా ?

రాము — (తనలో)

గీ. మేఘమిచటనుండ ♦ మెఱుపచ్చటను నేల
ఈవిచిత్రిచాంప ♦ మేల నడుము !
భవునిధనువు వేగ ♦ వంచియో త్రెంచియో
నిన్ను నన్ను నన్ను ♦ నిన్నొనర్తు.

జన — అమ్మా! నేజెప్పిన కాంతిని జూచితివా ? మాటలాడవేమిజా-కీ?

జాన — అబ్బా! ఏదులకు ?

జనక — అదేమి ? కన్నులేల్ల మూసికొందు వేల ?

జాన—(తనలో) లోనంబ్రవేశించిన యీమహనీయ తేజోరాశి తిరుగ బైకి బోవునేమోయని వెఱ్ఱిపడికన్నులుమూసికొంటినిగాని ఱెప్పలుదూరి లోజొరంబారిన కాంతి ఱెప్పలు తెఱచిన నైనం బోవునా? (కన్నులు తెఱచును.)

జన—అమ్మా! కన్నులు తెఱువుము సిగ్గుపడక చూడుము. ఇతండె దాశరథిరామచంద్రుండు (నవ్వుచు) ఆతండు నిన్నుం బెండ్లిచేసికొనునంట. ఏమందువు?

జాన—(నిమ్మళముగ) హరధనువుమాట?

లక్ష్మ—(తనలో) సెబాస్! వీరకన్యకా! మారామచంద్రునకు నీవేతగుదువు.

రాము—(తనలో) హరధనువు వంచిన తరువాతనే

జాన—తండ్రీ! నన్నువదలుము. (జానకిమృదులను జేరును.)

మృదుల—(అప)సీతమ్మా! ఎంతయదృష్టవంతురాలవమ్మా!

జాన—(అప) చూడు. చూడు. మాచెల్లెలూర్మిళకు సౌమిత్రి మిక్కిలితగియున్నాఁడుసుమా!

మృదుల—అమ్మా! నీపెండ్లికాకుండనే నీచెల్లెలికిం బెండ్లి జేరపుమాటలా!

రామ—రాజేంద్రా! గురూత్తమా! ఇంక ధనువు నొద్దకు వెడలవచ్చునా?

విశ్వా—అభ్యంతరమేమి?

రాము—తమ్ముఁడా! ఈవిల్లు నీయొద్దనుంచెదవా?

(ఇచ్చి ధనుస్సునొద్దకు నిమ్మళముగఁబోవును.)

జన—(తనలో)అన్నియునను కూలముగనున్నవి. ఈధనుస్సేమి చేయునో?

గీ. హర! శశాంకరేఖాధర! యాశ్రితార్తి
హర! యెపుడు నైహికపు దేవు లాటగదుగ
నెదియు నొకటికోరెద క్షమి యింపు మిపుడు
సీత రామునకిల్లాలిఁ జేయుమయ్య.

రాము—(గద్దెనుఁజేరి ప్రదక్షిణమునుఁ జేయును.)

హర! త్రిపురహర! గజదైత్య హర! పదాబ్జ
భక్తకృతపాపచయ హర! ప్రసవబాణ
విపులమద హర! భూమీశ తపవనహర!
ఏను నీవిల్లువంతు క్షమింపుమయ్య.

జాన—(తనలో) రామప్రభూ! మాకులదేవతలు మిమ్ముల సఫలమనోరథులఁ జేయుదురుగాక!

రాము—(తనలో) విల్లెట్లు వంచెదనోయని జానకి నన్నుఁ గ్రేగంటఁజూచుచున్నది. ఆహా! కృతార్థుఁడనుగదా! (ప్రకాశముగా) విల్లందుకొనుటకనుజ్ఞయేకదా?

విశ్వా—హరప్రసాదోస్తు.

రాము—ఇదుగో. (పూలమాలికను జేతితో నెత్తును.)

(లక్ష్మణుఁడు తక్క నందఱు నవ్వుదురు.)

లక్ష్మ—ఆహా! ప్రమాదము. రామమూర్తి సీతాకుసుమకోమలవిన్యస్తహృదయుఁడై పుష్పమాలిక నెత్తెనుకాఁబోలు. (కోపముతో) ఆయనయభిప్రాయము నెఱుఁగకుండనట్టినవ్వులన్యాయమా? రాజేంద్రా! నీవామాలికఁ దీసికొని శ్రీసీతాదేవికిమ్ము దాని నేమి చేయవలయునో ఆమెయే యెఱుఁగును.

జన—(తీసికొని) అనఘా! ఇది తీసికొనుము.

రాము—(ధనుస్సును రెండు చేతులతో నెత్తును.)

జనక—ఆహా! ఆహా! ఈమాత్రము చేయఁగలిగితివి. ఇంక వంచినట్లే.

సీత—(అప. మృదులతో) కార్తవీర్యార్జునుఁడు సహస్రబాహువులతో గింజుకొనిన నొక్క కోటిర్వైన లేచినది కాదు.

విశ్వా—రామచంద్రా! ఏల సందేహింతువు?

రామ—మహాత్మా! విల్లు మిగుల పాతది, బెండువలె నున్నది. వంచుమని యనుచున్నారు. ఏమియగునోయని సంకోచించుచున్నాను.

జన—సెబాస్! మహావీరాగ్రణీ! సెబాస్! లోకోత్తర సత్ప్రభావా!—

సీత—(తనలో) సందేహింపకుము—వంచుటనీశక్తినిఁబరీక్షించుటకొఱకుగాదు. లోకులకు నీప్రభావముఁ దెలియఁజేయుట కొఱకు కాదు. నన్నుఁజెట్టపట్టుటకొఱకు. శ్రీరామచంద్రా! వేగము వంచుము. వడఁకుచున్న గాలుసేతులతో జాలనేపు నిలువబడ లేకుంటిని!

రాను—(వింటినెడమచేతఁగొని నారి నెక్కువెట్టి త్రిప్పుమను. ధ్వనితో విల్లు వగులును.)

జన—విఱుచుట వంచుటకంటెఁ బైమెట్టుకదా! (సీతవంకఁ దిరిగి) అమ్మా! చూచెదవేలా?

సీత—(పఱుగునవచ్చి రాముని మెడలోఁ బుష్పమాలికను వైచును.)

విశ్వా—జయూ! కల్యాణరాఘవా!

జన—జయూ! కల్యాణరాఘవా!

శత—జయా! కల్యాణరాఘవా!

లక్ష్మ—జయా! కల్యాణరాఘవా!

జాన—తండ్రీ! నేనింక మాయమ్మయొద్దకుఁబోవుదును.

(పోఁబోవును.)

జన—అమ్మా! కొంచెము సేపువలకుండుము. మృదులా! నీవు లోని మంగళపుటారతి పళ్ళెరమును వేగఁదెమ్ము (మృదులపోవును.)

విశ్వా—అగ్న్యావసరమున నయిదవధన్యత యేదియో చెప్పెద నంటినే! అది యిదియే.

జన—మహాత్మా! ఈశుభమునకంతయు మీయనుగ్రహమే మూలకందము.

శత—ఒకనియిల్లు నిలువఁ బెట్టినసుకృతమెంత సద్యఃఫలప్రద మయినది!

రాము—తమ్ముఁడొక్కఁడును గొలఁదిదూరమున నిలువఁ బడినాఁడు. నేనాతని నింకఁ జేరవచ్చునా?

జన—ఇదిగో! వధూవరులకు నివాళులయినపిమ్మట—

(మృదుల పళ్లెరముతోఁ బ్రవేశించును.)

మంగళపుటారతి—సురట.

మృదుల— మంగళం శ్రీజానకీరాములకు మంగళం

జనక కనకరాశిజానకికి, జలజాప్తకులరామచంద్రునకు, మానితశుభ

గుణమాణిక్యములకు మీకు మంగళం

హాటకహారి దేహలతకు తాటకమరణ సంధానునకు। పాటలాధర

మణి భాసితులకు మీకు ॥మంగళం॥

పురహరభక్తుని పుత్రికకు హరచాప సంపాటనాఢ్యునకు । కర
మరుదగు వధూవరులకు నిరుపరకు ॥మంగళం॥

రాము—తన మెడలోని రత్నహారమునుదీసి పళ్లెరములో నుంచును.

జనక—మృదులా! బాగుగ బాడితివి. శివభక్తుని పుత్రికకు శివధనుఃఖండనునకుఁ గల్యాణమగుటచేతనే వధూవరులు కరమరుదగువారుకారు. అయోనిసంభవకు నహల్యాచాపవిమోచనునకుఁగల యిక గలుగుటచేననికూడ చెప్పవచ్చును.

మృదు—చిత్తము! ఇదిగో! ఈరత్నహారము మీయల్లుఁడు గారు నాకుఁ గటాక్షించినారు.

జన—అల్లుఁడుగా రిచ్చినారనఁగ నూఁతు రీయలేదనియా? అమ్మా!

జాన—(ముత్యాలహారమిచ్చును.) తండ్రీ! నేను లోనికేగెదను. (మృదులతోఁ బోవును.)

రామ—(అపవారించి లక్ష్మణునిఁగాఁగిలించుకొని) ఈరాజేంద్రునికింక నుఁకూఁతులున్నారఁట కాదా—సిగ్గుపడెద వేల? తమ్ముఁడా!

విశ్వా—ఊర్మిళా, మాండవీ. శ్రుతకీర్తులను లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు వరుసగనిచ్చి సీతాకల్యాణముతో నీనూఁడు వివాహములు శీఘ్రముగఁ జేయుము.

జన—మాహూర్తమును స్థిరపఱచెదను. దశరథునితో నిట్లు వియ్యమొందఁగలభాగ్యము మీకరుణచే లభించెను. వెంటనే శుభలేఖలను వ్రాయించి దశరథమహారాజునకుఁ బంపించెదను.

విశ్వా—తథాస్తు. మేముమానివాసములకింకఁ బోయెదము. జానకీరామా! రామానుజా! నావెంటరండు.

జన—(రామలక్ష్మణులఁ గౌగిలించుకొని) వెళ్ళుఁడు. (విశ్వామిత్రుఁడు రామలక్ష్మణులతో నిష్క్రమించును)

శతా—నేనాశ్రమమునకుఁ బోయి మాతల్లిగారిఁ గాంచెదను.

జన—చిత్తము. (శతానందుఁడు పోవును)

గీ. వృక్షమునభీతినొకపక్షి ♦ యెగిరిపోవ
నన్నిపక్షులు నెగిరిన ♦ యట్లుగాఁగ
చిత్తమునఁగల్గునొకచింత ♦ చెదరిపోవ
చింతలన్నియొకప్పుఁడు ♦ చెదరిపోవు ॥

అంతఃపురమీఁదినమున నెంతకలకలలాఁడుచుండును!

గీ. అంతిపురిరాణిమున్నటి ♦ హాస్యహాస్య
లన్ని 'యహహా' లుగామార్పు ♦ నందుఁగాదె:
అమ్మలక్కలమున్నటివైన ♦ బుగ్గపోట్లు
ముక్కువ్రేళులుగనుమారి ♦ పోవుఁగాదె.

ఈవినోదమును నేను గూడఁ జూచెదను.

(నిష్క్రమించును.)

శ్రీ

# కల్యాణరాఘవము.

## షష్ఠాంకము.

ప్రదేశము—సాకేతపురము.

ప్రవేశము—శంకరుఁడు.

శంక—ఇన్నాళ్ళు ఉల్లిపొరవంటి యొక్క గుడ్డ. చేసినాఁడు నాల్గు పెండ్లిండ్లు నాల్గుకుంచెముల నివ్వరిధాన్యము మూటఁగట్టుటకై బుఱ్ఱయున్న గుడ్డ నీయకపోయిన నేదేవుఁడిచ్చినాఁడు. నారాయణా! నారాయణా!

నారా—(ప్రవేశించి) ఏమోయీ! శంకరా! ఏమి చేయుచున్నావు?

శంక—ఏమున్నది? ఏడ్చుచున్నాను. వసిష్ఠగురువుగారి శిష్యుఁడను వియ్యంకునిగారిగురువుగారి శిష్యుఁడనుగదా! ఆమాత్రపుఁజిన్న పెద్ద తారతమ్యమునక్కఱలేదా? ఇదిగో! ఈగుడ్డ నా జనకచక్రవర్తి నాకిచ్చుట! చెఱగువులో గట్టిలేకపోవచ్చునుగాని యాశ్రయించిన కొమ్మ గట్టిదే కాదా! నీకేమి యిచ్చినాఁడు?

నారా — రెండు కాశ్మీరపు సేలువలిచ్చినాఁడు. మూఁడుపట్టు గోముఖములిచ్చినాఁడు. రెండు మృగచర్మము లిచ్చినాఁడు. రెండు పావుకలజోళ్లనిచ్చినాఁడు. ఇంకనేమేమో —

శంక — ఇయ్యఁడా మజ్జి — మీగురువుగారు మాటమేకు. మావసిష్ఠయ్యవట్టి మేకుముక్క! శిష్యునకుసరియైనబహూకృతినీయనియెడలఁ దనకిచ్చిన బహుమతులఁగూడ గిరగిరదిప్పి యిచ్చినవానిమొగము మీఁద గొట్టునిర్భయస్వభావముగల వాఁడుమీగురుఁడు. ఇఁక మాయయ్యవారు తనకీయకున్ననరే. తనశిష్యునకీయకున్ననరే. కణగు లేదు మెఱుగు లేదు. చూపెట్టుపు లేదు. మాటచుఱుకు లేదు.

నారా — అట్లందు వేల? మనగురువులనుబట్టి మనకిచ్చినారా! పండితసంభావనకు నీవునేనుఁగూడ సిద్ధపడితిమి. పరీక్షాధికారులు నాకొసఁగవలసినట్లు నాకొసఁగినారు. నీకీయవలసినట్లు నీకిచ్చినారు. ఇది జనకచక్రవర్తిగారి కేమి తెలియును ఇందులో మనగురువుల కేమి జోక్యమున్నది. వెనుకనేమైనను నిన్న జరిగిన గృహప్రవేశమహోత్సవములలో నీకమూల్యబహూకృతులు లభించినవి కావా?

శంక — నల్గురుకొడుకుల పెండ్లిండ్లయ్యెను; నల్గురుకోడండ్రింటి కొక్కసారి వచ్చుటయ్యెను. నేనుకులపురోహితుని శిష్యుఁడనైతిని. గృహప్రవేశోత్సవములలో నామాత్రపుబహుమానములైన నాకు లేకుండవలయునా? మీవిశ్వామిత్రగురువుగారు మిథిలాపురమునుండితిన్నగఁ దనయాశ్రమమునకే పోయెననంటివి కాదా? సాకేతపురమునకుఁ దిరుగనేల వచ్చినారు?

నారా — మీ రాజుగారి బహూకృతిచేత యిచ్చుటవేడుకలు చూచుటకువచ్చినారు.

శంక—అవి యయినవికావా?

నారా—ఈదినమే ప్రయాణము. రాజుగారియొద్ద సెలవు తీసికొనుటకు వెళ్ళినారు.

శంక—మాగురువుగారుకూడఁ గోటలోనేయున్నారా?

నారా—లేరు.

శంక—అటులైన వెంటనే యాయన పరిచర్యకై నేను బోవలయును.

నారా—నేను గోటముందుఁ గనిపెట్టియుండి రాజుగారితో మాటలాడిరావేగమే మాగురువుగారిని గలిసి మాయాశ్రమమునకుఁ బోయెదను. సెలవు.

శంక—మంచిది; దయయుంచుము.

(నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

# షష్ఠాంకము.

ప్రదేశము—రాజసభ.

ప్రవేశము—దశరథుఁడు, విశ్వామిత్రుఁడు.

విశ్వా—ఊఁ! హూ! ఊఁ! హూ!

దశ—ఇఁక లెక్క మూఁడు దినములు మాత్రమాఁగుఁడు.

విశ్వా—ఇఁక నాఁగ వీలులేదు. వదాన్యాగ్రగణ్యుఁడవై రామలక్ష్మణుల నీవు నాకిచ్చిననాఁడీయూరు వచ్చితిని. చాలకాల మయినది.

దశ—నాదాతృత్వ మనుగనక్కఱలేదు. నేను మీయెడలఁ గఠినుఁడగు ఋణప్రదాతవలె నాచరించితిని.

విశ్వా—ఏల?

దశ—రెండువస్తువులు మీకప్పనిచ్చితిని. తిరుగ నాఱువస్తువులఁ దీసికొంటినిగాదా!

విశ్వా—ఇచ్చిన యసలు మొత్తమునే భద్రముగ నీకుఁ దిఱుగ నీయలేనని మొదటఁ గొంత జడిసితివికావా!

దశ—క్షమింపవలయును. మీపరిభావ మెఱుఁగక—

విశ్వా—కాదు. రామచంద్రుని పరిభావ మెఱుఁగకయనుము. అతఁడు పరశురామగర్వభంగ మెంతవిలాసముగఁ జేసెనో కన్నాఱఁ జూచితివికాదా!

దశ—మహాత్మా! చూచితిని. ఇప్పటికాసన్నివేశము తలఁచుకొన్న నొడలు గగురుపొడచుచున్నది.

విశ్వా—పుత్త్రిమాహాత్మ్యముచే ఘనతనొందు తంత్రములలో నీవు పరిపరిథముండవు. ఉత్తమోత్తముండవు. జ్ఞానమునుఁబట్టియే కర్మమున కాధిక్యము.

దశ—నేనే మీవెంటవచ్చియుండు నెడలఁ దాటకాదులఁ జంపి నను గౌతమకాంతాశాపవిమోచనముఁ జేసియుండఁగలనా!

విశ్వా—ఇఁక నట్టి మాటలేల! నేనిప్పుడే బయలుదేఱి యాశ్రమమునకుఁ బోవలయును

దశ—ఒక్క అరగడియసేపయినను నుండరా?

విశ్వా—నీయుక్త నెంతసేపుకూర్చుండినఁ గూర్చుండవలయు ననియే యుండును. కాని ప్రయాణముహూర్తము సమీపించినది. పోవలయును.

దశ—నమస్కారము.

విశ్వా—కల్యాణమస్తు. అయిననిక్కడ నింక నేనుండి చేయవలసినదేమున్నది.

దశ—సమకూర్పవలసిన శుభములన్నియుసమకూర్చినేకూర్చినారు. ఒక్కమనవి.

విశ్వా—అదేమి?

దశ—నేను పెద్దవాఁడనైతిని. రామచంద్రునకుఁ బట్టాభిషేకముచేసి నేను మీవెంటనే మీయాశ్రమమునకు రానెంచితిని. అందులకే మిమ్ము మూఁడు దినములుండ నాగుఁడని నేను బ్రార్థించితిని.

విశ్వా—అర్హసమయమున నదియునగును. తొందరయేల?

దశ—తలఁచుకొన్నపని యెంతత్వరగనైననంత మంచిదికాదా?

విశ్వా—ఈమాట యిప్పటికి నాప్రయాణమునకై వది-
కీయుదును. నేను బోవుచుంటిని. ఇఁకఁ గావలసిన దేమి ?

శ్రీ—కృతార్థుఁడనైతిని. ఏమియువలదు. ఇకనిట్లుకోరెదను

గీ. ధరణి యీతిబాధలు లేక ♦ తనరుఁగాక !
ద్విజల యన్యోన్య వైరము ♦ ల్బాయుఁగాక !
కవిత రాజపోషణమునఁ ♦ గ్రాలుఁగాక !
నీతిపాలనమున రాజు ♦ నెగడుఁగాక !

విశ్వా—తథాస్తు! తథాస్తు!

(నిష్క్రమింతురు.)

సంపూర్ణము.